
ఆంధ్ర
సచిత్ర
వారపత్రిక
22-6-73 50 పైసలు



"కన్నె వయసు" చిత్రంలో రోజారమణి.



బలం సమర్పించు
శ్రీరమణ చిత్ర ఇంటర్నేషనల్ వారి
దేవుడమ్మ
దర్శకత్వం: కె.వి. నందనరావు

సినీ బ్యూటీ బులెటిన్

మీ (మా) పత్రిక తే 1.6.73 దీలో 'సినీ బ్యూగో బులెటిన్ లేక అందానికి చిట్కాలు'లో

'డాక్టర్ సలహాలు' శీర్షికకి రాసేవారు తమ పేరు, పూర్తి చిరునామాలని రాయటం అవసరం. ప్రశ్నలు వీలైనంత చిన్నవిగా ఉండేలా రాయాలి. అందరికీ ఉపయోగకరమైన ప్రశ్నలని కూడా పంపవచ్చు. ప్రశ్నలని 'డాక్టర్ సలహాలు, ఆంధ్రసచిత్రవారపత్రిక. 7, తంబుచెట్టు స్ట్రీట్, మదరాసు—1'కి పంపాలి.

ఉత్తరాలు

ఎన్నడను యిచ్చారు. కాని ఏభాషలో ఉత్తరాలు వ్రాయాలి.

—టి. నీలకంఠేశ్వరరావు (విజయనగరం)

జవాబు:

*** ఇంగ్లీషులో రాస్తే బాగుంటుందని మా అభిప్రాయం.**

—సం॥

ముఖచిత్రం

1—6—73 నాడు హిందీనటుడు "శతృఘ్న సిన్హా" ముఖచిత్రంతో వెలువడిన "ఆంధ్రసచిత్ర వారపత్రిక" చాలా కర్షణీయముగాయున్నది. హిందీనటులు ముఖచిత్రములు చాల అరుదు. హిందీ నటుల ముఖచిత్రములు ఎక్కువగా వేయవలెను.

—కె. జగన్నాధరాజ వంతులు గారు, రాజా చీపురుపల్లి.

* *

హిందీనటుడు, శతృఘ్నసిన్హా గారి ముఖచిత్రంతో వెలువడిన 1—6—73 నాటి 'వారపత్రిక' అత్యాకర్షణీయంగా వుంది. ఆయన ఫోటో మీ పత్రిక ద్వారా మేము చూడటం యిదే మొదటిసారి. సినీఫీల్డ్ లో విలన్ గా నటించినా, అతను ముఖచిత్రంలో మాత్రం అభిమానవంతుడులా, అందంగా వున్నారు. హిందీ నటీ—నటుల ఫోటోలు తరచు వేస్తూ పాఠకుల ఆదరాభిమానాని పొందుదురని ఆశిస్తూ యున్నాం.

—పక్కి గోపాలకృష్ణ పట్నాయిక్, దుర్గ, దుర్గలక్ష్మి, ఎస్. జె. మన్మధరావు, వంశధార ఆర్. ఎస్. (ఒరిస్సా)

* * *

మీ 1—6—73 నాటి పత్రిక శతృఘ్నసిన్హా యొక్క కలర్ ఫోటో చాలా అద్బుతంగా ఉన్నది.

—బి.వి. బదిరినారాయణరావు (హుజూర్ నగర్)

'శతృఘ్న సిన్హా' ముఖచిత్రంతో వెలువడిన ఆం. స. వా. ప. లోని సినిమా శీర్షిక చాలబాగుంది. ఆశీర్షికలో అద్వితీయ నటుడు శ్రీ శోభన్ బాబు గురించి అద్భుతంగా వ్రాశారు. శ్రీ శోభన్ తెలుగు చిత్రపరిశ్రమకే కంఠాభరణము.

శ్రీ శోభన్ 1971 లో ఫిలింఫేర్ ఎవార్డు పొందారు. అంతటి మహోన్నత నటుడు ఆంధ్ర సచిత్ర వారపత్రిక బ్యాలెట్ లో సహాయనటుడుగా (నాడు, నేడు కూడ) ఎన్నికగుట శోచనీయం. ఏది ఏమైనా ఉత్తమనటుడుగా అక్కినేని తర్వాత స్థానం పొందుట గర్వించ తగ్గ విషయం. కాని ఉత్తమనటన గల చిత్రాన్ని కూడ బ్యాలట్ లో వ్రాయవలెననే నిబంధన ఉంటే ఇంకా బాగుండేది. ఇకముందు ఆవిధంగా చేస్తే బాగుంటుంది.

వి. భాస్కర్ ప్రసాద్ శర్మ
సెక్రటరీ, శోభన్ బాబు స్టూడెంట్స్ అసోసియేషన్, విశాఖపట్నం—4.

కథలు

25—5—73 పత్రికలో పద్మశ్రీగారి ఒక ఆదర్శవాది కథ చాలా బావుంది. చెట్టు పేరుచెప్పి కాయలమ్ముకొంటున్న రాజకీయవాదుల చేతుల్లో మన దేశం ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పద్మశ్రీ గారు చాల చక్కని కథవ్రాసి తమ భావాలను చాలా చక్కగా వ్యక్తపరచారు. వారికి నా ధన్యవాదములు.

—శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, (రావుపల్లి)

ప్రత్యేక రాష్ట్ర సమస్య

ముల్కీ నిబంధనల విషయమై మీరు మా పాఠక లోకానికి ఇచ్చిన అవకాశాన్ని పురస్కరించుకొని నా అభిప్రాయాన్ని వెల్లడించటానికి సంసిద్ధుడనైనాను.

మొన్న నేను ఏ.జి.ఆఫీస్ లో వ్రాతపరీక్ష నిమిత్తమై హైదరాబాద్ వెళ్లాను. అక్కడ నేను సుమారు ఇరవై రోజులు గడిపాను. అక్కడ నేను గమనించిన ముఖ్యవిషయ మేమనగా అక్కడి ప్రజలలో ఎవరిలోను వీడు తెలంగాణావాడని, వాడు ఆంధ్రా వాడని బేధభావం నాకు కన్పించలేదు. అక్కడి ప్రజలు అందరు ఎంతో సమైక్యంగానూ ఇటు ఆఫీసులలో నైతేనేమి అటు బజారులో నైతేనేమి వీడు ముల్కీ అని వాడు నాన్ముల్కీ అనెడి భేదభావం లేశమైన లేక ఎంతో సఖ్యతతో కలసి,మెలసి ఎవరిపనులు వారు చేసుకొంటున్నారు.

పాలు పొంగే తెలుగు గడ్డను అనవసరంగా ఏకొద్ది మంది స్వభావాపేక్షల కొరకై, సంఘద్రోహులు, రాజకీయ ఆశావాదుల నిమిత్తమై రెండుగా చీల్చుట ఎంతమాత్రము తగదు. ఇన్నాళ్లు సఖ్యతతో, సమైక్యతతో మెలగిన ఈ ఆంధ్రులు విడిపోతామనిభావము ఎక్కడా లేశమైనలేనినాడు ఎందుకీ ఉద్యమాలు? మన ఆంధ్రజాతి ప్రగతి సాధించాలంటే మనరాష్ట్రం అన్నపూర్ణగా భారతదేశం మొత్తంమీద వెలుగొందాలంటే మనమందరం కలసి వుండటం ఎంతో అవశ్యకం.

—గాదె సుబ్బారావు (బరంపురం)

* * *


విశాఖ ఉక్కుఫ్యాక్టరీ గురించి కేంద్రమంత్రి మోహనకుమారమంగళం చేస్తున్న ప్రకటనలు అయిష్టతతో కూడినట్టివిగా కనిపించుచున్నవి. కాగా విశాఖ ఫ్యాక్టరీ కుక్క చింపిన విస్తరిగా చేసి నష్టదాయకమైనదిగా సృష్టించుటకు కుమారమంగళం కుట్రపన్నుచున్నట్లు తోయుచున్నది. ఇప్పటికే శ్రీ కుమారమంగళంగారు విశాఖఉక్కు ఫ్యాక్టరీ శక్తి ప్రమాణాలపై సంప్రదింపుదారులు త్వరలో తుది నిర్ణయం తీసుకొంటారని ప్రకటనలు చేయుచున్నారు. ఇది ఆంధ్రులను పరీక్షించటానికి వేసిన ఎత్తు. ఈ ప్రకటనపై ఆంధ్రులలో చలనం

గౌరీ శంకర పిక్చర్స్

తల్లీ కొడుకులు

స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: పి. చంద్రశేఖరరెడ్డి బి.ఎ.

నిర్మాతలు: గుమ్మడి వీరయ్య, రామినేని కోటేశ్వరరావు



లేకుంటే ఫ్యాక్టరీ ప్రమాణం తగ్గటం ఖాయం. ఒకసారి నిర్ణయించబడిన ఫ్యాక్టరీ ప్రమాణంపై పదేపదే మార్పుకు ఇస్తున్న అవకాశం, మంగళంగారి కుటిల రాజనీతికి ప్రత్యక్ష తార్కాణం. నష్టప్రాతిపదికపై ప్రమాణం తగ్గించే యోచనలో గనుక శ్రీ మంగళం గారుంటే, అదే ప్రాతిపదికపై భారతదేశంలో గల ఉక్కుఫ్యాక్టరీ లన్నిటిని విస్తృతపరచుకొనే పథకాన్ని వదులుకొమ్మనే ఆంధ్రుల కోరికని ఎదుర్కోవటానికి శ్రీమాన్ మంగళంగారు సిద్ధంగా ఉండాలి.

విశాఖఫ్యాక్టరీకై గోదావరి జలాలు మళ్ళింపు పథకానికి సర్వుల ఆమోదం లభించియుండగా, విశాఖ ఫ్యాక్టరీ శక్తి ప్రమాణాలపై తుది నిర్ణయాల దృష్ట్యా గోదావరి జలాల స్కీముపై సలహాదారుల సలహా కూడా గైకొనవలసియున్నదని, అందుకు కొంతకాలం పట్టవచ్చునని కుమారమంగళం చేసిన ప్రకటనకు ఆంధ్రులు నిరశన తెలియపర్చవలసిఉంది. ఈ మాదిరిగా కొంతకాలం పట్టవచ్చునని, ఫ్యాక్టరీ ప్రమాణంపై త్వరలో తుదినిర్ణయం తీసుకుంటారని ప్రకటనలు చేయుట కాలంగడపటానికనేది స్పష్టం. ఇలా కాలం గడిపి అడిగినప్పుడల్లా రేపు రేపంటూ వినాయకుడి పెళ్ళిలా కాలంగడిపేయటం చూస్తుంటే, ఆంధ్రుల పారిశ్రామికాభివృద్ధికి శ్రీ మోహనకుమారమంగళం ప్రథమ ఆటంకంగాను, ఆంధ్రులపట్ల కుమారమంగళం ప్రవర్తన ద్రోహ చింతనతో కూడినట్టిదిగాను తోయుచున్నది. ప్రాంతీయాభిమానంతో ప్రవర్తించుచున్న ఇట్టి మంత్రి దేశానికే ప్రమాదం.

అసలు విశాఖ ఉక్కుఫ్యాక్టరీకే గాక, విశాఖ నగరానికి ప్రత్యేకంగా గోదావరి జలాల మళ్ళింపు నూటికినూరుపాళ్ళు అవసరంగాక అవసరం. అట్టి మళ్ళింపు పథకానికిగాని, ఫ్యాక్టరీ ప్రమాణానికి గాని శ్రీ మంగళంగారు ఏమైనా మంగళం పాడదలకున్నారో, ఆంధ్రులు యావత్తు శ్రీ మంగళం గా మంత్రిపదవికి మంగళం పాడించాలి. ఈ మంత్రి గారు పదవిలో ఉన్నంతకాలం ఆంధ్రులపరిశ్రమలకు అడ్డు తగులుతూనే ఉంటాడు, ఈయన తక్షణం రాజీనామా చేసితీరాలి.

గోదావరి జలాల మళ్ళింపుపథకం, కాకినాడ ఎరువులరి

ఉత్తరాలు

ఫ్యాక్టరీ, విశాఖఎరువుల ఫ్యాక్టరీ, విజయవాడ థర్మల్ స్టేషన్ల కొరకు, ఒక్కొక్కదానికి ఒక్కొక్క ఉద్యమం లేవదీయడానికి ఆంధ్రులు సిద్ధంగా ఉండాలి డాలి.

నాల్గవ ప్రణాళికలో నిర్మించనున్న 9 విద్యుత్ కేంద్రాలలో అపుడే మూడింటిని తారాపూర్, కోట, కల్పకం (మద్రాసు)న కిచ్చినారు. మిగిలిన ఆరింటిలో ఆంధ్రులకు రెండైనా ఇచ్చితీరాలి. ఆ రెంటిలో ఒకటి అణువిద్యుత్ కేంద్రమవ్వాలి. ఆంధ్రులు దానికొరకై మంత్రులపై ఒత్తిడి తేవాలి. ఇష్టారా సరి, లేదా మళ్ళీ ఎజిటేషన్. ఆంధ్రుల బ్రతుకంటేనే అల్లరిబ్రతుకైపోయింది. నాథుడు లేక. ఇవి సాధిస్తే ఆంధ్రుడెక్కాల్సిన పదిమెట్లలో ఒక మెక్కినట్లు లెఖ్ఖ. జై ఆంధ్ర.

—మానేరామమూర్తి, దేవునితోట (పాలకొల్లు)

* * *

ఆంధ్ర రచయితల కవుల సమాచారాన్ని తెలియజేసే సర్వ సమగ్ర నిఘంటువు ఈనాటి వరకు తెలుగునాట తయారు చేయబడలేదు. నేను ఈ పనికి పూనుకొని ప్రణాళికను సిద్ధం చేసుకొని పని సాగిస్తున్నాను. నన్నయకంటె ముందు నుంచి ప్రారంభించి నేటి వరకు గల ప్రతి రచయితను ఈ నిఘంటువులో చేర్చడం జరుగుతుంది.

ఇందుకు పూజ్యులు శ్రీ పురిపండా అప్పలస్వామి గారి ఆశీర్వచనం ప్రోత్సాహం లభించింది. దాదాపు 2 వేల మంది వివరాలు లభించాయి.


రచయితలు. 1జననం. 2. జీవిత విశేషాలు 3. రచనలు —మొదలైన వివరాలు క్లుప్తంగా ఈ దిగువ చిరునామాకు పంప ప్రార్థన. విరివిగా వివరాలు కూడా పంపి ప్రణాళికకు ఒక్కచేతి మీదుగా సాగుతున్న కృషికి ప్రోత్సాహం అందించ గోరుతున్నాను.

—మానేపల్లి సత్యనారాయణ. ఎం.ఏ.లిట్. సంపాదకుడు, ఆంధ్ర రచయితల కవుల సర్వసమగ్ర నిఘంటువు, నళినీ ప్రచురణలు, విజయనగరం—1.

ఆంధ్రసచిత్ర వారపత్రిక
వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938—1972)
శుక్రవారం : 22-6-73
శ్రీప్రమాదినామ సం॥ జ్యేష్ఠ మా. బ. షష్ఠి
సంపుటము : 66 సంచిక : 40
స్థాపితం 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1
విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక

ముఖచిత్రం నర్తకి కిస్‌మిస్
(ఫోటో: శ్రీ ఇ. వి. ఎస్. వదన్)


మంత్రిత్వ శాఖల మార్పుకి అంగీకరిస్తారా?
కేంద్ర మంత్రివర్గం పునర్నిర్మాణానికి ఆలోచన
ఈ పజిల్‌కి సమాధానం ఇంకా చాలా దూరంలో ఉంది
ఆంధ్ర సమస్య
ఆధారాలు
మునిగిపోతున్న డాలర్
వాటర్‌గేట్ వ్యవహారం
మనదగ్గరున్న బంగారం అమ్మి డబ్బు చేసుకోవాల్సిన సమయం ఇదే
ఛా ఛా! అసలు బంగారాన్ని ఆభరణాల రూపంలో పెట్టుబడి పెట్టాల్సిన తరుణమిది- వాటి విలువ పెరుగుతుంది
విపరీతంగా పెరిగిన బంగారం ధర

హైదరాబాద్ నోట్‌బుక్


తిరుమల రామచంద్ర

శ్రీ బ్రహ్మానందరెడ్డి సూచన

ఇప్పటి రాజకీయ ప్రతిష్టంభనకు పరిష్కారం త్వరలో కుదరగలదని శ్రీ బ్రహ్మానందరెడ్డి మే 27 వ తేదీన ప్రకటించిన భావాన్నిబట్టి త్వరలో నూతన మంత్రివర్గం నెలకొనవచ్చుననే ఊహాగానం మరొకమారు జంటనగరాల రాజకీయ వర్గాలలో వినిపిస్తున్నది. శ్రీ బ్రహ్మానందరెడ్డిని కలుసుకోని నాయకులంటూ ఒక్కరూ లేరు; ప్రత్యేకవాదులు, సమైక్యవాదులు, దేహళీ దీపవాదులు, కుడ్యమార్జాలవాదులు — అందరూ కలుసుకున్నారు; 'నీవేతప్ప నితఃపరంబెరుగ' అని అన్నవారూ ఉన్నట్టు వినికిడి. అయితే శ్రీ రెడ్డి సూచించినట్టు, పదికాలాలపాటు మనగల పరిష్కారం కావాలంటే. ఉభయ పక్షాలు కొంతత్యాగం— కొంతమాత్రమే— చూపడం అవసరం. అదేమీ కాకుండా వాక్చాతుర్యంతో, వ్యాఖ్యానబలంతో, పద ప్రయోగ పాటవంతో జరిగే ప్రసంగాలు, ఒప్పందాలు ఏమీ తోడ్పడవు. దేనినైనా స్థిరపరచేది త్యాగమే — త్యాగేనైకే అమృతత్వమానశుః.

కరువులపై కరకుపాదాలు

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు శ్రీ నరోత్తమరెడ్డి కరువు నివారణకు యువజనోద్యమం సందర్భంగా మే 4 వ వారంలో లింగపల్లిలో తొలి యువక శిబిరానికి ప్రారంభోత్సవం చేస్తూ, నగర యువకులకు, గ్రామప్రజలకు మధ్య ఏర్పడిన అంతరాన్ని తొలగించడానికి విద్యార్థులు సేతువు వంటివారు కావాలనడం ప్రతి యువకుడూ, యువతి వినదగినమాట. పట్టణవాసానికి అలవాటయినవారు పల్లె పట్లను తొంగిచూడడానికే జంకుతారు. ఈ మనస్తత్వం నాలుగు దశాబ్దాల క్రితం మరీ యిదిగా ఉండేది. ఇప్పుడెంతో మేలు. మన యువకులు విదేశాలతో సంబంధం కలిగడంవల్ల మనసు మారినవారయినారు. ఈ యువజనోద్యమం చాల ముఖ్యమయినదని, దీనివల్ల కలిగే భోగట్టాతో, ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెట్టడానికి సావకాశం కలుగుతుందనీ ఆయన అన్నారు. ఇలాటి ప్రయోగం చేస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని ఉద్యమ సమన్వయకర్త శ్రీ లవణం అన్నారు. అల్వాల్‌లో ఆరంభమైన బాలికల శిబిరంలో ప్రభుత్వం సేవా మందిరాల తాలూకు 15 మంది యువతులు ఉన్నత వంశాల మహిళలతో కలిసి పని చేస్తున్నారు. కాని, జిల్లాలలోని కొన్ని శిబిరాలలో కొందరు స్వార్థపరుల జోక్యం వల్ల పనికి విఘ్నం ఏర్పడుతున్న దనడానికి నల్లగొండ శిబిరం పరిస్థితులు పేర్కొనవచ్చు. శిబిర నిర్వాహకుడు శ్రీ సలీమ్ తన బాధను తెలియజేశారు.



నెహ్రూకు జోహార్లు

శ్రీ పి. వి. నరసింహారావు అధ్యక్షతన మే 27 న నెహ్రూ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో జరిగిన సభలో శ్రీ నూకల రామచంద్రారెడ్డి, శ్రీ చొక్కారావు మొదలయినవారు నెహ్రూకు జోహార్లర్పించారు. 'భారతదేశం ఇరుగు పొరుగు దేశాలలో ప్రజాస్వామ్యానికే ముప్పు ఏర్పడినప్పుడు ప్రజాస్వామ్యాన్ని రక్షించడం శ్రీ నెహ్రూ స్వాతంత్ర్యానంతరం సాధించిన ప్రధానాంశాలలో ఒకటి. పంచవర్ష ప్రణాళికలద్వారా, దేశాన్ని స్వావలంబన మార్గంలో నడపించడం రెండవ ప్రధానాంశం.' అన్నారు శ్రీ పి. వి. నరసింహారావు.

అమెరికాలో ఏడు కొండలవాడు

ఇరవైయొక్క లక్షల రూపాయల వ్యయంతో న్యూయార్క్‌లోని ఫ్లషింగ్ అనే ప్రాంతంలో నిర్మింపబోయే 'వెంకటేశ్వర పంచాయతనం' — వేంకటే


శ్వర, పద్మావతి, శివ, వినాయక షణ్ముఖ దేవాయతనాలకు తగు సలహాలివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీ కొండపల్లి వాసుదేవరావు, శిల్పాచార్యుడు శ్రీ గణపతి స్థపతి మే 30వ తేదీన అమెరికాకు బయలుదేరడం ఆంధ్ర జాతికే గర్వకారణం. భద్రాచలంలో రామదాసధ్యాన మండప కల్యాణ మండపాదుల నిర్మాణంలో తన అసమాన శిల్ప చాతుర్యం చూపిన గణపతి స్థపతి పర్యవేక్షణ కింద న్యూయార్క్ బాలాజీ మందిరం ఆంధ్రజాతి సహస్రాబ్దాల శిల్ప కళకు తార్కాణంగా వుండగలదనడంలో సందేహం లేదు. ఈ దేవాలయ బృంద నిర్మాణ వ్యయంలో హెచ్చు మొత్తం తిరుమల తిరుపతి దేవస్థానం విరాళమివ్వడం కూడ తెలుగువారికి మరొక ప్రశంస.

శ్రీ శంభుప్రసాద్ ప్రథమ వర్ధంతి

విన్నో పత్రికలు, సంస్థలు పుట్టలో పుట్టి మఖలో మాడుతుండగా, ఆరని జ్యోతులుగా వున్న ఆంధ్రపత్రిక, భారతి, సచిత్రవార పత్రికలను ఉన్నత స్థాయిలో నడిపి, తెలుగు దేశానికి అపార సేవ చేసిన శ్రీ శివలెంక శంభుప్రసాద్ ప్రథమ వర్ధంతి సభ మే 29న కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో జరిగినప్పుడు, వక్తలందరూ ముక్తకంఠంతో శ్రీ శంభుప్రసాద్ నిరాడంబరతను, కలుపుగోలుతనాన్ని, వినయాన్ని, రాజకీయ దూరదృష్టిని, గుప్తదానాన్ని ప్రశంసించారు. అధ్యక్షత వహించిన శ్రీ పిడతల రంగారెడ్డి 'ఆయన జీవితం సఫలం. ఆయన తన గొప్పదనం విప్పడూ చూపుకోలేదు. ఉత్తమ మిత్రుడు' అని అనగా, హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు 'ఆయన మబ్బులలో చందమామలాగ, ముసుగుకప్పిన గంధారపు బొమ్మలాగ, నివురుగప్పిన నిప్పులాగ వుండేవారు. సాహిత్యాన్ని రాజకీయాలను గొప్ప బాధ్యతతో నిర్వహించారు. న్యాయమన్నప్పుడు కవిసమ్రాట్టుల రచనలపై విమర్శలను ప్రచురించడానికి కూడా జంకని ధైర్యశాలి' అని ప్రశంసించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ నరోత్తమరెడ్డి పత్రికల నిర్వహణలోని సాధకబాధకాలు వివరిస్తూ, భారతివంటి సాహిత్య పత్రిక మన దేశంలో ఏ భాషలోను లేదన్నారు. శ్రీ జలగం వెంగళరావు ప్రసంగిస్తూ, 'ఆయన మైత్రికి పత్రికాభిప్రాయాలకు ముడిపెట్టేవారు కాదు. మిత్రుల విషయంలోనైనా వ్యతిరేకాభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పగలిగేవారు' అన్నారు. డాక్టర్ ఎం. చెన్నారెడ్డి. 'ఆంధ్రపత్రిక, కేసరి, అమృత్ బజార్ పత్రికల స్థాయిది. అది ప్రచురించే వార్తలపై 'ఆంధ్రపత్రిక ముద్ర' ప్రత్యేకంగా వుంటుంది. ఆయన మౌనం ఎదుటివారికి ఆలోచనలు రేకెత్తించేది. ఆయన [illegible] గొప్పదనం ఆయన సోఫాలో మూడువందలుగా కూర్చుంటే ఆ [illegible] కూర్చుంటారు. అనేక వినయసంప్రదాయం సభ్యత సంప్రదాయం. ఆయన ఉండిఉండి దూరదృష్టితో ఒక్క మాట అనేవారు. అది సూత్రప్రాయం. ఆయన గుణగణాలు ఆయన నిర్వహించే ఆంధ్రపత్రికలోనే స్పష్టమవుతున్నాయి.' అన్నారు, శ్రీ వేలూరి సహజానంద ఆంధ్రపత్రిక ఒక విశ్వవిద్యాలయమన్నారు. శ్రీ శంభుప్రసాద్ కేవలం ప్రొప్రయిటరుకారని, పత్రికకు సంబంధించిన అన్ని విషయాలలోను పని చేసిన నిష్ణాతుడని అన్నారు. ఆంధ్రభాషానిలయం కార్యదర్శి శ్రీ ఎం. ఎల్. నరసింహారావు ధన్యవాదాలర్పిస్తూ, శ్రీ శంభుప్రసాద్ పేర స్మారకం నెలకొల్పాలని కొందరు వక్తలు చేసిన సూచనను పునరుద్ఘాటించారు.

ఉపశ్రుతి

రేడియోలో 'బజరే రెగురామం' అని విన బడుతున్నది భక్తి రంజనిలో. ఏమిటీ రెగురాము?' అని అడిగాడు నా మిత్రుడు. భక్తి బగితి అయినప్పుడు, గంట గెంట అయినప్పుడు బజరే రెగురామం అంటే ఏం పోయింది' అన్నాను. 'అబ్బ! ఈ ఫైలాం జిస్టులతో ఛస్తున్నామయ్యా!' అన్నాడు మిత్రుడు.



ఈ కథకు ముగింపు లేదు

అర్ధి

'భానుమూర్తి ఈ ఊళ్ళోనే ఉన్నాడు...!'

అన్నాడు మూర్తి అందమైన చైనా పింగాణీతో చేసిన మగ్‌లోకి మరికొంచెం సోడా ఒంపుకుంటూ. మసగ్గా వెల్గుతున్న నియోన్‌బల్బ్ కాంతిలో— రాజా ముఖంలో ఉలిక్కిపడిన చారలు స్పష్టంగా తేలివయ్.

'ఏమిటా మన్ని వేధిస్తే? ఏ భానుమూర్తి' ముఖంలోని భావాలు కనపడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ అన్నాడు.

'ఓహ్... ఏ భానుమూర్తో చెప్పనే లేదు కదూ—!' పెళ్ళున నవ్వుతూ, 'నీకు విందరు భానుమూర్తులు తెలుసో నాకు తెలియదు కాని, నీకూ, నాకూ తెలిసిన భానుమూర్తి ఒకే ఒక వ్యక్తి. అయినా

చూశాడా... నేను భానుమూర్తిని కాదు — మూర్తినన్న సంగతి మర్చిపో రాస్కెల్...!' అన్నాడు గ్లాస్ ఖాళీచేస్తూ, తీవ్రంగా. హోటల్ ద్వారకా ఏర్‌కండిషన్డ్ హాల్‌లో, నియోన్‌లైట్ల వెలుగులో, ఎక్కడినుండో పాశ్చాత్య సంగీతం మంద్రంగా విన్పిస్తోంది. సంగీతానికి అనుగుణంగా లయబద్ధంగా అడుగులు వేస్తూ, శరీరం ఒంపుసొంపుల్ని అతి చాకచక్యంగా ప్రదర్శిస్తే, ప్రేక్షకుల్ని మైమరపిస్తోంది, స్ట్రిప్ — డాన్స్ ఛాలెంజర్ మార్గరెట్ ... వో మూలగా రాజా, మూర్తులు కూర్చున్నారు. గ్లాసుల సవ్వడి. సోడా కలుపుతుంటే వచ్చే శబ్దాలూ తప్ప, వాళ్ళిద్దరి మధ్యా మాటల్లేవు వో ఐదు నిముషాల పాటు...

'ట్రైనుకు టైమవుతోంది... వెళ్తానిక...!' అన్నాడు రాజా రోజ్ ఉడ్ బల్ల మీద మాపును వేలితో పిచ్చి గీతలు గీస్తూ...

'అదేం? ఇవ్వాళా, రేపూ నా అతిథిగా ఉండేందుకు అంగీకరించావుగా. ఐనా భానుమూర్తిని చూడవూ?' ముద్దగా ఉంది మూర్తి కంఠం.

'లేదు లేరా! నాక్కొంచెం అర్జంట్ పని ఉంది. మరోసారెప్పుడైనా వస్తాను...!' అన్నాడు లేచేందుకు ప్రయత్నిస్తూ.

'స్టే వేర్యూ ఆర్...నువ్వు నా ఆతిధ్యం అంగీకరించినా, అంగీకరించక పోయినా— వెల్...ఐ డోంట్ బాదర్ మచ్...బట్... యు షుడ్ సీ భానుమూర్తి...!' కోపంతో పిడికిలి బిగిస్తూ అనాడు మూర్తి.

ఇప్పుడు నాకా అవసరమూ అవకాశమూ రెండూ లేవు...!' లేని గాంభీర్యాన్ని ప్రదర్శించాలనే విఫలయత్నం చేస్తూ అన్నాడు.

'ఏమిటన్నావ్? అవసరం లేదూ? అసలు నీకో అవసరమంటూ ఏదైనా ఒకటేడిస్తే, అది ఆరేళ్ళ నాడే తీరి ఉండాలి. 'కాని! చూడు— ప్రస్తుతం ఆ అవసరం నాకుంది...' ఆఖరు బొట్టును మగ్‌లోకి ఒంచుతూ, 'బేరర్... ఒక విస్కీ...ఆఁ... ఏమిటి చెప్తున్నాను? అవకాశం లేదంటావా? నేను కల్పిస్తానోయ్...?' అన్నాడు కుర్చీలో వెనక్కు వాలి.

'బెదిరిస్తున్నావా?'

'ఛ ... ఛ ... ఛ ... బెదిరింపు లేని టోన్...? బెదిరింపులూ, బెల్లింపులూ నీలాంటి పిరికి వెధవల లక్షణం ... వో

విషయం తెలుసా నీకు? ఆవేదన గుండె అవధులు దాటినపుడు. నేను అన్నిటికంటె ఈజీగా చేయగలిగే పని ఇలా విస్కీ తాగడం ఒక్కటే. కాని, అంతకంటె ఈజీగా ఈ క్షణాన నిన్ను 'మర్డర్' చెయ్యగలను కూడా. పైగా నీలాగా నాకు వెనకా, ముందూ కూడా ఎవరూ లేరు. అది సరేగాని, ఆ కథేమిటో చెప్పు...'

'నాకే కథా తెలియదు... ఏది ఏమైనా మొత్తానికి 'రచయిత' బిరుదు పోనిమ్మనుకున్నావు కాదు!' ఓ పెగ్‌తో బాటిల్ ఓపెన్ చేస్తూ తేలిగ్గా నవ్వేందుకు ప్రయత్నిస్తూ అన్నాడు రాజా.

'వెల్ సెడ్ మై బాయ్...వెల్ సెడ్... రచయితను కనకనే, ఆరేళ్ళ నుండీ సశేషంగా నడుస్తున్న ఈ కథను పూర్తి చేసేందుకే నువ్వు భానుమూర్తిని చూసి తీరాలనేది...!' కళ్ళు స్థిరంగా చింతనిప్పుల్లా మండుతున్నాయ్... మొహం మీద వాలుతున్న జుట్టును చిరాగ్గా వెనక్కి తోస్తూ,

'మాట్లాడవేం? పోనీ నేనే చెప్తాను విను. ఆరేళ్ళ క్రితం — సరిగ్గా గుర్తు చేసుకో — వైజాగ్‌లో — డాల్ఫిన్స్ నోస్ దగ్గర — లలిత నడత మంచిది కాదనీ, కావాలంటే ప్రూవ్ చేస్తాననీ భానుమూర్తితో అన్నావు...'

'అది కాదు మూర్తీ...!'

'షటప్...మధ్యలో నోరెత్తావంటే నీ రక్తం కళ్ళ చూస్తాను. నేను నీలాంటి మిత్రద్రోహిని కాదురా స్కౌండ్రల్...లలితను వాడెంతగా ప్రేమించిందీ నీకంటె నాకు ఎక్కువ తెలుసు. నువ్వు చెప్పిన 'స్కాండల్స్' విని, మానసికంగా కొంతవరకూ దెబ్బతిన్న మాట నిజమే కాని, మొదటి నుండీ స్త్రీ పట్ల వాడికున్న ఉదాత్తమైన భావాలూ, శీలం పేరిట, కేవలం పురుషుడి విషయంలో అశ్లీలంగా భావించకబడక పోయినా, పైగా అదో పెద్ద గొప్ప విషయంగా లెక్కించే ఈ కుష్ఠు వ్యవస్థ, ఆడదానికి అనాదిగా చేస్తున్న అన్యాయాల్ని ప్రతిఘటించి తీరాలనే ఆశయాలూ, ఆదర్శాలు అప్పట్లో లలితను పెళ్ళాడేట్లు చేశాయి'...!' మాట్లాడడం ఆపి సిగరెట్ కేస్ నుండి తనో సిగరెట్ తీసుకుని రాజాకు ఆఫర్ చేశాడు.

'— నీ పథకం పారక పోవడంతో నీలోని రాక్షసుడు రోజా రోజుకూ ప్రాణం పోసుకున్నాడు — అందుకే, ఆ రాత్రి భానుమూర్తిని కావాలని డిన్నర్‌కు ఆహ్వానించావు. ఈలోగా, నీలాంటి మరో బ్యాచ్‌తో మంతనాలాడి, అందంగా ఓ కాకమ్మ కథ అల్లి, భానుమూర్తి మీ యింటికి వచ్చే సమయానికి, మీరు ఈ విషయాలు మాట్లాడుకుంటున్నారు, భానుమూర్తికి వినపడేలా...! తను నమ్మిన ఆశయాల కోసం, వాటిని నిరూపించాలనే తహతహతో, జీవితం మీదా, భవిష్యత్తు మీదా పందెం కాసి లలితను పెళ్ళాడినా, ఆ దెబ్బతో, తనే ఓడిపోయాననే బాధ గుండెల్ని దహిస్తుంటే, అవమానంతో-క్రుంగిపోయాడు... నువ్వాశించిన ఫలితం దొరికింది నీకు. ఔనా?'

'హుఁ...అబద్ధం...! లోకంలో అసలు నిజమనే పదం ఒకటేడ్చిందని నీకు తెలియదు గనక అంతా అబద్ధాల పుట్టగానే కన్పిస్తుంది. ఐనా ఏది అబద్ధం-? నువ్వు అలా చెప్పిన మాట అబద్ధమా? లేక 'చెప్పిన మాటలు' అబద్ధాలా? ఏదిరా అబద్ధం...!' ఆ మసగ వెలుగులో రాజా ముఖాన్ని చీరేసేట్లుగా చూస్తున్నాడు మూర్తి.

'... ... ...'

'సరే...ఆరేళ్ళనాడు నువ్వు ఈ కథకు నాంది పలికిన మాటే అబద్ధమనుకుందాం, ఇప్పుడు 'నిజమేది'టో నిరూపిస్తాను' అంటూ షర్ట్ జేబులో నుండి కొన్ని ఫోటోలు తీసి రాజా ముందుకు విసిరాడు...

'ఈ ఫొటోలు నేనూ నిర్మలా కలిసి తీయించుకున్నవి — ఐ మీన్ — 'సెల్ఫ్ ఎరేంజ్‌మెంట్'తో మేమే తీసుకున్నవి. నిజమేమిటో బాగా చూడు...!' అంటూ కుర్చీలో నుండి లేచి దగ్గరలో ఉన్న ట్యూబ్‌లైట్ స్విచ్ ఆన్ చేశాడు.

రాజా కళ్ళ ముందు మెరుపు మెరిసినట్లయింది. ఔను — నిర్మల...తన చెల్లెలు నిర్మలే...దాదాపు అన్నీ అస్వాభావికమైన రూపాలే...రాజా గుండెలు భయంతో గుబగుబలాడాయ్. నరాలు ఉబ్బి మొహమంతా ఎర్రగా కందిపోయింది.

'మూర్తీ...! ఏమిటిదంతా? నిర్మలకూ, ఆరేళ్ళనాటి ఆ సంఘటనకూ సంబంధమేమిటి?' వణుకుతున్న కంఠంతో అడిగాడు రాజా.

'ఏమిటా? 'నిజం' ఎలా ఉంటుందో చూపిస్తున్నాను... ఈ ఫొటోలేమిటన్నావు కదూ-? నీ చిన్నారి చెల్లి నాతో తిరిగిన తిరుగుళ్ళకి నిదర్శనాలు. నీ పరిభాషలో చెప్పాలంటే చె...డి...తి...గు...ళ్ళు...' ఒత్తి పలుకుతూ.

'మూర్తీ...!' గట్టిగా అరిచాడు రాజా ఆవేశంతో పైకిలేస్తూ.

'ఎందుకలా గొంతు చించుకుంటావ్? కథింకా 'క్లైమాక్స్'కు రాలేదు భాయ్... ఇంకా ఉంది విను... బహుశా నిర్మలా, నువ్వు కూడా ఇంతకాలం నేను తనను పెళ్ళి చేసుకుంటాననే అనుకుంటూ ఉండవచ్చు ... ఇంకా - 'నన్యాయం చెయ్యకండి...! పైగా ఇప్పుడు నేను......కూడా కాదు' అని ప్రాధేయపడుతూ, కాళ్ళావేళ్ళా పడేందుకు రేపో మాపో నా దగ్గరకు రావచ్చేమో కూడా-!' మధ్యలో ఓ నిముషం మరో గుక్క తాగుతూ, 'అప్పుడు నేనేమనాలి రాజా-? ఇదంతా అ...బ...ద్ధం...! నీకూ, నాకూ ఏ సంబంధం లేదు. గెటవుట్ అని కదూ అనాల్సింది...!'

రాజా మొహం తెల్లగా పాలిపోయింది. ఎయిర్ కండిషన్డ్ హాల్‌లో కూడా చెమటతో చొక్కా అంతా తడిసి పోయింది. కళ్ళలో శూన్యత... ఓ నిముషం వరకూ మళ్ళీ వాళ్ళ మధ్య మాటల్లేవు.

'ఇప్పుడు నన్నేం చేయమంటావు మూర్తీ...!' బాధతో కళ్ళు మూసుకుని అడిగాడు.

మూర్తి వాచీ చూసుకుంటూ, 'అదేదో తర్వాత చెప్తాను. ఇప్పుడే — పదకొండు ఐంది. నువ్వు భానుమూర్తిని చూడాలి పద !' అంటూ వరండావైపు నడిచాడు.

కారు కెన్నడీ రోడ్డును మింగుతూ టి.బి. హాస్పిటల్ వైపు పరుగుతీస్తోంది.

'రాజా...ఇప్పటివరకూ నాలోని మంచితనాన్నే చూసిన నీకు ఇప్పుడు నా ప్రవర్తన ఆశ్చర్యాన్నీ, అసహ్యాన్నీ కల్గించవచ్చు. కాని బ్రదర్...ఇలాంటి విషయాల్లో నేను చాలా చెడ్డవాణ్ని సుమా...! కేవలం నీలోని జులుం వల్ల ఆ నాడు నువ్వు సృష్టించిన స్కాండల్స్ వల్ల ఈనాడు రెండు జీవితాల నాశనానికి దారి తీసింది. మర్చాను

నువ్వేం చెయ్యాలో చెప్పనే లేదు కదూ-! తురేం లేదు—నవ్వన్నావే—అదే—అబద్ధమని— అలా నువ్వు చెప్పిన మాట అబద్ధం కాదన్న నిజం నీకూ తెలుసు. కాని—అలా అప్పుడు చెప్పిన 'మాటలూ', మీ ఇంట్లో ఆ రాత్రి జరిగిన సంఘటనా—ఇవన్నీ నిజం కాదన్న నిజాన్ని కనీసం ఇప్పటికైనా భానుమూర్తికి చెప్పి, ఇప్పటికైనా మనసిని నిరూపించుకో...! లేదంటావా ... తెలుసుగా ... నిర్మల...!'

'తెలిసింది మూర్తీ...!' భారంగా, బరువుగా ఉన్నాయి రాజా మాటలు.

హాస్పిటల్ గేటుదాటి పోర్టికోలో ఆగింది కారు. రాజాకేం అర్థం కాలేదు.

'మూర్తీ... భానుమూర్తికి...!' రాజా కంఠంలో ఆతృత తొంగి చూస్తోంది.

'మాట్లాడకుండా నావెంట నడువు'

ఈ కథకు ముగింపు లేదు

కటువుగా అన్నాడు మూర్తి.

ఎమర్జెన్సీ వార్డ్‌లో, బెడ్ నంబర్ 13 దగ్గర డాక్టర్లూ, నర్సులూ గుమిగూడి ఉన్నారు...ఆ వాతావరణాన్ని చూస్తూనే మూర్తి గుమ్మంలోనే స్తంభించి పోయాడు. ఎదురుగా వస్తున్న డాక్టర్ని అడిగాడు ఆందోళనతో అయామ్ సారీ...విపరీతమైన రక్తం పోయింది — హి ఈజ్ డెడ్... 'హి ఈజ్ డెడ్...హి ఈజ్ డెడ్..' పదే పదే ఆ మాటలు ప్రతిధ్వనిస్తున్నాయ్ మూర్తి చెవుల్లో.

'ఎస్...హి ఈజ్ డెడ్... మన భానుమూర్తి చచ్చిపోయాడ్రా రాజా...ఇట్స్ నాచురల్ ... నథింగ్ బట్ నాచురల్ ... కదూ రాజా...!' వణుకుతున్న కంఠంతో అన్నాడు. మాటల్లో నీళ్ళు తిరుగుతున్న వ్యధ ధ్వనిస్తోంది.

'మూర్తీ...వెంటనే డాక్టర్‌ను పిలిపిస్తే బావుంటుంది కదూ...' బాధగా అన్నాడు రాజా.

'బావుంటుందిరా—చాలా చాలా బావుంటుంది. కాని ఎలా? ఎక్కడుందని పిలిపించను? నాకైతే స్వర్గంలో ఉండి ఉంటుందన్న నమ్మకం ఉందికాని — నువ్వన్న చెడునడత పాపఫలంగా నరకానికి వెళ్ళి ఉంటుందని ఓ క్షణం ముందువరకూ. ఈ ఆరేళ్ళనుండీ బాధపడుతూనే ఉన్నాడు భానుమూర్తి. మరి ఎక్కడినుండని పిలిపించనా...!' ఎంత అణచుకున్నా మూర్తికి దుఃఖం ఆగటలేదు.

'అయామ్ సారీ మూర్తీ ... నన్ను క్షమించు!'

'క్షమా... ? దేనికి రాజా ? అయినా నేనెవర్ని క్షమించేందుకు. క్షమించాలిగిన వాళ్ళిద్దరూ లేరిప్పుడు. ఐనా చూడు రాజా—! క్షమించేందుకూ, పశ్చాత్తాపమే పాపపరిహారమని సరిపెట్టుకునేందుకూ ఇది సినిమాగానీ, నవలగానీ కాదు. ఇదీ జీవితం మోయ్ ... ఇందాక అన్నాను గుర్తుందా— రచయితను కనకనే, ఈ ఆరేళ్ళ నశేష కథనూ ఈనాటితో పూర్తి చెయ్యాలని కాని ఈ కథ పూర్తికాదని తేలిపోయింది రాజా—! పాత్రలైతే తమపని ముగించుకుని వెళ్ళిపోయాయికాని — కథకు మాత్రం ముగింపు దొరకడం లేదురా...! ఈ కథిలా చరిత్ర సరిహద్దులవరకూ సాగిపోవాల్సిందే! చివరగా ఒకమాట రాజా...! ఒక కథకు ముగింపు పలికేందుకు నిర్మల విషయంలో కొంత కల్పనే చెప్పాను. కాని, ఈ కల్పన ఆధారంగా, ఈలాంటి మరో కథ ప్రారంభం కాకూడదు మళ్ళీ ఈ క్షణంనుండీ-! అందుకే, వీలైనంత త్వరలో నిర్మలను పెళ్ళిచేసుకుంటాను ... !' కొనగోటితో కన్నీళ్ళను విదిలిస్తూ, వెనక్కు తిరిగి చీకటిలోకి నడుస్తూ అన్నాడు మూర్తి. ●

డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

లక్ష్మీకుమారి, అమలాపురం

నాకు ఊపిరి తీసుకుంటున్నప్పుడు గుండెల్లోనూ, ప్రక్కల్లోను విపరీతమైన నెప్పి వస్తుంది...

* కఫమూ, దగ్గు, ప్రక్కలో నెప్పి వున్నప్పుడూ, ఊపిరితిత్తులకు, దానిపై పొరకు సంబంధించిన రోగమై వుండవచ్చును. 'ప్లూరెసీ', బ్రాంకి యెక్టేసిస్, క్షయ మున్నగువాటివల్ల ఇలా జరగవచ్చును. మీరు కఫము, నెత్తురు, 'ఎక్స్‌రే' మున్నగు పరీక్షలు చేయించికొని వెంటనే చికిత్స ప్రారంభించాలి. రోగం కొద్దిగా నయమైన తర్వాత బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేస్తే మంచిది.

ఎస్. ఎన్. సుబుద్ధి—సింధికెలా (ఒరిస్సా)

మా అబ్బాయికి 2 సం. 5 నెలలు. ఇంకనూ నడక, 'అమ్మ' అనటం తప్ప వేరే మాటలు రాలేదు. పట్టుకొని నించో కలుగుతున్నాడు.

* భౌతిక, మానసిక, గ్రహణశక్తి మున్నగునవి ఎన్నో కారణాలమీద ఆధారపడి వుంటాయి. తల్లి గర్భవతిగా వున్నప్పుడు వచ్చే టాక్సీమియా, పుట్టినతర్వాత ఆహార విధానాలలో హెచ్చుతగ్గులు, పిల్లలకి వచ్చే అంటురోగాలు, విరేచనాలు, వాంతులు, 'ప్రైమరీ కాంప్లెక్స్,' కొన్ని ఇతర కారణాలవల్ల మెదడులో వచ్చే మార్పులు (మెంటల్ డెఫిషియన్సీ)—ఈ మూడింటికి ముఖ్యకారణాలు. ఈ కారణాల దృష్ట్యా మీ అబ్బాయిని నిపుణులచేత పరీక్ష చేయించటం అవసరం.

భౌతిక, మానసిక, గ్రహణ శక్తులు పిల్లలకి సకాలంలో ఏర్పడటం సహజమే అయినా కొంతమేరకు—మూడు నాలుగు నెలలు దాటినప్పుడు కూడా పెద్దగా బాధపడనవసరంలేదు.

శ్యామల—ఆళ్లగడ్డ (కర్నూలు)

నాకు ముగ్గురు పిల్లలు. 3 సం. ల క్రితం ఆపరేషన్ చేయించుకొన్నాను. కొన్నిరోజుల తర్వాత నడిచినప్పుడు కాళ్ళు వాపు, నెప్పులు రావటం ప్రారంభించాయి. ఆపరేషన్ చేసేముందు వెన్నుపూసలో ఇంజక్షన్ చేసారు, రానురాను నెప్పులు ఎక్కువ అవుతున్నాయి.

* కాళ్ళు వాయటానికీ వెన్నుపూసలో ఇంజక్షనుకూ, ఆపరేషన్‌కు సంబంధము లేదు.

మీరు 'ఫిజిషియన్'ను కలుసుకొని హార్ట్, లివరు మొదలగువవి పరిశోధన చేయించుకోండి. మీరుదు పరీక్ష చేయించుకోవటం, అత్యవసరం. రెండు కాళ్ళూ వాస్తున్నప్పుడు పొత్తికడుపు లోపలవున్న అవయవములలో కొన్ని మార్పుల (వాయటం)వల్ల నెత్తురు, లింఫ్ పారుదల సక్రమంగా లేక, ఇలా జరగటానికి అవకాశము వున్నది.

భీమరాజు హనుమంతరావు—వేమూరు

నా వయస్సు 75 సం. లు. గత 10 సం. లుగా ఆయాసము వస్తున్నది. రాత్రుళ్లు పడుకుంటే ఒకప్రక్కనే పిలవుతున్నది. ఎక్సరే, నెత్తురు పరీక్షచేసి ఏమీ లేదని అన్నారు.

* మీ వయస్సులో మామూలుగా బ్లడ్ ప్రెషర్, 'కన్‌జెస్టివ్ కార్డియాక్ ఫెయిల్యూర్' మొదలుగునవి రావటానికి అవకాశము ఎక్కువ. వీటికొరకు పరీక్ష చేయించుకోవాలి. మీరుదుకూడా పరీక్ష చేయించటం అవసరం.

ఆహారంలో వుప్పు తగ్గించటం, క్రొవ్వు పదార్థాల వాడకం మానటం, ఆకుకూరలు, పళ్ళరసం, ఎక్కువగా తీసుకోవటం చేయాలి. బ్లడ్‌ప్రెషర్ ఎక్కువగా వున్నప్పుడు 'అడెల్‌ఫేన్ ఎసిడ్రెక్స్', ఆయాసానికి 'డెరిఫిలిన్' 'అమైనోఫిలిన్' మొదలగు మందులను వైద్యుల సలహాపై వాడాలి.

కె. ఆదిశేషరెడ్డి—అల్లూరు

మా అమ్మాయి వయస్సు 17 సం॥లు. 'టాన్సిలైటిస్' వున్నది. కొందరు వైద్యులు వాటిని తీసివేయాలని, మరికొందరు వద్దని అంటున్నారు.

* టాన్సిల్స్ అనేవి ప్రతిమనిషికీ పుట్టినప్పుడే వుండే లింఫ్ గ్రంథులు. వాటిపని ఏవైనా సూక్ష్మక్రిములు నోటిలో ప్రవేశించినప్పుడు, వాటిని నిరోధించే శక్తి కలిగి. అయితే వయస్సు పెరిగిన కొద్దీ వీటిసైజు కొద్దిగా తగ్గుతుంది. ఇవి తమపని సరిగా చేయలేక పోయినప్పుడు, వాటిలో చేరిన క్రిములు మున్నగువాటివల్ల తరచూ వాపు, గొంతునెప్పి, మ్రింగలేకపోవటం, జ్వరం దగ్గు రావచ్చును.

ఇలా తరచూ వస్తున్నప్పుడు, వాటిని తీసివేయటం మంచిదే!

ఎస్. విజయకుమార్—పెద్దపల్లి

6 సం. ల క్రితం నాకు 'రుమాటిక్ ఫీవర్' వచ్చింది. కీళ్లనెప్పుల తర్వాత ఇప్పుడు హృదయమునకు వచ్చింది. ఇది ఎప్పుడూ వుంటుందా? గుండెనెప్పి రావటానికి కారణాలు, నివారణోపాయాలు—ఏమిటి?

* '—రుమాటిక్ ఫీవర్' వచ్చినప్పుడు మంచి వైద్యము చేయించకపోతే హృదయము యొక్క కండరములు, పైనవున్న పొర (పెరికార్డియం), లోపలి కవాటములు దెబ్బతినే అవకాశము వున్నది,

హృదయమునకు ఈ రోగం రావటంవల్ల బాధింపబడిన భాగమునుబట్టి రోగలక్షణాలు వుంటాయి. గుండెనెప్పి, శ్వాసపీల్చటం కష్టమవటం, లివరు పెద్దదవటం, కాళ్లువాయటం జరుగుతాయి. రోగం వచ్చిన తర్వాత తాత్కాలికంగా మందులు వాడటం, కొన్నిచోట్ల శస్త్రచికిత్స ద్వారా బాగుచేయుటం చేస్తారు.

రోగం రాకుండా తరచు గొంతునెప్పి, జ్వరం, కీళ్ళనెప్పులు వచ్చినప్పుడు. 'పెనిడ్యూర్' వంటి ఇంజక్షన్లు—వారానికొకసారిగా ఆరుసార్లు వేయించుకోవాలి.

ద్రాక్షారామ భీమేశ్వర క్షేత్రం

దక్షుడు యజ్ఞం చేసిన భూమి కనుక దాక్షారామం అంటారు కొందరు. ఒకప్పుడు ద్రాక్ష తోటలు బాగా ఉన్న చోటు కనుక ద్రాక్షారామం అయిందంటారు కొందరు. రామచంద్రాపురానికి నాలుగు మైళ్ల దూరంలో, పవిత్ర గోదావరీ నది తీరం మీద ఉన్న ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర క్షేత్రం జగత్ప్రసిద్ధమయినది. చోళ, చాళుక్య శిల్పాలకిది కాణాచి. వేములవాడ భీమకవి తాను భీమేశనందనుడనని చెప్పుకున్నాడు. శ్రీనాథుడు భీమఖండంలో భీమమండలం శోభని వర్ణించాడు.

తారకాసురుడి మెడలోని లింగం పంచ శకలాలు అయి ద్రాక్షారామాది పంచారామాలలో పడింది. ఒక శకలం స్వయం ప్రతిష్ఠితమయింది. అత్రేయాది సప్తమహర్షులు ద్రాక్షారామంలో భీమలింగాన్ని ప్రతిష్ఠించాలనుకున్నారు. ముహూర్తం పెట్టుకున్నారు. గౌతముని ప్రార్థించి గోదావరిని తీసుకు రావటానికి ధవళేశ్వరం వెళ్ళారు. వీరు రూ ఏడు పాయలని తీసుకు వస్తూ ఉండగా, దారిలో తుల్యమహర్షి ఆశ్రమం పనిపించారు, తుల్యమహర్షి చేస్తున్న యజ్ఞాన్ని భంగం చెయ్యాలనుకున్న ఇంద్రుడు అక్కడికి ఆకాశమార్గాన వచ్చాడు. అతను నదీ ప్రవాహాన్ని ఆశ్రమం మీదికి మళ్ళించాడు మునికి కోపం వచ్చి ప్రవాహాన్ని ఆపి వేశాడు కాని, ఆయన మంచి తపం, వ్యాసమహర్షి మధ్యవర్తిత్వం నెగ్గాయి. గోదావరి అక్కడ నుంచి అంతర్వాహిని అయి ద్రాక్షారామంలో భీమేశ్వరుని ఆలయం పక్కన సప్త గోదావరీ పుష్కరిణిగా సాక్షాత్కరించింది. తుల్యభాగకి కూడా సప్తర్షులు వరాలు ఇచ్చారు ముహూర్తం ప్రకారం ప్రతిష్ఠ జరిగింది. తొలిపూజ సూర్యభగవానునిది; తరువాత బ్రహ్మ, విష్ణు, మహేంద్రాది సిద్ధసాధ్యాది గంధర్వులు సప్తర్షులు పూజలు చేశారు. తొలిపూజలు చేసిన సూర్యభగవానుడు, సప్తర్షుల గోత్రాలు కలవారే ఇప్పటికీ ఇక్కడ అర్చకులు.

శివుడు మార్గశిర శుద్ధ చతుర్థినాడు రోహిణి నక్షత్రాన సూర్యుని ఆహ్వానం మీద గౌరీదేవితో భీమనాథుని ఆలయం ప్రవేశించాడు. భీమేశ్వర లింగంలో ఐక్యం అయ్యాడు. గౌరీదేవి మాణిక్యాంబగా అవతరించింది.




ద్రాక్షారామ భీమేశ్వర క్షేత్రం.

వ్యాసుడిని అన్నపూర్ణ ఒకసారి కాశీ వదలి పొమ్మని పంపించి వేసినప్పుడు అతను ద్రాక్షారామానికి వచ్చి అగస్త్యుడిచేత అర్ఘ్య పాద్యాదులు పొందాడుట. ఇక్కడే బ్రహ్మ సూత్రాలు రాశాడుట వ్యాసుడు. ఆది శంకరులు ఇక్కడ యంత్రంవేసి అమ్మవారి ఉగ్రాన్ని తగ్గించారు. శృంగేరీస్వాములు ఒకసారి ఇక్కడికి వచ్చి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబలని అర్చించారు. ద్రాక్షారామం వేదశాస్త్రాలకి పుట్టినిల్లు.

ద్రాక్షారామలింగం అదేపనిగా ఒకసారి ఎదిగి పోతూ ఉంటే, ఇక ఎదగకుండా నెత్తిన మేకు కొట్టారని ఒక పుక్కిటి పురాణగాధ ఉంది. కిరాతార్జున యుద్ధంలో అర్జునుడు కొట్టిన దెబ్బ ఇదే అంటారు కూడా...

ఈ ఆలయం రాజరాజు నాటిది. ఆలయంలో ఉన్న అశ్వర్థ వృక్షం కింద వెలిసిన శంకరనారాయణ స్వామిని భక్తులు అర్చిస్తారు. సూర్యభగవానుని, గణేశ్వరుని, భీమేశ్వరుని, మాణిక్యాంబని, కాలభైరవుని, ఇతర దేవతలని అర్చించి తరిస్తారు.

—రామశర్మ.



అశ్వర్థవృక్షంకింద వెలసిన శంకరనారాయణస్వామివారు.



నేను ఆఫీసులోకి ప్రవేశించేసరికి బ్రేక్ యిన్‌స్పెక్టర్ భూపతి సిగరెట్ త్రాగుతూ ఏదో ఫైలు చూసుకుంటు న్నాడు.

నన్ను గమనించలేదో, గమనించి చూడ నట్లు వూరుకున్నాడో అర్థం కాలేదు. [illegible] తలఎత్తకుండా ఏదో వ్రాసుకుంటున్నాడు. రెండు నిముషాలు అలాగే నుంచుని, సన్నగా దగ్గాను.

ఆయన తల ఎత్తాడు—

'గుడ్‌మార్నింగ్ సార్!' అన్నాను.

'గుడ్‌మార్నింగ్ — మూర్తీ [illegible]' అంటూనే తను చూస్తున్న ఫైలులో మునిగిపోయాడు.

కాసేపాగి 'మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తు న్నట్టున్నాను. క్షమించాలి!' అన్నాను.

ఆయన మళ్లీ తల ఎత్తాడు.

నేను ఒక లాగ్ [illegible]

రిజిస్ట్రేషన్ చేయించి, ఫిట్‌నెస్ టెస్ట్ చేయిస్తామని వచ్చాను. కాగితాలు యిచ్చి మూడు రోజులయింది. మీరు కొంచెం దయవుంచి త్వరగా పని పూర్తిచేస్తే.'

ఆయన కొంచెం విసుగ్గా చూశాడు— 'కాగితాలు యిచ్చారుకదా—తొందరపడతారేం —ఆఫీసు ప్రొసీజర్ ప్రకారం కొంచెం. ఆలస్యం అవుతుంది మరి — రెండ్రోజు లాగిరండి—'

'అదికాదు సార్ — ఆ లారీ నడవక పోవటంవల్ల నేను రోజూ చాల డబ్బు నష్టపోతున్నాను. మొన్న లారీని చూసి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ యిస్తారనుకున్నాను. ఆరోజు చూడలేదు. నిన్న చూస్తానన్నారు కాని చూడలేదు. కనీసం యివాళయినా...'

ఇంతలో స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని పొడుగ్గా, బలంగా, చామన ఛాయగా వున్నాయన హుందాగా లోపలకు అడుగు పెట్టాడు—

వస్తూనే నవ్వుతూ 'నమస్తే—భూపతి గారూ !' అన్నాడు.

అంటూనే కుర్చీ ముందుకు లాక్కుని కూర్చున్నాడు.

ఆయన ఎవరో నాకు బాగా తెలుసు. దాదాపు పది బస్సులకు, నాలుగయిదు లారీలకు అధిపతి పట్నంలో వున్న గొప్పవాళ్ళల్లో ఒకడు. పేరు అంకినీడు.

'ఊరకరారు మహానుభావులు— ఏదో పెద్ద పనిమీదే వచ్చినట్టున్నారే అంకినీడు గారు—' అన్నాడు భూపతి నవ్వుతూ.

'మీతో మాకు వేరే పనేముంటుంది సార్ !' అంటూ ఆయనే నవ్వాడు.

భూపతి బల్లమీద మూడుకోతుల బొమ్మ వుంది. దానిమీద చెడు వినకు, చెడు చూడకు, చెడు చెప్పకు అని వ్రాసివుంది. బొమ్మ మంచి అందంగానే కాక నీ అదాయకంగా కూడా వుంది.

అది చూస్తూ అన్నాడు అంకినీడు 'గాంధీగారి బొమ్మ పెట్టారే—అయినా ఏం నీతులులెండి ఈకాలంలో...' అదోరకంగా నవ్వాడు.

భూపతి అన్నాడు 'ప్రజలదేం తప్పు లేదంటాను — చెడువినద్దు, చూడవద్దు, చెప్పవద్దు అనే మూడు కోతులు చెబు తున్నాయి కాని, చెడు చేయవద్దు అని చెప్పే నాలుగోకోతి ఏది — అందుకే

నాలుగో కోతి

అందరూ చెడ్డపనులు చేస్తున్నారు—బాగు పడుతున్నారు.'

అంకినీడు పెద్దగా నవ్వాడు—ఆయన హాస్యానికి.

భూపతి తన ముందున్న సిగరెట్ పెట్టెను అంకినీడుకి అందించాడు.

అంకినీడు సిగరెట్ వెలిగించి, నిర్లక్ష్యంగా పొగ వదులుతూ అన్నాడు 'ఒక చిన్నపని తగిలిందిసార్—మన నైన్‌టీన్ ట్వంటీనైన్ లేదూ—దానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలి !'

భూపతి పెద్దగా నవ్వాడు.

'ఫిట్‌నెస్సా—ఆ డొక్కు సిటీబస్సుకా— ఏమన్నా బాగుచేయించారా—యింకా అలాగే నడుస్తున్నదా—'

అంకినీడు కూడా చిన్నగా నవ్వాడు.

'రిపేరా—భలేవాళ్ళుసార్ మీరు. దానికి రిపేరు— మొదలుపెడితే నాలుగయిదువేల రూపాయలు యిట్టే తినేయదుటండీ— ఆ—ఏదో రోడ్డుమీద నడుస్తున్నదిగదా— నడవనీయండి—యిప్పుడంత డబ్బు నేనెక్కడ తేను?'—

'మరయితే నేను ఫిట్‌నెస్ ఎలా యిస్తా ననుకున్నారు!' అన్నాడు భూపతి.

అంకినీడు నవ్వాడు.

ఈలోగా భూపతి నాకేసి తిరిగి 'మీ లారీ బయట వున్నదా!' అన్నాడు.

లేచి నిలబడి 'వుంది సార్—చూస్తారా' అన్నాను.

'బయట వుండండి — కాసేపట్లో వస్తాను!' అన్నాడు భూపతి.

ఒక నమస్కారం పారేసి బయటకు వచ్చాను.

అంతా హడావిడిగా వుంది. ఎంతోమంది చేతిలో రిజిస్ట్రేషన్ పుస్తకాలతోనూ, టోకెన్స్‌తోనూ — హడావిడిగా తిరుగుతున్నారు. ఒక గంట గడిచింది. నా ఎదురుగానే అంకినీడు కారెక్కి వెళ్ళిపోయాడు. తర్వాత అరగంటకి భూపతి బయటకు వచ్చాడు. బయట వున్న కొన్ని వెహికిల్స్ అసలు చూడనేలేదు. ప్రక్కనే వున్న డ్రయివర్లతో— 'ఫిట్‌నెస్సు అయిపోయింది— బండి తీసుకు వెళ్ళిపోవచ్చు' అని చెప్పాడు. అంటే బండి చూడకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తయారయి పోయిందన్నమాట. కొన్ని వెహికిల్స్ కేవో వంకలు పెట్టాడు.

'మీ లారీ ఏది!' అడిగాడు బ్రేక్ యిన్‌స్పెక్టర్.

చూపించాను. ఎక్కి స్టార్టు చేసాడు, స్టార్టు అయింది. కొంచెం ముందుకూ వెనక్కూ రెండుమూడు సార్లు నడిపాడు. సడన్‌గా బ్రేక్ కొట్టాడు. ప్రక్కన ఆగింది. క్రిందకు దిగి నంబర్ ప్లేట్లూ అవీ చెక్ చేశాడు. నన్ను పిలిచి—స్టాప్ బోర్డు సరిగ్గా వ్రాయించలేదన్నాడు. అది చాల ముఖ్యం అన్నాడు. స్టాప్ బోర్డు లైటు కూడా సరిగ్గా లేదన్నాడు. బ్రేకు గట్టిగా పట్టుకుంటున్నదిట. అది బాగు చేయించాలన్నాడు. రియర్ వ్యూ అద్దం మరీ చిన్నదయింది — సరిగ్గా కనపడటం లేదు — పెద్దది వేయించమన్నాడు.

అన్నిటికీ సరేనన్నాను.


'అన్నీ బాగుచేయించి—రేపూ ఎల్లుండీ సెలవు కనుక—సోమవారం తీసుకురండి— అప్పుడు చూద్దాం — ఇటువంటి బళ్ళు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కావాలని ప్రాణం తీస్తారు!' సణుగుతూ లోపలకు వెళ్ళి పోయాడాయన.

కాసేపు నాకేం చేయాలో తెలియలేదు.

చుట్ట కాలుస్తూ బయట నుంచున్న ప్యూన్ నన్ను చూసి అదోలా నవ్వాడు. చుట్ట పారేసి మెల్లగా నా దగ్గరకు వచ్చాడు.

'ఏం సార్—పనయిందా! అయ్యగారు ఏమన్నారు—మీ ముఖం చూస్తే తెలియటం లేదాసార్ పనయిందో లేదో — మీరు నే చెపితే వినరు సార్—మీరు 'ఊఁ!' అనండి— అయిదు నిమిషాల్లో మీ పని పూర్తిచేయక పోతే నన్నండి—ఇప్పుడు వచ్చిన అంకినీడు గారు చూడండి. ఆయన డొక్కు బస్సుని యిక్కడకు తేకుండానే—అయ్యగారు చూడకుండానే సర్టిఫికేట్లు సంపాదించుకున్నారు— చూశారా. ఆయనగారు వచ్చారంటే వెంటనే పని చేయించుకు పోతారు. ఆయనకూ మాకూ కూడా హాయి. మీరు యిన్నాళ్ళ నుంచీ తిరుగుతూ...'

అతని మాటలు వినకుండా ముందుకు నడిచాను. అక్కడ పని ఆగాలంటే ఏం చేయాలో కూడా తెలుసు. అంత అమాయకుడినేం కాదు. కానీ నా ఆశయాలకు


'టెరీన్' పేరులోనే వుంది ఓ ప్రత్యేకత
అది శ్రేష్ఠతను, నాణ్యతను గుర్తెరిగిన
మిల్లులు తయారు చేసే
అసాధారణమైన బట్టలకు చిహ్నము
TERENE
"టెరీన్"®
దీని ప్రాధాన్యత ఏమిటో చూడగానే చెప్పవచ్చు
అనేక రకాల రంగులు, నేత తీరులు, డిజైన్లు గలిగి
ఈ తేజమే మేళవించబడిన ఆ బట్టలను నాణ్యతను
గుర్తెరిగిన మిల్లులు తయారు చేసాయి అని.
అంతేకాదు, బట్టలు ఖచ్చితమైన ప్రమాణాలననుసరించినవి,
ముడుతలు పడనివి, పక్కా రంగులు గలవి, సొగసును కూర్చేవి అని కూడా,
అందమైన బట్టలు సమకూర్చే సొగసు అతి నిశ్చలంగా వుంటుందని
తెలుసుకొనేందుకు ఏకైక సాధనము బట్టలపై వుండే
"టెరీన్" ట్రేడ్‌మార్క్ ఒక్కటే.
"టెరీన్"
ఉత్తమమైన మిల్లులతో... ఉత్తమమైన బట్టలపైనే
® 'టెరీన్' — కెమికల్స్ అండ్ ఫైబర్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి
రిజిస్టర్ ట్రేడ్‌మార్క్.
CHAITRA-CAFI-146 TEL

నాలుగో కోతి

అది నిరుద్ధం.

ఇన్ని రోజుల నుంచి నా లాంటి నడవక పోవటం వల్ల నష్టం నా మదిలో మెదిలింది. ఏం డబ్బు యిస్తే పని త్వరగా అవుతుంది గదా అని అడుగుతున్నాడు నా లోని మనిషి. మళ్ళీ ప్రిన్సిపల్ అడ్డం వచ్చింది. అందుకే ప్యూన్‌తో ఏమీ అనకుండా బయటకు వచ్చాను.

వెనక అతను సణగటం వినబడుతూనే వుంది.

మూడు రోజుల తర్వాత ఆయన చెప్పిన 'రిపేర్లు' చేయించి మళ్ళీ వచ్చాను.

అదేం ఖర్మమో కాని-నేను భూపతి దగ్గరకు వెళ్ళిన మరుక్షణంలోనే—లోపలకు హడావిడిగా వచ్చాడు అంకినీడు. మనిషి కొంచెం గాభరాగా వున్నాడు.

కుర్చీ లాక్కుని కూర్చుని — దీనంగా చూశాడు భూపతివేపు.

భూపతి వింతగా చూశాడతన్ని.

'కొంప అంటుకున్నాయి సార్—మా బస్సుకి ఏక్సిడెంటు అయింది!' నుదుటికి పట్టిన చెమటను, చేతి రుమాలుతో తుడుచుకున్నాడు.

భూపతి ఆసక్తిగా చూశాడు — 'ఏ బస్సుకి' అడిగాడు

'మొన్న మీరు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ యిచ్చిందే-నైన్‌టీన్ ట్వంటీనైన్...'

భూపతి కొంచెం కలవరపడ్డట్టు కనిపించాడు. మెల్లగా అన్నాడు — 'ఏక్సిడెంట్ ఎలా అయింది ?'—

అంకినీడు నాలికతో; ఎండిన పెదవులు ఒక్కసారి తుడుపుకుని అన్నాడు-'ఏం లేదు సార్ — మెయిన్‌రోడ్డు మీద సెంటర్‌లో మా సిటీ బస్సు వెడుతున్నదట. రూల్స్ ప్రకారం ఎడమ ప్రక్కనే వెడుతున్నాడు. సడన్‌గా గేదె ఒకటి అడ్డం వచ్చిందిట. బ్రేక్ కొడితే పడలేదు. గేదె మీదకు బస్సు ఎక్కుతుందేమోనని, చటుక్కున కుడి ప్రక్కకు త్రిప్పాడుట బస్సుని. ఆ స్పీడ్‌కి, బస్సు—అలా చటుక్కున త్రిప్పటంతో, కంట్రోల్ తప్పి—కుడి ప్రక్కన వున్న సిటీ బస్సు స్టాపులోకి దూసుకు పోయిందిట. అక్కడా మళ్ళీ బ్రేక్ కొట్టినా పడలేదు. బస్టాపులో బస్సుకోసం నుంచున్న నలుగురు స్కూలుకు వెళ్ళే అమ్మాయిలమీదా ఎక్కి, తర్వాత గోడకు గుద్దుకొని ఆగిందిట...' అంకినీడు ఆగాడు.

'ఆ నలుగురు చిన్నపిల్లలకూ దెబ్బలు తగల్లేదు కదా—' అడిగాను కంగారుగా.

అంకినీడు ఒక క్షణం మాట్లాడలేదు. కాసేపటికి అన్నాడు: 'అంత వేగంగా వెడుతున్న బస్సు పసిపిల్లల మీద ఎక్కితే దెబ్బలు తగిలెనయ్యా అంటారేమిటి సార్—నలుగురు అమ్మాయిలూ బస్సు క్రింద పడి నలిగిపోయారు-వెంటనే ప్రాణం పోయింది.'

నాకు నోట మాట రాలేదు. హృదయంలో ఏదో కలుక్కుమంది.

'మరి పోలీసులు కేసు బుక్ చేయలేదా!' అడిగాడు భూపతి.

'చేశారు—కాని మా బావమరిది ట్రాఫిక్ యిన్‌స్పెక్టర్‌ని ఈ పాటికి కలుసుకునే వుంటాడు. ఎంతడిగినా సరే యిచ్చేయమని చెప్పాను. అతను మేనేజ్ చేయగలడు సార్—అక్కడేం ఫరవాలేదు...'

భూపతి ఏం మాట్లాడలేదు.


'వాళ్ళ రిపోర్టుతోపాటు బ్రేకులు పని చేస్తున్నాయనీ, బస్సు కండిషన్‌లోనే వుందని మీరు సర్టిఫికేట్ యిస్తే – ఈ కేసును మాపు చేయవచ్చు. దయచేసి మీరు...'

వాళ్ళ మాటలు వినపడుతున్నా; నాకు మనసులో ఏదో భారంగా వుంది, మా అమ్మాయి స్కూలుకి వెళ్ళే సమయం సరిగ్గా అదే. కొంపతీసి ఈ బస్సు పొట్టన పెట్టుకున్న నలుగురు పాపల్లో మా అమ్మాయి వుందా—ఏదో వణుకు ప్రారంభమయింది. చటుక్కున లేచి—ఒక్క వురికి మెయిన్ రోడ్డు సెంటర్‌వేపు బయల్దేరాను.

నడుస్తున్నానే కాని నా కాళ్లలో నరాలు చాలా నెర్రిగా, పిచ్చి పిచ్చిగా వున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి.

సెంటర్‌లో చాలమంది జనం గుంపుగా వున్నారు. పోలీసులూ వున్నారు. కంగారును అణుచుకుంటూ, జనాన్ని ప్రక్కకు తోసి—లోపలకు వెళ్ళాను. గుండె వేగంగా కొట్టుకుంది. ఆ దృశ్యాన్ని చూడలేకపోయాను. కళ్ళు మూసుకున్నాను. ఒక ప్రక్క ఆ చనిపోయినవారిలో మా అమ్మాయి లేదన్న ఆనందం వున్నా — ఆ హృదయ విదారక దృశ్యం చూసి మనసంతా వికలమయి పోయింది. కళ్ళల్లోకి నీళ్ళు వచ్చినయి. ఒక క్షణం ఆగి కళ్ళు తెరిచాను.

బస్సు ముందు చక్రాల క్రింద నలుగురు పసిపాపలూ నలిగిపోయారు. ముఖాలు కొంచెం గుర్తు తెలుస్తున్నా ఆ లేత శరీరాలు పచ్చడి అయిపోయాయి. నెత్తురు మడుగులో నిశ్చలంగా పడి వున్నాయి. ఆ నలుగురూ పది సంవత్సరాల లోపువారే. పదేళ్ళు లోపలే వాళ్ళకి నూరేళ్ళు నిండిపోయాయి. మృత్యువు వాళ్ళని జయించింది. కబళించింది— అంతకన్నా అన్యాయ



కులు దొరకలేదేమో!

ఇంతలో హఠాత్తుగా గుర్తుకు వచ్చింది— ఆ అమాయకపు పిల్లల చావుకు కారణమెవరో, ఏమిటో. ఈ లోపలే అంకినీడు భూపతికి కొన్ని వచ్చి కాగితాలు అందించే వుంటాడు. ఆయన బస్సు కండీషన్‌లోనే వుందని సర్టిఫికేట్ యిస్తాడు. అంకినీడు బావమరిది పోలీసుల దగ్గర మేనేజ్ చేస్తాడు. అందరూ కలిసి—బస్సువాళ్లదేం తప్పులేదని—ఏదో కారణం చూపిస్తారు. అంతటితో ఈ కేసు కొట్టివేయబడుతుంది. అంకినీడు ఒకసారి జేబు తడుముకుని, హాయిగా వూపిరి పీల్చుకుంటాడు. భూపతి ఆదాయం పెరుగుతుంది అతను ఆడబ్బు ఆనందంగా ఖర్చు పెట్టుకుంటాడు. కాని అతను ఖర్చుపెట్టే ప్రతిపైసాకీ నాలుగు ప్రాణాలు జమకట్టుకున్నాడు. నాలుగు పసి, అమాయక ప్రాణాలను బలివేస్తున్నారంతా కలసి—దేనికోసం— డబ్బుకోసం— కేవలం డబ్బుకోసం.

నా ఆలోచనలకు అంతరాయం కలిగింది. కారు హారన్ వినగానే. అంకినీడూ, భూపతీ వచ్చారు గబగబా. అంకినీడు, భూపతికీ చూపించాడు ప్రమాదం జరిగిన చోటును.

భూపతి బస్సునుంచున్నతీరుని, ఆపసిపాపల్ని చూశాడు. ఉలిక్కిపడి మళ్లీ చూశాడు పాపల్ని, కొయ్యబారిపోయాడు. అంకినీడు ఏదో అంటున్నా అతనికి వినపడటంలేదు. ఒకక్షణం తర్వాత తేరుకుని—గబగబా ముందుకు వెళ్లాడు. ఆ నలుగురు పాపల్నూ మధ్యన—బస్సు క్రింద నలిగి ప్రాణాలను పోగొట్టుకున్న వీరటి, అందమైన పాప తల మీద చేయి వేశాడు. ప్రేమగా చూశాడు. ఒక్కసారిగా 'సుజాతా!' అని పెద్దగా అరిచి, ఆ అమ్మాయి మీద పడి విలపించాడు — బ్రేక్ యిన్‌స్పెక్టరు భూపతి.


నాకేం అర్థం కాలేదు.

ఎవరో అంటున్నారు—'ఆ అమ్మాయి బ్రేక్ యిన్‌స్పెక్టరుగారి అమ్మాయా—అరే ...పాపం... ఆయనకు ఒక్కతే కూతురు. కాన్పు అప్పుడు ఆపరేషన్‌చేసి ఆ అమ్మాయిని బయటకుతీసి, ఆయన భార్యకు యిక మళ్లా పిల్లలు పుట్టరని చెప్పారుట డాక్టర్లు. అందుకని పాపం—ఈ అమ్మాయిని చాలా అపురూపంగా, గారాబంగా, కంటికి రెప్పలా...'

నాకు తర్వాత మాటలు వినపడలేదు. బయటకు వచ్చేశాను.

అక్కడవున్న వేపచెట్టు మీద కాకులు కోతులు గంతులు వేస్తున్నాయి. ●

ముక్తి ఎప్పుడు కలుగుతుంది!



బులుసు వేంకటరమణయ్య — ధర్మపథం

✷ ముక్తి అంటే జన్మ రాహిత్యమే — అంటే—ఆ మీద మరి పుట్టుక అనేది లేకుండా జీవాత్మ పరమాత్మలో ఐక్యాన్ని పొందడమే!

జన్మ పరంపరకు కారణం వ్యక్తి చేసుకున్న కర్మలు. ఏ కర్మలూ— అంటే— పనులూ చెయ్యకుండా మానవులు స్థాణువులుగా ఉండిపోలేరు. కర్మలు చెయ్యకుండా ఉండడం సాధ్యం కాదు.

మనం చేసే కర్మలలో మంచి ఉంటాయి; చెడ్డవీ వుంటాయి. మంచికార్యాలవల్ల పుణ్యం లభిస్తుంది. చెడ్డ పనులమూలంగా పాపాన్ని సంపాదించుకుంటాం. మనం చేసిన కర్మలయొక్క ఫలాన్ని మనం అనుభవించక తప్పదు. ఆ కర్మలవల్లనే జన్మలు కలుగుతవి.

భగవంతుణ్ణి ప్రార్థించేవారు సాధారణంగా తమకు సిరి సంపదలు, ఇల్లు వాకిళ్లూ, ధనధాన్యాలు కావాలని కోరుకుంటారు. వాటిపైని ఆసక్తి లేనివారు తమ పాపాలను క్షమించి, పుణ్యాన్ని అనుగ్రహించాలని ప్రార్థిస్తారు. జన్మరాహిత్యానికి పాపం ఎలా సాధనం కాదో, పుణ్యం కూడా ఆ రీతినే సాధనం కాదనీ తెలుసుకున్నవారు తక్కువ.


అట్టి జ్ఞానం కలవారు ప్రార్థించే విధం యిది—

'పాతకప్రచయవన్మమ తావత్
పుణ్యపుంజమపి నాథ లునీహి,
కాంచనీ భవతు లోహమయీ వా
శృంఖలా యది పదోర్న విశేషః.'

'ఓ భగవంతుడా! నా పాపాల నన్నిటినీ నశింపజేసినట్లుగా పుణ్యాలను కూడా పూర్తిగా లేకుండా చెయ్యి. ఏమంటే — పుణ్యాలుకూడా పాపాలవలెనే బంధకారణాలే కాని వేరు కాదు. కాళ్లకు సంకెళ్లు వేసేటప్పుడు— అవి ఇనుప సంకెళ్లయితేనేమి? బంగారు సంకెళ యితేనేమి? ఏమయినా సంకెళ్లు సంకెళ్లేగదా!' అని దీని అభిప్రాయం.

మనం చేసుకున్న కర్మలయొక్క ఫలం అనుభవించడానికి ఎన్ని జన్మలయినా ఎత్తవలసి వుంటుంది. ఒక జన్మలో చేసుకున్న కర్మయొక్క ఫలం ఆ జన్మలో పూర్తిగా అనుభవానికి రాకపోతే, ఆ అనుభవంకోసం మరో జన్మ ఎత్తవలసినదే! ఈ విధంగా మిగులు లేకుండా పాప,పుణ్యకర్మల ఫలం అనుభవించినప్పుడే ముక్తి కలుగుతుంది.

అందుకోసం మనం భగవంతుణ్ణి ప్రార్థించవలసినది పాప,పుణ్యాలు రెండూ పూర్తిగా లేకుండే రీతిని చేయుమని మాత్రమే! ●



సీరియల్

చరితార్థులు

ఎస్.ఎస్.ప్రసూన

జరిగిన కథ

రమణమూర్తి, శేఖర్ బాల్య స్నేహితులు. రమణమూర్తి ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. శేఖర్ స్టేట్స్‌కి వెళ్ళి భార్య సుమతితో సహా ఇండియాకు వచ్చి రమణమూర్తిని చూడ్డానికి వచ్చాడు. రమణమూర్తి భార్య ఇందిర, సుమతి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. శేఖర్‌కి సేకాటపిచ్చి. రమణమూర్తికి అలవాటు చేశాడు. శేఖర్ రిజైన్‌చేసి హైదరాబాదు మారడానికి ప్రయత్నాలు చేశాడు. మామగారు పోవడంతో ఆవూరు బయల్దేరింది ఇందిర పిల్లలతో. తండ్రి రమణ పేరుతో వీలునామా రాయడం చాలమందికి కష్టం కలిగించింది.

6

చివరిచెల్లెలు పెళ్ళి కూడా చేసి 'హమ్మయ్య—నాన్నగారు నాకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నెరవేర్చగలిగాను' అని తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడో లేదో—

తల్లి మరణం అశనిపాతంలాగా తగిలి అతణ్ణి కృంగదీసింది. తండ్రిపోయిన నాటి నుండి—సంసార నిర్వహణలో తనకు అండగా నిలిచి అనేకవిషయాల్లో సలహాలనిస్తూ—విషమపరిస్థితుల్లో ధైర్యాన్ని కలిగిస్తూ—నిండుగా—నిబ్బరంగా జీవితాన్ని గడిపే ఆత్మశక్తినిచ్చి—ఏనాడు తనకు దిగులు కలిగి కృంగిపోకుండా విన్నోవిధాల తన జీవితాన్ని తీర్చిదిద్దిన తల్లి, మరిలేదనుకోటం—అతడి గుండెను మెలిపెట్టినట్టు పసివాడిలాగా తల్లడిల్లిపోతూ కన్నీరుమున్నీరుగా విలపించే అతణ్ణి ఓదార్చే ధైర్యంకూడా—ఎవరికీ లేకపోయింది.

ఆ కన్నీటి తడి కొన్ని ఆరిందో లేదో—మరో అఘాంతరం విరుచుకు పడింది. చివరి చెల్లెలు రాజమ్మ మొగుడు ఆఫీసు కాంప్‌కి వెళ్ళుతుండగా జీపు ప్రమాదానికి లోనై దుర్మరణంపాలైనాడన్న వార్త విని శిలాప్రతిమే అయిపోయాడు. పెళ్ళయి నిండు సంవత్సరమన్నా కాకుండానే, భర్తను పోగొట్టుకున్న చెల్లెల్ని ఎలా ఓదార్చాలో అతడికి తోచలేదు. 'అన్నయ్యా!' అని తనని చుట్టుకుపోయి వలవలా ఏడిచే చెల్లెల్ని గుండెలకు హత్తుకుని—

'అమ్మా నేనున్నాను. నీకు లోటు జరక్కుండా చూస్తాను. ధైర్యంగా నిలబడు చెల్లీ!' అని మాత్రం అనగలిగేడు.

అల్లాగే చెల్లెల్ని కంటికి రెప్పలాగా చూచుకునేవాడు.

లలితాంబకూడా ఆడబడుచు దుస్థితికి కుమిలిపోయి—తనకు చేతనయినంతగా ఓదార్పు కలిగించేది.

అన్నా వదినల వాత్సల్యంలో కొంత తేరుకున్న రాజమ్మ—మళ్ళీ మనిషిలాగా నిలబడ కలిగింది. అయినా భగవంతుడు కలిగించిన లోటు లోటే. అది ఎవరు ఎలా తీర్చగలరు. పునర్వివాహానికి పార్వతీశం ప్రోత్సాహించినా ఆమె నిరాకరించి—జడప్రాయంగా బ్రతకటానికే అలవాటుపడింది.

తమ్ముళ్ళ—చెల్లెళ్ళ బాధ్యతలు తీరేయను కునేసరికి—తన పిల్లలు ఎదిగివచ్చి—చదువులవి, పెళ్ళిళ్ళనీ పార్వతీశాన్ని వూపిరి పీల్చుకోనీయలేదు. అటు ఉద్యోగము అసిధారావ్రతం లాగానే వుండేది.

నిజాన్ని అబద్ధంగాను—అబద్ధాన్ని నిజంగాను నిరూపించి—చేతులుతడిపేవాళ్ళకేమిలు నెగ్గించగల ధీమంతులే — న్యాయనిర్ణేతలుగా చలామణీ అయేకాలంలో — పార్వతీశం ప్రవర్తన కొందరికి కంటగింపుగా వుండేది. అయినా ఎదుటబడి ఏమీ అనలేకపోయేవారు.

పార్వతీశం కోర్టులోవుంటే 'ధర్మదేవతే ఈ రూపంలో దర్శనమిచ్చిందా?' అన్న భ్రాంతి కలిగేది చూపరులకు, అతడి గంభీర గళాన్నుండి వెలువడే న్యాయమైన తీర్పును కాదని—పక్కదార్లు తొక్కటంగాని—బల్లకింద చేతులు చాపటంగాని—అతడికి తెలీని విషయాలు.


పచ్చని దబ్బపండు శరీరచ్ఛాయలో—ఆరడుగుల నిండైన విగ్రహం — మెలితిరిగిన బుర్రమీసాలతో, తెల్లని ధవళవస్త్రాలు ధరించి—చేతికర్ర వూపుకుంటూ హుందాగా దారివెంట నడిచివెళ్ళె పార్వతీశానికి—ఎంతటివారైనా ఎదుటపడే ధైర్యంలేక పక్కకి తొలగి దారి ఇవ్వాల్సిందే. మనస్సుల్లో మాలిన్యాన్ని— ఇట్టే పసిగట్టగలిగే నిశితమైన చూపుల్తో—విల్లువ్వడు గంభీర ముద్రతోవుండే ఆయనకు లంచాలు ఇవ్వజూపటానికిగాని, దొంగసాక్ష్యాలతో మస్కా కొట్టించటానికిగాని ఎవరికీ సాహసం కలిగేదికాదు. ఒక్కసారి కన్నెత్తి నిశితంగా చూశాడంటే ఆ చూపు చురకత్తిలాగా గుండెల్లో గుచ్చుకొని — వంచనాశిల్పంలో ఎంత కొమ్ములు తిరిగినవాడైనా—తల దించుకుని వెనుదిరగవల్సిందే.

'మాజిస్ట్రేట్ పార్వతీశం' అన్నపేరు వింటేనే చాలు—ప్రత్యర్థుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తేవి. అతడి న్యాయవర్తన నైతికబలం చూపి పై అధికారులకు కంటకింపై ఎదుటపడి ఏమీ చేయలేక—అతడి

కొన్ని(పవాసన్ను తొక్కిపట్టి వారు— అయినా పార్వతీశం చెదిరిపోలేదు. తను నమ్మినమార్గం వీడలేదు. అంతటి ధర్మనిరతి-రుజువర్తన, అతడికి తల్లినుండే సంక్రమించిన సుగుణసంపత్తి. రెక్కలు రాని పసివాళ్ళని తన పరలవేసి భర్త కన్ను మూస్తే, తన దౌర్భాగ్యపుస్థితికి ఒక కంట కన్నీరు కారుస్తూనే— తన కర్తవ్యం గుర్తెరిగి—అంతటి విషమస్థితిలోనూ కృంగిపోకుండా—నిబ్బరంగా నిలదొక్కుకుని—కష్ట—నిష్ఠూర్యాలన్నీ సహించి, సంసార భారాన్ని తానై నిర్వహించిందే కానీ—వారూ—వీరూ వచ్చి ఆదుకోలేదని నిష్ఠూర్యంగా అందర్నీ ఆడిపోసుకోటం గాని—ఇతర్ల ముందు అనటం గాని ఆమె ఎరుగదు. ఎంత కష్ట సమయంలోనైనా ఇతర్ల ముందు చేయి చాచి ఎరుగని అభిమానవంతురాలు ఆమె. అల్లాగే పెద్ద కొడుకు పార్వతీశం నీడలో నిండుగా బ్రతికి—భర్త తన కప్పగించిన బాధ్యతను కొడుకు సహాయంతో పూర్తిగా నిర్వర్తించి తృప్తిగా కన్ను మూసిందావిడ. ఆ తల్లి నుండి అందుకున్న ధీర—ధైర్య గుణాలే—పార్వతీశాన్ని మేరునగ ధీరుడుగా నిలబెట్టింది.

తండ్రి నుండి సంక్రమించిన ఆస్తి—చెల్లెళ్ళకు-తమ్ముళ్ళకై ఖర్చు చేసేడేగాని—తానై అనుభవించింది ఏమీ లేదు. అందుకోసం బాధే చెందలేదు. నిరాడంబరంగా—నిత్య సంతోషిగా జీవితాన్ని గడపటానికే అలవాటు పడ్డాడు. ఎన్నడు అసంతృప్తిగా ఫీలవలేదు.

యౌవనపు తొలిరోజుల్లో—చిలిపి కోరికలు తాచుపిల్లల్లాగా బుసలుకొట్టే, నిర్దాక్షిణ్యంగా అణచి వేసేవాడు. అంబాసిడర్ 'షూ' కొనాలని షాపుకెళ్ళి హవాయి చెప్పల్సే కొనేవాడు. గాబర్డిన్ సూటు వేయాలన్న మనస్సు, గ్లాస్కో పంచెలు—పాప్లీన్‌షర్టుల్లో తృప్తిపరచేవాడు. తండ్రి పాత జేబు గడియారమే వుపయోగించుకునే కాడు గానీ, తాను కొనుక్కోవాలని ఏ రోజున అయినా రాలేదు. ఇవన్నీ చిన్న కోరికలే కావచ్చును. ఇంత అల్పమైనవే అణచి వేసినప్పుడు ఇక పెద్ద పెద్ద వాటిని గురించి ఆలోచించటమే అతడి దృష్టిలో హాస్యాస్పదం-అలా అని కఠినమైన మనస్కుడూ కాదు. ఎవరి కష్టాల్ని చూసినా కరిగిపోయే దయార్ద్రహృదయం అతడిది. పేదల పాలిటి పెన్నిధి. ఆయన ముందు చేయి చాపినవారు రిక్త హస్తాలతో తిరిగిపోవటం ఎన్నడూ లేదు. తను వారాలు చేసుకుని తిని చదువుకున్న రోజులు ఎప్పుడూ మర్చిపోలేదు. అందుకే పేద విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన అభిమానం చూపేవారు. బంధుప్రీతి—స్నేహవాత్సల్యం అతడి వ్యక్తిత్వానికి మరింత వన్నె చేకూర్చింది. అలా అని సంసార జీవితం సాఫీగా గడిచిందని కాదు-సంసార సాగరంలో ఆటు—పోటులు సర్వసామాన్యం— ఎంతవారికి అవి తప్పవు. కాని కష్టాలకు కృంగిపోతూ — సుఖాలకు



లాంటాయి లేయన్న కాదు— తన్ని దశల్ని ఒకే రీతిలో తినుకుని నల్లేరు మీద బండి లాగా జీవితాన్ని గడిపి వేయడమే అతడి లోని ప్రత్యేకత.

'తాతగారు మిగిల్చిన ఆస్తి తమ దాకా రానీయకుండా—అంతా చెల్లెళ్ళకు — తమ్ముళ్ళకు ఖర్చుచేసి, నిస్వార్థపరుడన్న కీర్తి కోసం—తమ భవిష్యత్తును గూర్చి ఆలోచించలేదని —' కొడుకులు దురుసుగా మాట్లాడినప్పుడు, వారి అమాయకత్వానికి జాలిపడి నవ్వుకున్నారేగాని — కొడుకుల్తో వాదనకు దిగి—తనను తాను ఎన్నడూ తక్కువ చేసుకోలేదు. తన పిల్లలు తొమ్మండుగురిలోనూ, తనంటే— అభిమానించి-గౌరవించే వాళ్ళు-ముగ్గురే- పెద్దకొడుకు రమణమూర్తి — చివరి అబ్బాయి శంకరం — చివరి అమ్మాయి శిరీష్. తక్కిన వారంతా స్వార్థపరులే — వారి స్వభావానికి బాధ చెంది, వాళ్ళలో మార్పు తీసుకురావాలని ఎంతో ప్రయత్నించి, ఫలితం లేక— వారి నుదుటి రాత అంతే అని నిట్టూర్చారు — అలా అని నిర్లక్ష్యమూ చేయలేదు. ఎటువంటి వారైనా తన పిల్లలు వారికి అభిమాన పాత్రులే గదా! తన శక్తి వంచన లేకుండా వారి ఇష్టానుసారం చదువులు చెప్పించి వారి అభివృద్ధికి దోహదం చేశారు. అమ్మాయి లిద్దరికీ మంచి కుటుంబాల్లో సంబంధాలు చూసి వైభవంగా వివాహాలు జరిపేరు.

చరితార్థులు

చివరి అమ్మాయి పెళ్ళి మాత్రం మిగిలి పోయింది. శిరీష్‌రాణి బి. ఎస్. సి. ఫస్టి యర్‌లో వుండగా డబుల్ టైఫాయిడ్ వచ్చి—పెద్ద ప్రమాదం నుండి ఎలాగో బ్రతికి బైట పడింది. ఆమెకు రెస్టు చాలా అవసరమనీ— ఒక సంవత్సరం చదువు వాయిదా వేయమన్న డాక్టరు సలహా మేరకు—శిరి చదువు ఆ సంవత్సరం ఆగిపోయి ఇంట్లోనే వున్నది. శిరికి ఆరోగ్యం కలిగేక పెళ్ళి చేద్దాము అని ఆయన జాప్యం చేశారు. ఈ లోపుగా లలితాంబ పరలోకగతురాలు కావటం ఆయనకు పెద్ద దెబ్బ —నిండుగా— పసుపు కుంకుమలతో, భర్త కళ్ళ ఎదుట, పెద్దకొడుకు చేతి మీదుగా తరలిపోతున్న భార్యని చూసి ఎప్పుడూ చలించని మనస్సు — దృఢత్వాన్ని కోల్పోయి—ముప్పది సంవత్సరాల దాంపత్య జీవిత చింతాకనుల ముందు కదలాడి—భార్య వియోగాన్ని సహించలేక—మనస్సు కన్నీటి చెలమగా మారి—హృదయం బీటలు వారి— ఐహిక సంబంధాల మీద విరక్తి కలిగింది: అది మొదలు ఆయన జీవన సరళి వైరాగ్య మార్గాల వేపు మళ్ళింది. తను పుట్టి పెరిగిన వూరు వెళ్ళి స్థిరపడ్డారు. నిత్యము భగవద్గీత చదివి గాని పచ్చి మంచి నీరైనా ముట్టని నియమంతో— రోజులో సగభాగం వేణుగోపాలస్వామి గుడిలో కొలువు దీర్చి వేదవేదాంతగాల గోష్ఠిలో— జీవితాన్ని ప్రశాంతిగా గడిపేవారు. ఆయన జీవన సరళి చూసి 'పార్వతీశంగారు ధన్యులు. పరిపూర్ణమైన జీవితం వారిది' అంతా మెచ్చుకొని గౌరవించేవారు.

పెద్దకొడుకు రమణ పట్ల ప్రత్యేకమైన అభిమానం వుండేది ఆయనకు. తన భావాలు—ఆశయాలు అన్నీ రూపు దాల్చి— లలితాంబ మనోమృదుత్వాన్ని సంతరించుకుని ఎదుట నిల్చినట్లుగా — అనుభూతి చెంది పులకితులై పోయేవారు. రమణకు కూడా తండ్రి పట్ల అంతటి ప్రగాఢమైన గౌరవాభిమానాలు—ప్రేమా వుండేవి. ఆయన చిన్నతనంలో చిన్ని కష్టాలు పడిందీ— కుటుంబ శ్రేయస్సు కొరకు అవిరామంగా ఎంత శ్రమించిందీ! తల్లి ద్వారా విన్న రమణకు తండ్రిపట్ల గౌరవం మరింత ఇనుమడించగా — ఆరాధనా భావంతో— 'మా నాన్నగారు ఎంతటి మహాపురుషులో' అని ఆనంద భాష్పాలు రాల్చేవాడు. వీధిలో వెళ్తుంటే ఎవరైనా ఎదుటపడి 'హోహో — పార్వతీశం కొడుకు విటోయ్' అని పలకరిస్తే— ఆ తండ్రి తనయుడనన్న గర్వంతో అతడి భుజాలు పొంగేవి. అందుకనే తండ్రి—తుదినిర్ణయాలపట్ల గౌరవంతో హర్షహృదయంతో సమ్మతించాడు రమణ. కానీ మిగతావాళ్లు ఆయన కోర్కెలోని గొప్పదనాన్ని అర్థం చేసుకోలేక సంకుచితులై ఏవేమో అనుకుంటున్నారు. 'ఎవరెలా అనుకున్నప్పటికీ, మా అన్నయ్య పదిమందీ మెచ్చుకునే పనే చేశాడు. అది అర్థం చేసుకునేవాళ్లు కూడా అంతటి వున్నతులే కావాలి'—రాజమ్మ కళ్లు తెల్లవారేదాకా వర్షిస్తూనే వున్నాయి.


* * *

తెల్లవారింది...చివరి హడావుడిలో వారుండీ అంతా ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు.

చంద్రం భార్య—పాలేర్ని పిలిచి అటక ఎక్కి పాత సామాను దింపమన్నది. రెండు మూడు బిందెలు— కొద్ది పాటి చిల్లర సామాను గిన్నెలు, పళ్ళేలు లాటివి దించి— ఇంక మరి లేవన్నాడువాడు.

'లేకపోవటమేమిటి సరిగ్గా చూడు' కళ్లు పెద్దవిచేసి కసిరిందామె.

వాడు బిత్తరయిపోయి 'మాశావండి



ఇంక ఏమీలేవండీ అమ్మా' అంటున్నాడు. ఎందుకో ఆటువేపుగా వచ్చిన ఇందిర, వీళ్ళ మాటలు విని—

'మాడు అక్కయ్యా! అటకనిండా బోలెడు సామాన్లువుండేదికాదూ తీయమంటే, వీడు చూసి ఏమీ లేవంటున్నాడు' చంద్రం పెళ్ళాం చెప్పింది.

'అదేమిటి, సరిగ్గా చూశావురా!' ఇందిర అవన్నీ తెల్లబోయింది.

ఇంతలో రాజా పెళ్ళాం— 'మీ రిద్దరే సామానన్నీ పంచేసుకుంటున్నారేమిట ?' సన్నాయి నొక్కులు నొక్కుతూ వచ్చింది.



చంద్రం పెళ్ళాం బుస్సున లేచింది.

'ఎవరు పంచుకుంటున్నారో సరిగ్గా చూసి మాట్లాడు. అసలు పంచుకుందుకు సామాన్లేమిటేవు తెల్సా.'

చంద్రం పెళ్ళాన్ని తొందరపడవద్దని వారిస్తూ ఇందిర మెల్లగా అసలు సంగతి వివరించింది.

'ఏమైనాయంటే—ఏమైనా'యని తోటికోడళ్ళు ముగ్గురూ గుసగుసలు మొదలెట్టారు.

ఈ గొడవకు కామాక్షి రంగంమీదకు వచ్చింది. అసలామెడ పేరు 'చండిక' అని పెట్టాల్సింది. గొంతు విప్పితే వూరంతా వినపడాలి. వస్తూనే—

'ఏమిటండోయ్ తోటికోడళ్లు ఇల్లు సాఫా చేస్తున్నారు' దీర్ఘం తీసింది.

చంద్రం పెళ్ళాం చివ్వున వెనక్కు తిరిగి 'ఏమిటండీ వదినా మీరనేది? ఒక్కసారి మా మొహాలు చూసి—ఆమాట అనండి—మేం ఈ ఇంటి కోడళ్ళం కదండీ— మరి మా ఇల్లు మేమే సాఫా చేసుకుంటున్నాం. తప్పేమీ లేదు—హక్కు మాకున్నది లెండి' కళ్ళు తిప్పుతూ అన్నది.

'అబ్బో వచ్చారమ్మా హక్కుదార్లు, అందుకే అంటారు 'ముందు వచ్చిన చెవుల కన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి'

'వదినగారూ— కాస్త తమాయించండి— పెద్ద పెద్ద మాటలు వాడకండి, పెద్ద పెద్ద మాటలు వాడకండి, నాకసలే కోపం జాస్తి' తారాజువ్వలాగా లేచింది చంద్రం పెళ్ళాం.

'ఏం నీకు కోపం వస్తే ఏం చేస్తావ్? తలకొట్టి మొలేస్తావా? ఇక్కడ నీ బాబు సొమ్మేం లేదు. చేతికందినవన్నీ చక్కా తీసుకుపోవటానికి.'

'వదినగారూ — అనవసరంగా బాబుల ప్రసక్తి తేకండి! ఆ మాట కొస్తే — మీ బాబు సొమ్ము లేదిక్కడ. అంతా పరుల పాలే చేశారు, అప్పులే మాకు మిగిలింది. ఈ దిన వారాలకు ఆరువేలు ఖర్చు అయింది. ఆరువేలండీ, అంతా మా కష్టార్జితం— ఎవరి బాబూ సొమ్మూ కాదు.' రాజా పెళ్ళాం అన్నది.

'ఏం! ఎవరి కోసం చేస్తారు? తండ్రి పోతే— కొడుకులు దిన వారాలూ చేయటమూ అబ్బురమేనా' ఎకసెక్కెంగా అంటూ

చరితార్థులు

చేతులు తిప్పింది. ఆవిడ మాటలకు ఇందిరకు కోపం వచ్చింది. అసలు గట్టిగా మాట్లాడే స్వభావం కాదామెది. ఘర్షణ అంటే అసలే గిట్టదు— అయినా వూరుకో లేక పోయింది.

'అవునండీ వదినా! ఇంటపుట్టిన ఆడబడుచుకు ఇల్లు దోచుకుపోయే హక్కున్నది. ఇంటికొచ్చిన కోడళ్ళకు ఖర్చులు— బాధ్యతలు తలకెత్తుకుని — అక్షింతలు వేయించుకునే హక్కున్నది' ఇందిర మాటకు మరింత రెచ్చిపోతూ—'ఏమిటీ? నేను ఇల్లు దోచుకుపోయానా? నువ్వు చూశావా! అయ్యో...అయ్యో ఎంతంత లేసి మాటలంటున్నారో?' రాగం మొదలెట్టింది. మీనాక్షి కూడా అక్కకు సపోర్టు వచ్చి మరో నాలుగు మాటలు వడ్డించింది. క్షణంలో నట్టిల్లు రణరంగంగా మారిపోయింది. మగవాళ్ళు ఇంట్లో లేకపోవటంతో — ఆడవాళ్ళ నోటికి హద్దు-పద్దూ లేకుండా పోయింది. అప్పుడే వీధిలోంచివచ్చిన రమణ— ఈ ఆడవాళ్ళ ఏడుపులకు— పెడబొబ్బలకు విస్తు పోయాడు. ఖంగారుగా కామాక్షిదగ్గరకు వచ్చి—'ఏమిటిది అక్కయ్యా! వూరుకో— వూరుకో' వోదార్చబోయాడు. దాంతో ఆవిడ మరింత గొంతు పెంచి.

'చూడరా రమణా! నేను దొంగదాన్నిట— ఇల్లంతా దోచుకుపోయానట, నోటకొచ్చినట్లల్లా అంటున్నారు' ఏడుపు ఆపకుండా అన్నదావిడ.

'ఏమిటి ఇందూ గొడవ? ఇలాటప్పుడేనా ఇవన్నీ' మందలింపుగా అన్నాడు భార్య వేపు తిరిగి.

'గొడవ ఏమిటండీ — వీలాగూ ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతున్నాముగదా. నలుగురూ వుండగానే సామాన్లనీ ఏవివున్నాయో చూసుకుని — ఎవరికేమి కావాలో తీసుకుంటే పేచీ వుండదుగదా అని— అటకమీద సామాన్లు దింపిస్తూంటే మీ అక్కగారొచ్చి— ఇల్లు సాఫా చేస్తున్నాం అంటారు, అది సబబుగా వున్నదా మీరు చెప్పండి' నెమ్మదిగానే అన్నది ఇందిర.

'ఇప్పుడా సామాన్ల గొడవెందుకు?' చిరాగ్గా అన్నాడు.

'ఇప్పుడు కాక ఇంకెప్పుడు? అత్తగారి వంటిమీద అంత జవ్వారి వుండేది, అవి ఏమయాయని మేం అడిగేమా? తల్లి సొమ్ము కూతుళ్ళకే చెందాలి అని చూసీ చూడనట్లు వూరుకున్నాం. తాతలనాటి పాత్ర సామాగ్రి బోలెడు వుండేది. అవన్నీ కొడుకులకే చెందటం న్యాయం — అవేమయాయని అడగటం తప్పేమీ కాదు' చంద్రం పెళ్ళాం రోషంగా అన్నది.

రమణకు ఛ్రరున కోపం వచ్చింది.

'ఇంకచాలు మరి మాట్లాడితే మర్యాద దక్కదు. అలగా వాళ్ళలాగా—ఛీ ... సిగ్గు లేదు? వెధవ సామాన్ల కోసం, జుట్లు పట్టుకుంటారా? వెళ్ళండి అవతలకు' విసురుగా అన్నాడు.

చంద్రం పెళ్ళానికి రాజా పెళ్ళానికి బావ గారి మాటలకు కోపం వచ్చినా చేసేదిలేక తల దించుకుని అవతలకు వెళ్ళేరు.

ఇందిరకు ఇదంతా బాధగానే వున్నది. ఇదివరకెప్పుడూ ఆడబడుచులతో ఘర్షణ పడలేదామె. మామగారంటే ఎనలేని గౌరవ మామెకు. గంభీరంగా ఆయన ఇంట్లో తిరుగుతూ వుంటే—పెదవి కదిపే ధైర్యం

చిల్లా

1 కప్పు పెసర పప్పు రాత్రంతా నానబెట్టాలి. మెత్తగా రుబ్బి, కొంచెం నీళ్ళు పోసి పల్చటి ముద్దగా చెయ్యాలి. అందులో అర చెమ్చాడు వుప్పు కలపాలి. సన్నగా తరిగిన కొత్తిమీర, అరచెమ్చాడు కారం అందులో వెయ్యాలి. పెనం వేడిచేసి నూనె రాయాలి. బాగా వేడెక్కాక, గరిటెడు పిండి తీసి పెనం మీద పోసి, పల్చగా పరవాలి. ఒక పక్క ఎర్రగా కాలిన తర్వాత తిరగవేసి చుట్టూ కొద్దిగా నూనె వెయ్యాలి. రెండో పక్క కూడ ఎర్రగా కాలిన తర్వాత తీసి, వేడివేడిగా వడ్డించాలి. ఇది ఉత్తరాది వంట. మన పెసరట్టు లాంటిది.

సజ్జరొట్టె

సజ్జపిండి	4 కప్పులు.
ఉప్పు	$1\frac{1}{2}$ చెంచాలు
నీళ్ళు	$1\frac{1}{2}$ చెంచాలు
నెయ్యి	30—50 గ్రా.

మక్కికి రొట్టె చేసినట్లే చెయ్యాలి. కాని, ప్రతిదీ కలిపే ముందు, ఒక గరిటెడు నెయ్యి పిండిలో కలపాలి.

— రూ. రా.

ఎవరికే వుండేది కాదు—ఎవరి హద్దుల్లో వారుండేవారు. ఆప్యాయంగా — కబుర్లు చెప్పుకోవటమేగాని— మాటే పోటీ మాట లయినా అనుకుని ఎరగరు. ఇప్పుడు మామ గారు లేకపోయే సరికి ఇంత అసహ్యకర మైన గొడవ జరిగింది. శుక్రవారం పూటా ఆడబడుచులు రాగాలు పెట్టటం అరిష్టంగా అన్పించిందామెకు. అందుకే కామాక్షి దగ్గిరగా వచ్చి.


'వూరుకోండి వదినగారూ! అయిం దేమో అయింది. అలా ఏడవకూడదు' అన్నది ఆవిడ చేయి పట్టుకుని.

ఆ చేయి విసురుగా తోసేసి, 'అబ్బో! ఏం వంగనాచి కబుర్లు? అనేవన్నీ అనేసి— వూరుకోమంటే సరిపోతుందా? మా అమ్మా — నాన్న లేక పోబట్టే గదా మీరిన్ని మాటలన్నారు, అయినా మాదే తప్పు — ఇంక మాకిక్కడేమి వున్నది, మానాన్న ఎప్పుడు పోయారో అప్పుడే ఈ ఇంటితో రుణం తీరింది మాకు. ఇంకా వుండటం బుద్ధి తక్కువ.' 'పదండే పోదాం మీ మొహాలు ఏడ్చా ఇంకా మన కిక్కడ ఏం లేదు' అని కంచాల ముందు కూర్చున్న పిల్లల్ని రెక్కలు పట్టుకుని ఈడ్చుకెళ్ళి —అప్పటికప్పుడు బండీ కట్టించుకుని వెళ్ళిపోయిందావిడ, ఆ దగ్గరలోనే వున్న పల్లెటూరావిడది. మీనాక్షిది కూడా అక్కగారి వూరే- ఆమే అక్కగార్ని అనుసరించింది. రమణ తమ్ముళ్ళు భార్యల ద్వారా అంతా విని అన్నగారిమీదే కోపగించారు. సామాన్లు ఏమైనా పోని అంతు తేల్చవద్దా— పోయిన ఆస్తి పోనేపోయింది. వున్నాయనుకున్న వేల ఖరీదుచేసే పాత సామానూ లేకపోవటం వాళ్ళకు చాలా కసిగా వున్నది. దీనంతటికీ అన్నగారే కారణమని. అతడి మంచితనమే తమర్ని ముంచిందని వళ్ళు కొరుక్కుని— చేసేదేమిలేక — అన్నగార్ని ఏమనలేక- మేనత్తను పక్కకు పిల్చి అడిగేరు. 'ఎప్పుడూ ఇక్కడే వుండేదానివి — నాటి సంగతి నీకు తెలీదా' అని.

'ఏమో బాబూ! ఇంట్లో శుభకార్యాలప్పుడు అన్నీతీసి వాడి తరువాత అటకమీద జాగ్రత్త చేసేవారు, వూళ్ళో ఎవరింట ఏ అక్కరు జరిగినా మన సామాన్లే పట్టుకుపోయేవాళ్ళు — అప్పి మళ్ళీ జాగత్తగా అప్పగించేవాళ్ళు కూడను — మీ అమ్మ వున్నన్నాళ్ళు అలా జరిగింది. తరువాత నాటి సంగతి నాకు తెలీదు, మీ నాన్న తిప్పడూ గుడి — గోపురం అంటూ ఇంటి విషయాలు పట్టించుకునేవాడు కాదు— నేనూ మా అక్కయ్యదగ్గరకు అప్పుడప్పుడూ వెళ్ళి రెండు-మూడునెలలు వుండి వచ్చేదాన్ని— నేను లేనప్పుడు కామాక్షీ— మీనాక్షీ ఇల్లు చూచుకునేవారు. ఏమున్నా తెలిస్తే వాళ్ళకే తెలియాలి. అయినా మీరు ప్రయోజకులైనారు— మీ రెక్కలు చల్లగా వుంటే అమాత్రం కొనుక్కోలేకపోరు— దిక్కుమాలిన సామాన్లకోసం ఎందుకొచ్చిన రభస నాయనా— నలుగురూ నవ్విపోయేరు వూరుకోండి' అని ఆవిడ సర్ది చెప్పింది.

నిజానికి కామాక్షే దీనంతటికీ కారణం. వారింట శుభకార్యాలప్పుడు 'మళ్ళీ ఇస్తా నని' చెప్పి. గుండిగలు—గంగాళాలలాటి పెద్ద వన్నీ తీసుకెళ్ళి మరివ్వలేదు. తరువాత కొన్ని మీనాక్షీ తీసుకెళ్ళింది— ఇంకా మిగిలినవి ఇద్దరూ చేరి లోపాయికారిగా అమ్మి వేసారు. తండ్రి ఇదేమీ పట్టించుకునేవాడు కాదు—తనమాత్రం 'అదేమిటే అంతలేసి పాత సామాను అమ్మకంటారుటే ? ఈ రోజుల్లో ఇలాటివి కొనాలంటే మాటలా!

ఇదీరాక ఆగ్రి అను గొర్లతో — తమ్ముళ్ళు



చేంనాల్సినవి. వాళ్ళూ నలుగురు పిల్లలుగల వాళ్ళు. కార్య— కరామతులకు అవసరం రావా?' అని అన్నందుకు, కామాక్షి గంపె లాగా విరుచుకుపడి, 'మా నాన్న సామాను ఇష్టమొచ్చినట్లు చేసుకుంటాం నీ కెందుకు? ఇన్నాళ్ళు కొంపలోపడి తిన్నది చాలక తగుదునమ్మా అని మా మీద పెత్తనం చెలాయిస్తావా? నీకా అధికారం ఎవరిచ్చారంట— ఇప్పుడే చెప్తున్నా— నీ కవసరంలేని విషయాల్లో కల్పించుకోవద్దు' అని నోటికొచ్చినట్లల్లా అన్నది. తను చేసేది లేక నోరు నొక్కుకుని వూరుకున్నది. కామాక్షి నోటికి జడిసి ఇప్పటి వంగతులేవీ బైట పెట్టలేదు రాజమ్మ.

అందరి మొహాలు చిటపటలాడినయ్యి. మౌనంగా భోజనాలు కానిచ్చారు. రాజమ్మ సంగతిగాని, శిరీష్‌రాణి సంగతిగాని ఎవరూ యెత్తలేదు. ఏదో పనిమీద గది లోకి వెళ్ళిన ఇందిర.

మంచం మీద బోర్లాపడుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న శిరీష్‌ను చూసి.

'ఏమిటమ్మా? ఎందుకులే...లే' అంటూ పక్కలో కూర్చుని వోదార్చింది.

'వదినా! మీరంతా వెళ్ళిపోతున్నారా?' పసిపిల్లలాగా వదినగార్ని చుట్టుకు పోయి బావురు మన్నది. శిరీష్, ఇందిర మనస్సు జాలితో నిండిపోయింది.

'పిచ్చిపిల్లా నిన్ను వదిలిపెట్టి ఎలా వెళ్తామనుకున్నావు? ప్రొద్దుట్నుంచీ జరిగిన గొడవతో నాకు మతి సరిగ్గా లేక పోయింది. నువ్వు మాతోనే వస్తున్నావు లేచి బట్టలు సర్దుకోమ్మా' ఆడబడుచుని అభిమానంగా లేవ దీసింది ఇందిర.

'అత్తయ్యా! నువ్వు కూడా మాతో వచ్చేయి' అన్నాడు మేనత్తతో రమణ.

'నీ అభిమానం నాకు తెల్సురా నాయనా — ఇప్పుడు కాదులే — వోపిక వున్నంత వరకూ ఇక్కడే వుంటాను. తరువాతెలాగూ నీ దగ్గరకే వస్తాను- ఇక్కడ మాస్టారు వాళ్ళు తోడుగానే వుంటారు. భయం ఏమి వున్నది. కొన్నాళ్ళిల్లా జరుగనివ్వు' సర్ది చెప్పిందావిడ.

రమణ ఎంత బ్రతిమలాడినా— ఆమెను తనతో రావటానికి వొప్పించలేక పోయాడు. మిగతా వ్యవహారాలన్నీ లాయరు రంగనాథం గారికి అప్పగించి — బరువైన గుండెతో తిరుగు ప్రయాణమయ్యారు ఇందిరా — రమణా వాళ్ళు. **(ఇంకా వుంది)**

'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి.' ఆంధ్ర సచిత్ర వారపత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

వారఫలం

22-6-1973 శుక్రవారం మొదలు 28-6-1973 గురువారం వరకు

మేషం:— లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. సాటివారిలో గౌరవం బాగుంటుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం—వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో మీరు శ్రమ పడినా, ప్రయోజనం ఉండదు. చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మిథునం:—అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

కర్కాటకం —రావలసినడబ్బుసమయానికి అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— ప్రయాణాలోచనలు చేస్తారు. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

సింహం.—సహాయం చేస్తామన్న వారు సమయానికి తప్పుకోవచ్చును. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

కన్య:— ప్రయత్నించిన ప్రతి పని సులువుగా నెరవేరగలదు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో ఆందోళనకు గురి కాగలరు. కొన్ని వ్యవహారాల్లో ప్రయాస పొంది ఫలితం పొందలేక పోవచ్చును.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది.

తుల.— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాటివారితో వాదప్రతివాదాలు తగవు. వారం ఆఖరులో ప్రయాణాలు ఫలిస్తాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారులు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృశ్చికం —వృత్తిలోమీప్రయత్నాలుఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారం ఆఖరులో వ్యాపారంలో సాటివారి పోటీ పెరుగుతుంది. ఇతరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది.

స్త్రీలకు— సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

ధనుస్సు:—సామాన్యమైన పనులకు కూడా మీరు యెంతో కృషి చేయవలసి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీకృషి రాణిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మకరం —వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాల్లో అడావుడి అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు.

స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

కుంభం:—అన్నివ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మీనం:— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవప్రాబల్యాలు బాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్


గాలిలో మేళవించిన సౌందర్యం...
అరచేతిలో అతిస్వల్పం
అమితంగా వెదజల్లుతుంది పరిమళం
సుమసౌరభం గాలిలో మేళవిస్తుంది
ల- ల- ల- ల- ల- ల-
లక్మే లవెండర్ బ్యూటీ టాల్క్
రాసుకోండి - మనోల్లాసకరమైన పౌడరు
ఫ్రెంచి లవెండర్ పుష్పాల సువాసనలు
అనుభవించండి
Lakmé
LAVENDER BEAUTY TALC
Lakmé
లక్మే
లవెండర్ బ్యూటీ టాల్క్
లక్మే - సౌందర్య పోషక నిపుణులు



రమ్మీ టేబులు ఆటగాళ్ళులేక బోసిగా ఎదురవడంతో-టేబుల్ టెన్నిస్ హాలు లోకి నడిచాడు గోపాలం.

ఛటర్జీ, శ్యాంప్రసాదులమధ్య సింగిల్స్ జరుగుతోంది. ఇద్దరు ఆ ఆటలో ఛాంపియన్స్. వాళ్లిద్దరి నడుమ పోటీ—చూడ ముచ్చటగా ఉంటుంది. వాళ్ల ఆట తీరు చూశాక టేబుల్ టెన్నిస్ అమ్మాయిల ఆట అని తేలికగా తీసి పారెయ్యగలిగే ధైర్యం ఎవరికీ ఉండదు.

రమ్మీ టేబులు కలకలలాడేవరకూ టేబుల్ టెన్నిస్ మ్యాచ్ చూద్దామన్న సదుద్దేశంతో కుర్చీ తీసుకుని కూర్చున్నాడు గోపాలం.

గోపాలం కూర్చున్నచోటుకి కొంచం దూరంలో మరో యిద్దరు కుర్చీలలో కూర్చున్నారు. కానీ—ముఖాలకడ్డంగా పేపర్లుండటం వల్ల వాళ్లను విష్ చేసే ప్రయత్నం

మానుకున్నాడు గోపాలం. కొద్దిక్షణాలలోనే ఆటచూడటంలో సంపూర్ణంగా లీనమయ్యాడు

శ్యాంప్రసాద్ సర్వీసులు బులెట్లులాగా పరుగెడుతున్నాయి, ఛటర్జీ స్ట్రోకులు బంతిని కంటికి కనిపించనంత వేగంగా ఎగరగొడుతున్నయ్. ఎవరికీ సులభంగా పాయింట్ రావడంలేదు. స్కోరు డల్‌గా ఉన్నా ఆట అద్భుతంగా ఉంది. ఎవరి మట్టుకు వారే ఎగ్జిబిషన్‌గేమ్ ఆడుతున్నారు,

'పదిరూపాయలకోసం— పట్టపగలు హత్య!'

గోపాలం త్రుళ్లిపడి అటువైపు చూశాడు,

అరిచింది మూర్తి. పేపరు వార్తను నలుగురికీ వినిపింపజేసే ప్రయత్నం చేయబోయి— ఆశ్చర్యం ఆపుకోలేక కాబోలు బిగ్గరగా అరిచాడు అతని చేతిలోని పేపరు జారిపడిపోయింది.

'నేను నమ్మను—' మెల్లగా అన్నాడు రవి. 'ప్రాణం ఖరీదు నిశ్చయంగా పదిరూపాయలకంటె ఎక్కువే. మనిషి బ్రతుకింకా అంత చవక కాలేదు.'

'నేను అబద్ధమాడేనంటావా? నేను బ్లఫ్‌చేస్తున్నాననే అనుమానం ఉంటే — పేపరు చూడు—' పేపరందుకుని చూపించాడు మూర్తి.

ఒక్కక్షణం సందేహాస్పదంగా పేపరులోకి చూస్తూ ఉండిపోయాడు రవి.

విజయ గర్వంతో—మందహాసం చిందింపజేస్తూ— 'డబ్బు, మనిషిని పాలిస్తున్న రోజులు యివి. పాతరోజులు కావు. మనిషి ధనానికి బానిస. ఈ నిజం ఎంత త్వరగా తెలుసుకుని అంగీకరిస్తే అంత మంచిది' అన్నాడు మూర్తి.

పేపరు మడిచి అవతల విసిరేస్తూ— 'నే నంగీకరించను. ప్రపంచంలో ధనానికి చాలా విలువ ఉన్నమాట నిజమే కావచ్చు. కాని ... మానవత్వంముందు ధనం చిల్లిగవ్వకు తూగదు—' అంటూ ఖండనకు పూనుకున్నాడు రవి.

వారిద్దరు పదహారణాల పచ్చి ఆంధ్రులు. ఆవేశం వారి జన్మహక్కు. ఇద్దరు ఆంధ్రులు మాట్లాడుకోడం ప్రారంభిస్తే — కొంత సేపటికది పోట్లాటగా మారితీరుతుందని ఎవరో నొక్కి వక్కాణించినటు గానే మాటలు కాస్తా వాదంగా పరిణమించాయి.

ఎంతో కష్టపడి—వాదనలో తలదూర్చకుండా సంయమనం పాటించ సాగాడు గోపాలం. నిగ్రహం పాటించేందుకు తాను ఏదో పుస్తకంలో చదివిన ఆణిముత్యంవంటి ఆంగ్లసూక్తి మననం చేసుకున్నాడు.

'నమ్మేవాడికి ఏ నిదర్శన మూ అవసరం లేదు. నమ్మనివాడిని ఎన్ని నిదర్శనాలు చూపించీ నమ్మించ తరంకాదు' ఇదీ ఆ ఆంగ్లసూక్తి.


అదీకాక నమ్మకాలమీద ఆధారపడి ఉండే విషయాలేవీ తేలవు; వ్యక్తిగత విశ్వాసాలు ఎవరివివారివి. వాటిలో ఏది నిజం అన్న ప్రసక్తికే తావుండదు.

'మనిషి—డబ్బుయొక్క నీడ. ధనవంతుడి చేతిలో రాయి రత్నమౌతుంది మనిషికీ, మాటకీ విలువను పెంచేది డబ్బు— ఇదే యీ నాటి సమాజం. ఈ నిజానికి సడలింపులు లేనే లేవు' కుండ బద్దలు కొట్టినట్లు తీర్మానించాడు మూర్తి.

తన వాదాన్ని పటిష్ఠం చేసుకునేందుకు ప్రయత్నించడంలో రవి తాత్కాలికంగా మౌనం దాల్చినట్లుంది. అదే అదునుగా పుంజుకున్నాడు మూర్తి. 'రవీ అన్ని క్వాలిఫికేషన్లూ ఉండికూడా నువ్వింకా నిరుద్యోగిగానే ఉండిపోడానికి కారణమేమిటో నిజంగా నీకు తెలియదూ? డబ్బు! డబ్బు!! ధనమే ప్రపంచలీల...అంతే రవీ. నీ విషయమే తీసుకో...'

రవి ముఖం మ్లానమైంది.

వాదం కాస్తా ప్రమాదకరమయిన



ఏడుకొండల వాడిని మనసులో చిత్రించుకుంటేనే లక్ష్మి కటాక్షం లభిస్తుందంటారు. రోడ్డు మీద రంగు సుద్ద ముక్కలతో, బొగ్గుతో శ్రీ వెంకటేశ్వరస్వామి బొమ్మ చిత్రించినా అది లభిస్తుంది. మదరాసు మహా నగరంలోని ఒక వీధిలో పేవ్‌మెంటు చిత్రకారుడొకడు గీచిన బొమ్మ యిది. మధ్య మధ్య తెల్లగా కనిపించేవి ధర్మాత్ములు దయతో వేసిన చిన్న, పెద్ద నాణాలు. (ఫొటో : పత్రిక చిత్రకారుడు శ్రీ సంపత్‌కుమార్)

మలుపు తిరిగి - వ్యక్తిగత విషయాలవంక మళ్ళుతోంది.

'ధనవంతులలో మనుషులే లేరంటావు! ఐశ్వర్యవంతు లందరూ నీలా అమానుషులనేనా?'

'మానవత్వమూ, ఐశ్వర్యమూ ఒక ఒరలో యిమడని రెండుకత్తులు.'

ఇక వినలేకపోయాడు గోపాలం.

అతనికి హఠాత్తుగా రాధ జ్ఞాపకం వచ్చింది. ఆమె వెనుక...

భరించలేకపోయాడు.

గ్లాసెడు మంచినీళ్లుతాగి క్లబ్బు బయటకు వచ్చాడు.

అతని మెదడు అల్లకల్లోలంగా ఉంది. మనిషి ధనానికి బానిసేనా?

కాదు అనుకున్నాడు గోపాలం. ముందు మనిషి. తరువాతే డబ్బు. అలా అనుకోడంలో అతనికి హాయి లభించింది.

'ప్రపంచంలోని అన్నిటికంటె మనిషికే విలువెక్కువ.' మళ్లీ మళ్లీ అలా అనుకునే సరికి అతనికి కొంచం ధైర్యం కలిగింది. కాని—అంతలోనే సందేహం. రాధ ఏ తరగతికి చెందిన మనిషి?

డబ్బు...మనిషి...వీటిమధ్య ఆమె ఎన్నిక ఎలా ఉంటుంది? ఆలోచిస్తూ యాంత్రికంగా అడుగులు వేయసాగాడు గోపాలం.

* * *

స్నేహాలూ, ప్రేమలూ-వీటి ప్రారంభం అతి విచిత్రంగా ఉంటుంది. ఏ నియమానికీ కట్టుబడకుండా యివి తల ఎత్తి విస్తరిస్తాయి. మీ ప్రేమ ఎలా ప్రారంభమైందని ప్రశ్నిస్తే కథలో పాత్రలు సమాధానం చెప్పగలవేమో కాని - వాస్తవిక జీవితంలో వ్యక్తులు సమాధానం చెప్పలేరు. వాస్తవ జీవితంలో స్నేహాలూ- ప్రేమలూ వీటి తాలూకు ప్రాథమికదశలు అస్పష్టంగానూ అతి త్వరలో మరపువచ్చేనిగానూ ఉంటాయి.

రాధ, గోపాలం—యిద్దరూ మరచిపోయారు తాము ఎలా స్నేహితులయ్యారో, ఆ స్నేహం ఎలా ప్రేమగా మారిందో.

నిజమైన స్నేహం; స్వచ్ఛమైన ప్రేమ—వీటిలో ఒక చిత్రమైన గుణం ఉంది. ఇద్దరికీ సంబంధించిన విషయాల గురించి పట్టించుకోకపోవడం.

అందుకే రాధకి గోపాల గురించి తెలిసిందల్లా అతను ఎమ్మే ఫస్ట్‌క్లాసనీ— సబ్జక్టు లిటరేచరనీ.

గోపాలానికి రాధగురించి కొంచం ఎక్కువ తెలుసు. రాధ మెడిసిన్ డిగ్రీ తీసుకుని—స్వంత ప్రాక్టీసుపెట్టేముందు అనుభవం కోసం గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టరుగా చేరింది. ఒకటి రెండు సంవత్సరాలయ్యాక ఆమె అన్ని హంగులతోనూ రాధా నర్సింగ్ హోమ్ తెరుస్తుంది.

ప్రకృతి సహజంగా—స్త్రీ పురుషులమధ్య స్నేహం మరొక చిగురువేయకుండా ఉండలేదు.

గోపాలం, రాధల విషయంలోనూ యిదే జరిగింది.

స్నేహం మెల్లమెల్లగా ప్రేమ స్వరూపం దాల్చింది.

ఇద్దరికీ భవిష్యత్తుమీద ఆశలుండటం వల్ల ప్రేమను పెళ్లిగా మార్చేసుకుని జీవితాన్ని రసరహితం చేసేసుకుందుకు తొందరపడలేదు.

ఈక్షణంలో మాత్రం గోపాలానికి రాధ గురించి ఒక్క సందేహం ఏర్పడింది.

డబ్బుకి మనిషి బానిసా? మనిషి డబ్బుకి బానిసా?

రాధ ఉద్దేశంతో యిద్దరినడుమా ఉన్న అనుబంధపు భవిష్యత్తు నిర్ణయించబడుతుంది.

రాధ నిర్ణయం ఎలా ఉంటుందో?

గోపాలం ఆత్రుతకొద్దీ అతి త్వరగా అడుగులు వేయసాగాడు.

* *

డాక్టరు చాలా బిజీగా ఉంది.

పేషంట్ల క్యూ హనుమంతుడితోకలా పెరుగుతూందే తప్ప తరగడం లేదు.

ఆ క్యూ - భారతదేశ జనాభాకి నిదర్శనంగా ఉంది.

దేశ పురోభివృద్ధిలాగే ఆ క్యూ కూడా అతిమెల్లిగా సాగుతోంది.

రాధకి కనపడకుండా చక్కని స్థలం ఎన్నుకుని—ఆమెను పరిశీలనగా చూస్తున్నాడు గోపాలం.

'పేరు?'

'......'

'వయస్సు?'

'........'

తలఎత్తకుండా చకచక వ్రాసుకు పోతోంది డాక్టరు.

ఆమె చాలా చికాకు పడుతున్నట్లు చిట్లించిన నొసలే తార్కాణం.

గోపాలానికి జాలివేసింది ఆమె మీద.

పేషంట్లు డాక్టరు సహనాన్ని పరీక్షించి వదలి పెడుతున్నట్లుంది.

ఎందరు పేషంట్లు!

ఎన్ని జబ్బులు!!

ఎంత సహనశీలికయినా అసహనం కలిగే పరిస్థితులు.

చీటీల దొంతర తరుగుతోంది.

చరచర చీటీలు వ్రాసేస్తోంది డాక్టరు.

మెరుపు తీగెల్లా కదులుతున్న ఆమె వేళ్లను చూసి ముచ్చటపడ్డాడు గోపాలం.

డాక్టరు గదిముందు—ఖరీదయిన కారాగిన మెత్తని చప్పుడు. తలఎత్తి చూసింది రాధ.

తొట్రుపాటుపడుతూ లేచింది. మందహాసం చిందించే ప్రయత్నం చేసింది. స్టెత్ తీసి టేబుల్‌మీదపెట్టి క్యూని చీల్చుకుంటూ హడావిడిగా నడచింది.

అప్పటికే డాక్టర్‌ని మందలిస్తున్నట్లు మృదువుగా మధురంగా రెండుసార్లు మ్రోగింది కారు హారన్.

గోపాలం అటువైపు ప్రసరింపచేశాడు తన చూపులని.

కారులో ఒక్క ఆమెమాత్రమె ఉంది. డ్రయివర్‌లేకుండా తానే డ్రైవ్ చేసుకు వచ్చినట్లుంది.

ఆమె ఎంత మాత్రమూ పేషంట్‌లా లేదు.

దిగివచ్చిన దేవతలా ఉంది. ఆకృతి దాల్చిన ఆరోగ్యంలా ఉంది.

అందానికి—అప్సరసలా ఉంది. ఐశ్వర్యానికి కుబేరుడి కూతురిలాగో, కోడలుగానో ఉంది.

'మంజరి! మీరు స్వయంగా వచ్చారా! అసలే మీకు నీరసంకదా, యింత శ్రమపడ వచ్చునా? నో...నో...ఫోన్‌చేస్తే నేను పరుగెత్తుకురానూ?'

డాక్టర్ కంఠంలో ఆప్యాయత ... అనురాగం...లాలన...సున్నితమైన మందలింపు.

'ఉహు!... అదికాదు డాక్టర్, ఇంటి దగ్గర ఏమీతోచక బయలుదేరానంతే. దీనిలో పెద్ద శ్రమేముంది? ఇక్కడే చెక్ చేసెయ్యండి...'

'నో ప్లీజ్...మీకు తెలియదు మంజరి. ఇది పట్టి దరిద్రగొట్టుస్థలం. ఈ డర్టీ పేషంట్లూ...ఫినాయిలు వాసనలూ...వీటి మధ్య క్షణం నిలబడలేరు. వద్దు ... నేనే యింటికివస్తాను. అరగంటలో...'


'సరే. మీయిష్టం డాక్టర్.'

మంజరి - ఐశ్వర్యవంతుల అమ్మాయో, కలవారి కోడలో అయిన ఆ అందమయిన అమ్మాయి—మళ్లీ కారులో కూర్చుంది.

డాక్టర్ కారు తలుపు మూసి — అభివందనలు తెలిపి—కారు హాస్పిటల్ ఆవరణ దాటేవరకూ నిలుచుని—అప్పుడు మళ్లీ లోపలకి నడిచింది.

గోపాలం ముఖం మ్లానమైంది.

చిరాకుగా చీటీల దొంతరను దగ్గరకు లాక్కుని కుర్చీలో కూలబడింది డాక్టర్ రాధ.



'పేరు?'

'.. ...'

వయస్సు?'

'.........'

యాంత్రికంగా ప్రశ్నలు. యాంత్రికంగానే చీటిమీద వ్రాతలు;

క్యూ అయిపోతోంది. చీటీల దొంతర తరిగిపోతోంది.

ఇక మిగిలింది ఒకే ఒక్క పేషంట్.

'పేరు?'

'కళ్లలో రోకళ్లతో పొడుస్తున్నట్టు...'

'వయస్సు?'

'బుర్రలో కర్రలుపెట్టి బాదుతున్నట్లు కరేల్‌మంటూ...'

కోపంగా తల ఎత్తింది డాక్టరు. 'అడిగిన దానికి సమాధానం చెప్పు. అనవసరపు వాగుడు వాగకు' కసురుకుంది.

'తలనొప్పితో చచ్చిపోతున్నాను డాక్టరమ్మా! నన్ను రక్షించు—'

ఎండిన వొరుగులా ఉందా ముసిల్ది. ఆ కంఠంలో అసహాయత.

ఆ కళ్లల్లో ఆవేదన. ఆమెనిండా బాధ...వ్యధ...

'తల పగిలిపోతూంది తల్లీ ... నన్ను రక్షించు.' ఆక్రోశించింది.

'వెళ్లి—గోడకేసి తలకొట్టుకో. అంత నొప్పి అతిత్వరగా పోతుంది...'

అసహనంగా అరచి — చీటీ వ్రాయకుండానే వెళ్లిపోయింది డాక్టరు.

త్రుళ్లిపడ్డాడు గోపాలం.

రాధ ముఖం — మునుపటిలా అందంగా కనిపించలేదు. అతి వికృతంగా కనిపించసాగింది.

'నేను మనిషిని రాధా, నాకు డబ్బు లేదు. అందుచేత నీకు నేనక్కరలేదు. నీకు హృదయమూ, మానవత్వమూ లేవు. కనుక నువ్వు నాకక్కరలేదు.'

రాధ కంటపడకుండా — దోషిలా దాక్కుంటూ పరుగెత్తాడు గోపాలం.

రాధా, గోపాలంల ప్రేమకథ విరిగి వెయ్యి ముక్కలైంది. ●

సిమీ బ్యూటీ బులెటిన్

లేక

అందానికి చిట్కాలు

అందాల తార సిమీ అందానికి, ఫాషన్‌కి తగిన చిట్కాలు తెలుపుతుంది. వ్యక్తిగతమయిన ప్రశ్నలకి సమాధానాలు ఇవ్వలేనని తెలుపటానికి ఆమె చింతిస్తోంది! సాధారణంగా అందరికీ ఉపయోగంగా ఉండే ప్రశ్నలనే 'SIMI'S BEAUTY BULLETIN, Post Bag No. 7117, BOMBAY 400014 కి పంపవచ్చు.

ప్ర : నా వెంట్రుకలు మరీ జిడ్డుగా వుండటంవల్ల ప్రతి అదుదు నిమిషాలకీ ఒకసారి స్నానం చెయ్యాలనిపిస్తుంది. ఈ సమస్యనుంచి తప్పించుకోడానికి ఏ దైనా మార్గం చూపించగలరా?

జ : విచారించవలసిన పనిలేదు. 'లైమ్ షాంపూ' బజార్లో దొరుకుతుంది. దాంతో మీ వెంట్రుకలని శుభ్రంగా కడగండి. నిమ్మరసం, మరికొన్ని విదేశీనూనెలతో తయారు చేసిన లైమ్‌షాంపూ తలజిడ్డును పోగొడుతుంది. రెండుసార్లు స్నానంచేస్తే చాలు మీ వెంట్రుకలు నిగనిగలాడుతూ వుంటాయి. స్నానంచేసిన తర్వాత 'ఆల్మండ్ హెయిర్ ఆయిల్' వాడుతూ వుండండి.

ప్ర : రోజూ పడుకోబోయే ముందు 'క్లీన్సింగ్ మిల్క్'తో నా ముఖాన్ని శుభ్రం చేసుకోమని చెప్పారు. నా చర్మం శుభ్రంగానే వుంటున్నది. కాని, బిరుసెక్కి పోతున్నది. ఇలా అందరికీ జరుగుతుందా!

జ : మీ చర్మం సహజంగానే బిరుసుగా వుంటే ఈ 'క్లీన్సింగ్ మిల్క్'వాడడంవల్ల మరింత బిరుసెక్కడం ఖాయం. ఒకపని చెయ్యండి. మీ శరీరానికి సరిపడే క్లీన్సింగ్ మిల్క్‌కూడా వుంది. దాన్ని వాడండి, అందులో క్రీమ్ ఎక్కువగా ఉండి, మీ శరీరాన్ని మృదువుగా వుంచుతుంది. నా కిది బాగా పనిచేసింది. మీరూ ప్రయత్నించండి,

ప్ర : మనస్సు — శరీరానికి సంబంధించి బ్యూటీషియన్స్ ఏమంటారు?

జ : మనస్సుకి శరీరానికి చాలా దగ్గర సంబంధం వుందంటారు. అస్తమానూ తలనొప్పితోగాని మరో జబ్బుతోగాని బాధ పడుతూవుండే స్త్రీ ఎప్పుడూ ఆరోగ్యంగా వుండదు. అందంగా అంతకన్నా వుండదు. మనస్సులో సమస్యలు పెట్టుకుని సతమతమయ్యే యువతికూడా అందంగా కనిపించదు. మరో విషయమేమిటీ అంటే— మానసికంగా ఎంత ఆనందంగా వున్నప్పటికీ శారీరకంగా లోపం వున్నప్పుడు చూడ్డానికి ఎవరూ అందంగా కనిపించరు.


ప్ర : చేతులు బాగా లావెక్కిపోయాయి. కష్టతరమైన వ్యాయామం చెయ్యమని చెప్పకండి. నాకు రోత.

జ : నేను సులభమైన పద్ధతి చెబుతాను. వురకండి, పిల్లలు దూకేట్టుగా. అలా దుమికినపుడు మోకాళ్లువంచి కుషన్ మీద పడిలేచినట్టుగా లేవండి. అలావేగంగా పదహారుసార్లు గెంతండి. కాళ్లు కొంచెం దూరంచేస్తూ వీలయినంత ఎత్తుగా ఎగరండి. ఇలా చెయ్యడంవల్ల సోమరిగా పడి వున్న మీ కండరాలన్నీ ఉత్సాహంగా పని చేస్తాయి. రక్తప్రసరణ బాగా వుంటుంది. సుమారు ఒక ముప్ఫయ్‌సార్లు ఇలా చేసి మరీ అంత బలవర్ధకంగాని ఆహారం తీసుకోండి. చాలు.



ప్ర : ఉపయోగించే సబ్బును బట్టి ముఖం కాళాకాంతులు ఆధారపడి వుంటాయా?

జ : తప్పకుండా. బోలెడన్ని రకాల సబ్బులున్నట్టే ఎన్నో రకాలయిన శరీరాలు కూడా వుంటాయి. మీ శరీరానికి తగిన సబ్బేమిటో మీరు తెలుసుకోగలగాలి. ఏరంగు సబ్బు ఉపయోగిస్తే మీ ముఖం వర్చస్సు ఇనుమడిస్తుందో తెలుసుకోవాలి. అన్ని సబ్బులు ఒకేలా వుండవు. సబ్బుల్లో కొవ్వు, మైనం, కొబ్బరినూనె, సువాసన ద్రవ్యాలు వివిధ పరిమాణాలో వుంటాయి. కొన్ని సబ్బులు మృదువైన శరీరానికి హాని కలిగిస్తాయి. అడ్వర్టయిజ్‌మెంట్లని నమ్మి మోసపోకండి. మీ చర్మం బిరుసుగా వున్నట్టయితే క్రీమ్ ఎక్కువగా వున్నవాటిని, ఆలివ్ ఆయిల్, లనోలిన్‌లాంటి పదార్థాలు ఎక్కువగా వున్నవాటిని ఉపయోగించండి. జిడుగావుండే శరీరాలకయితే బేబీ సబ్బు మాత్రమే చాలు. ●


అందమైన అతివకు
అపూర్వమైన క్రొత్త రకపు సబ్బు
LUX
LUX SUPREME
లక్స్ సుప్రీమ్
బ్యూటీ క్రీమ్ కూడ కలిగినది
లక్స్ సుప్రీమ్ మీ ముఖ చర్మము పట్టువలె మృదువుగా, అందముగా ఉండుటకు అపూర్వమైన క్రొత్త సబ్బు. దానిలో మాత్రమే బ్యూటీ క్రీమ్ కూడ ఉంది.
పుష్కలముగా వచ్చే దాని నురుగులో బ్యూటీ క్రీమ్ ఉన్న అనుభవము మీకు. నిజంగా కలుగుతుంది.
లక్స్ సుప్రీమ్‌యొక్క నురుగు మీ ముఖమునకు మెరుగులు పెడుతూంటే, దాని క్రొత్త సువాసనతో మీరు వెలుగొందుతారు.
లక్స్ సుప్రీమ్‌తో మీ అందమునకు రాణింపు చేకూర్చుకోండి.
బ్యూటీ క్రీమ్‌గల ఏకైక సబ్బు యిదే.
బెంగుళూరు, హైదరాబాదు, సికిందరాబాదులలో లభిస్తోంది.
హిందూస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి ఒక నాణ్యమైన తయారు.



'పల్లెటూరిబావ'లో లక్ష్మి, నాగేశ్వరరావు.

సినిమా

నాగేశ్వరరావుతో పోటీయా ?

'ఎవరో గిట్టనివాళ్లు చేసే యీ నాగేశ్వరరావుగారిని ఆరాధించే భక్తుడ్ని ఖ్యాతకల్పనలను మీరు నమ్మవద్దు. నేను. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, ఒక మంచి నటుడు అనిపించుకోవాలనే తలంపు తప్ప మరొకటిలేదు, నాకు' అన్నారు శోభన్‌బాబు, పరిశ్రమలో వ్యాపించిన పుకారును ఆయన దృష్టికి తెచ్చినప్పుడు.

'నటసామ్రాట్‌తోగాని, నటరత్నతోగాని ఎవరయినా పోటీపడగలరా? వారు చేపట్టిన క్లిష్టమైన పాత్రలను మరొకరు పోషించ గలరా?' అన్నారు, విజయ్ పాత్రధారి శోభన్.

'ఎప్పటికప్పుడు యింకా నేర్చుకోవాలి, చెయ్యవలసినది చాలావుంది అనుకునే నేను అక్కినేనిలాంటి తపస్సంపన్నుడితో పోటీపడ తానా? ఎందుకిలాంటి ప్రచారం జరుగుతుందో, ఎవరు యిలా చేస్తున్నారో అర్థం గాకుండా వుంది,' అన్నారు డాక్టర్ మూర్తి వేషధారి.

'నాగేశ్వరరావుగారు ధరించిన దేవదాసు, లైలామజ్ను, అనార్కలి. బాటసారి, విప్రనారాయణ, కాళిదాసు పాత్రలు నాకువచ్చినా నేను వెయ్యను. వేస్తే వాటిలో రాణించలేను. ఆ పాత్రలను ఆయన అద్వితీయంగా నటించారు. నేను ఎప్పుడూ ఆయన అభిమానినే,' అన్నారు 'జీవితం' కథానాయకుడు

అన్నీ నచ్చిన పాత్రలే

'ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో మీకు నచ్చినవెన్ని?' అని అడిగాను. 'అన్నీ నచ్చబట్టే, ఒప్పుకొన్నాను' అన్నారాయన

'ఇదా లోకం చిత్రంలో ద్విపాత్రాభినయం, పరివర్తనలో ఖయిదీబాబాయి, మైనర్ బాబు, డాక్టర్ బాబు, కోడెనాగు కథానాయకుడు యీ చిత్రాలన్నిటా నాకు వైవిధ్యమున్న పాత్రలు లభించాయి. ఒక పాత్రకు మరొకపాత్రకు ఎలాంటి వ్యత్యాసం వుందో నేను చెప్పడంకన్నా, ప్రేక్షకులు తీర్పునివ్వడం వుచితం అనుకొంటాను' అన్నారు జెమినీ స్టుడియో చిత్రనాయకుడు.

కలర్ చిత్రాలు !

'విజయా ప్రొడక్షన్స్, ఏ.వి.ఎమ్. ప్రొడక్షన్స్, సత్యచిత్ర, శ్రీధర్ ప్రొడక్షన్స్, శ్రీ బాలాజీ చిత్ర, సురేష్, కౌముదీ పిక్చర్స్, రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ వాళ్ళవి కలర్ చిత్రాలు.

మధూ మూవీస్, మమతా కంబైన్స్ వాళ్లకు చేస్తానని మాట యిచ్చాను. వచ్చే



'నిండుకుటుంబం'లో జమున

ఏడునించి ఆరు చిత్రాలు మాత్రమే చెయ్య గలిగాను' అని చెప్పారు డాక్టర్ బాబుగా నటిస్తున్న శోభన్‌బాబు.

మధూ మూవీస్ రెండవ చిత్రం

'కళ్యాణ మంటపం' నిర్మించి కాంచన అంతస్తును పెంచిన ఘనత యీ సంస్థకు చెందుతుంది. మొదటి ప్రయత్నంగా ఒక రిస్కీ కథను ఎన్నుకొని, విజయం సాధించిన సంస్థ యిది.

ఈ సంస్థ తలపెట్టిన ద్వితీయ చిత్రం జూన్ మధ్యలో ప్రారంభం కావచ్చు, అన్నారు దర్శకుడు వి. మధుసూదనరావు.

రెండవ దాంట్లోకూడా శోభన్‌బాబు, కాంచన ప్రధాన పాత్రలను పోషిస్తారు. రచయితకూడా మొదటిదాంట్లో పెద్దపేరు సార్జించిన బొల్లిముంతగారే.

నాగేశ్వరరావుతో

ఒక చిత్రం చెయ్యాలని వుంది, అన్నారు డి. బి. ఎన్. ప్రొడక్షన్స్ అధినేత నారాయణ. ఈ కోరిక యిప్పటిదా ?

'అమర సందేశంనుండి అన్న, దమ్ములు వరకు ప్రతిసారీ ఆయన్ను అడుగుతూనే వున్నాను. కానీ నా కోరిక యింకా నెరవేర లేదు' అని బాధపడ్డారు డి. బి. ఎన్.

'ఆయన ఒక మహానటుడు. ఏదయినా ఒక మంచి కథ చదివినప్పుడుగాని, తీయా లనుకున్నప్పుడుగాని నా గే శ్వ ర రావుగారు అయితే బాగుంటుంది అన్న అభిప్రాయం నా మటుకు నాకు ఏర్పడుతుంది. ఆయన నాకు చేసినా, చెయ్యకపోయినా అక్కినేని గారిని మహానటుడు అంటాను. అంటూనే వుంటాను. నా చిత్రాల్లో అందరూ పని చేశారు, ఆయన తప్ప. ఆయన నటనలో అందం కనిపిస్తుంది, ఆనందాన్ని కలిగి స్తుంది.

ఎప్పటికయినా, ఆయనతో నేను సినిమా తీయాలన్న తలంపు నెరవేరగలదన్న నమ్మకం నాకు వుంది. ఆయన ఎప్పుడు రెడీ అన్నా, నేను రెడీగానే వున్నాను' అన్నారు నాగేశ్వ రావును ఎంతగానో అభిమానించే డి. బి. నారాయణ.



'పసిహృదయాలు'లో కృష్ణ, చంద్రకళ.

అన్నపూర్ణా పిక్చర్స్

స్థాపించి యిప్పటికి యిరవై ఏండ్లు అయింది. ఈ సంస్థలో నవయుగ శ్రీనివాస రావు, పి. చంద్రశేఖరరావు, దుక్కిపాటి మధుసూదనరావు, అన్నపూర్ణా నాగేశ్వరరావు గార్లు ముఖ్య భాగస్వాములు.

ఈ సంస్థ నిర్మించిన మొదటి చిత్రం 'దొంగరాముడు'. ఇటీవల నిర్మించిన చిత్రం 'పూలరంగడు'. ఆరంభ చిత్రంనుండి ఆఖరు చిత్రం వరకు అన్నీ హిట్ చిత్రాలే. (ఒక్క 'జై జవాన్' తప్ప)



'డాక్టర్‌బాబు'లో జయలలిత, శోభన్‌బాబు.

నవయుగ విడుదల

పై సంస్థ ద్వారా వెలువడే ప్రతి చిత్రం నవయుగద్వానానే విడుదలవుతుంది.

ఆగస్టులో కొత్త చిత్రం ప్రారంభం అవుతుంది. 'పూలరంగడు', తర్వాత చాలా కాలానికి చిత్ర నిర్మాణం తలపెట్టింది అన్నపూర్ణా పిక్చర్స్. ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు.

ఉత్తమ చిత్రాలను నిర్మించడానికి అల వాటుపడ్డ ప్రాణం మధుసూదనరావుగారిది. ఇప్పుడుకూడా ఒక చక్కటి కుటుంబ కథను ఎన్నుకొన్నారు, మోదుకూరి జాన్సన్ పేత మాటలను రాయిస్తున్నారు. నాగేశ్వరరావు నాయకుడు. ఒక ముఖ్యపాత్రను లక్ష్మి పోషిస్తుంది.

సినిమా

అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్

స్థాపించి అయిదేండ్లు కావస్తుంది, ఈ సంస్థలో దుక్కిపాటి మధుసూదనరావు, ఆయన అల్లుళ్లు గంగాధరరావు, ప్రసాద్ భాగస్వాములు. వీరు నిర్మించిన మొదటి చిత్రం 'అమాయకురాలు.' రెండవ చిత్రం 'విచిత్ర బంధం.' ఈ సంస్థ నిర్మించే ప్రతి చిత్రం అన్నపూర్ణా ఫిలింస్ ద్వారా విడుదలవుతుంది

సందేహం తీరిందా ?

'విచిత్ర బంధం అన్నపూర్ణాకి యిచ్చారే, అన్నపూర్ణా పిక్చర్స్ తీయబోతున్న చిత్రం నవయుగకి యిస్తున్నారే, మీకూ, అన్న పూర్ణా పంపిణీదారులకు మనస్పర్థలా?' అని రోజుకు రెండు, మూడు ఉత్తరాలు వస్తు న్నాయి, దుక్కిపాటి మధుసూదనరావుగారికి.

అన్నపూర్ణా పిక్చర్స్ తీసే చిత్రం నవయుగద్వారా, అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ నిర్మించే చిత్రం అన్నపూర్ణాద్వారా విడుదల అవుతాయి. ఈ సమాధానంతో పాఠకుల సందేహం తీరిందనుకోవచ్చు.

దాసరికొచ్చిన కొత్త చిత్రం

'తాత–మనవడు' చిత్రం విజయం దాస రికే చెందుతుంది అంటున్నారు చిత్రాన్ని పదేపదే చూచిన ప్రేక్షకులు.

అలాంటి పేరు రావడానికి దోహదం చేసిన మంచి మనిషి రాఘవ అంటారు నారాయణరావు.

పరిశ్రమలో జరిగే అన్ని సంగతులు మీకు తెలియవుగా. 'తాత–మనవడు' తర్వాత దాసరిని ఎందరో అడిగారు, డైరెక్టు చేసి పెట్టమని.

ఆయన ఏమన్నారో తెలుసా? 'రాఘవ గారి రెండవచిత్రం 'సంసారం — సాగరం' పూర్తిచెయ్యనిదే మరొకరికి చెయ్యడానికి నా మనస్సు ఒప్పదు' అని చెప్పి పంపేరు

లక్ష్మీనరసింహా ప్రొడక్షన్స్ !

ఈ సంస్థకు దర్శకత్వం నిర్వహించ డానికి దాసరి అంగీకరించారు, పైన పేర్కొన్న నిబంధన ప్రకారంగా. ఈసంస ను మావిళ్లయ్య, తారకరాం స్థాపించారు. కథ. మాటలు, సినిమా అనుకరణభారాన్ని కూడా నారాయణరావుపై వుంచారు. రమేష్నాయు డికి అడ్వాన్సు ఇచ్చారు, సంగీతం చేసి పెట్టమని.

"మావిళ్లయ్య—తారకరాం"

వీళ్లు పంపిణీదారులుగా వుంటున్నారు. శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదా వరీజిల్లాలకు సినిమాలను కొని, ఆడిస్తూ ఉన్నారు.

మదరాసులో సలీల్ చవుదరి

'మధుమతి, ఆనంద్' చిత్రాలు అంత ప్రజాదరణ పొందడానికి సంగీతం చాలావరకు




'కాముడే దేముడు'లో చలం వాణిశ్రీ.

బాధ్యత వహించింది అంటే మీరూ ఒప్పుకుంటారనుకుంటా. ఆ చిత్రాలకు సంగీత సారథ్యం వహించిన సలీల్ చవుదరినీ గతవారం మదరాసు జెమినీ థియేటర్లో చూశాను.

ఏదేని హింది చిత్రం రికార్డింగు ఏమో అనుకుంటూ లోపలికి వెళ్లాను. రామినీడు, సుశీల, మోహనదాసు, ఆరుద్ర, అంకిరెడ్డి గార్లను చూచాను. అప్పుడు తెలిసింది తెలుగు రికార్డింగు అని·

ఛైర్‌మెన్ చలమయ్యా

ఈ పేరుగొన్న చిత్రాన్ని నిర్మల ఎంటర్ ప్రైసెస్ నిర్మిస్తున్నారు· టైటిల్ పాత్రను చలం పోషించ, యితర భూమికలను రాజబాబు, విజయలలిత, రమాప్రభ, వై. విజయ ధరిస్తున్నారు. ఈ చిత్రంలో పాతవారితోబాటు, కొత్తవాళ్ల కొందరిని పరిచయం చెయ్యదలచినట్టు, యీ చిత్ర నిర్మాత, దర్శకుడు అయిన రామినీడు చెప్పారు.



'గుండెలు తీసిన మొనగాడు'లో హలం, చంద్రమోహన్.

ఆరుద్ర కలం సుశీల గానం

మొదటి పాటను ఆరుద్ర కలం అందంగా వ్రాసింది. సుశీల కమ్మగా పాడింది. సలీల్ చవుదరి 'భేష్, భేష్' అన్నారు ఆరుద్ర, సుశీలగార్లను. పాఠకులకు ఆపాట పల్లవిని మాత్రం వ్రాస్తున్నాను.

'హలో, ఛైర్‌మెన్‌గారు
అందుకోండి నా జోహారు' అన్న ఈ

పాటను విజయలలితపై చిత్రీకరించబోతున్నట్టు, కో–డైరెక్టర్ ఇ. మోహన్‌దాసు చెప్పారు.

శ్రీ పద్మనాభరెడ్డి సమర్పించు 'ఛైర్‌మెన్ చలమయ్యా' చిత్రానికి మళ్లీ యిరానీ ఛాయను, అంకిరెడ్డి కూర్పును, కుదరవల్లి కళను, రాజశ్రీ రచన్ను చేపట్టారు.

రాముడే దేముడు

'మానవ జీవితం ఒక నౌకాయానం లాంటిది. ఆశయాలు, ఆదర్శాలు రేవులైతే, అనుబంధాలూ, అనురాగాలూ ఋతుపవనాలు. అన్ని నౌకలూ రేవు చేరాలనే బయల్దేరుతాయికాని, ఎదురుగాలుల వొత్తిడికి తట్టుకోలేక ఎన్నో నౌకలు మధ్యలోనే మునిగిపోతాయి· తెరచాప చిరిగిపోయినా, చుక్కాని విరిగిపోయినా, కొన్ని మాత్రం గమ్యస్థానం చేరుకొనే తీరుతాయి. అప్పుడే ఆ ప్రయాణానికి ఒక అర్థం, ఆ జీవితానికి ఒక పరమార్థం.' ఈ అంశాన్ని గొన్న కథయే 'రాముడే దేముడు' చలన చిత్రం. కథను పత్రికా రచయిత జి. వి. జి. వ్రాయ, మాటలను రాజశ్రీ రచించారు. పి. ఏకామ్రేశ్వరరావు నిర్మించిన యీ చిత్రానికి బి. వి. ప్రసాద్ దర్శకుడు. ఎం. కె. రాధా నిర్వహణలో సింగారించుకొన్న యీ చిత్రంలో చలం, జగ్గయ్య, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ విజయలలిత ముఖ్యపాత్రధారులు. లక్ష్మి విడుదల.

పల్లెటూరి బావగా అక్కినేని నాగేశ్వరరావు

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్సు వారు నిర్మిస్తున్న పదమూడవ చిత్రం 'పల్లెటూరి

బావ'లో టైటిల్ రోల్‌ను ధరిస్తున్నారు నటసామ్రాట్ నాగేశ్వరరావు. సభ్యతకు, సంస్కారానికి విలువ నివ్వడం తన ముఖ్య లక్ష్యంగా భావించిన ఆదర్శవంతమైన పాత్ర అక్కినేనిది.

పల్లెవాసుల వుదాత్తమైన భావాలు — హృదయ విశాలత, వున్నతమైన ఆదర్శాలకు, పట్టణవాసపు కృత్రిమ వాతావరణానికి—సంస్కారానికి—అభ్యుదయం పేరిట జరుగుతున్న అత్యాచారాలకు మధ్య జరిగే సంఘర్షణే 'పల్లెటూరి బావ'.

ప్రముఖ దర్శకులు ప్రత్యగాత్మ నిర్దేశకత్వంలో తుదిమెరుగులు దిద్దుకొంటోంది ఈ చిత్రం. ఏ. వి. సుబ్బారావు నిర్మించిన ఈ చిత్రానికి భమిడిపాటి సంభాషణల కర్తగాను, చలపతిరావు సంగీత దర్శకుడిగానూ, సెల్వరాజ్ ఛాయాగ్రాహకుడిగానూ, జి. వి. సుబ్బారావు కళా దర్శకుడిగానూ, కృష్ణస్వామి కూర్పు కర్తగానూ, వ్యవహరించారు. నవయుగ విడుదల.

నాగభూషణం, రమణారెడ్డి, లక్ష్మి, సుధ, రమాప్రభ, ప్రధాన భూమికలను ధరిస్తున్నారు.

నీలగిరి కొండల్లో శోభన్, జయలలిత

రవీంద్ర ఆర్ట్సు పిక్చర్సు పతాకం క్రింద తమ్మారెడ్డి కృష్ణమూర్తి నిర్మిస్తున్న 'డాక్టర్‌బాబు' దాదాపు పూర్తి అయింది.

చదివిన చదువు, సంపాదించిన విజ్ఞానం పదిమందికీ ఉపకరించాలని ఉబలాటపడే ఉత్తమవ్యక్తికి—ఆమార్గంలో ఎన్నో కష్టాలను, నష్టాలకు ఎదుర్కోవడం తప్పనిసరి అని ప్రబోధించే చిత్రమే 'డాక్టర్‌బాబు.'

అందమైన నీలగిరికొండల్లో కన్నుల పండువైన ప్రకృతిసౌందర్యాన్ని, దొడ్డబెట్ట లోని అందాలను, గిండి ఫారెస్టు లోని సుందరదృశ్యాలను క్లయిమాక్సుగాను ఎంతో చక్కగా చిత్రీకరించారు. శోభన్‌బాబు, జయలలిత ఈ అవుడోర్‌లో పాల్గొన్నారు. అయిదు పాటలు అవుట్‌డోర్‌లోను, ఇండోర్లో రంగారావుమీద చిత్రీకరించటం జరిగింది. మొత్తం పాటలు చిత్రీకరించటం జరిగింది.

టి. లెనిన్‌బాబు దర్శకత్వంలో—సర్వాంగ సుందరంగా తయారౌతున్న ఈ చిత్రంలో విజయలలిత, జి. వరలక్ష్మి, లీలారాణి, యస్. వి. రంగారావు, గుమ్మడి, రాజబాబు, రాజనాల, అల్లు రామలింగయ్య, ముక్కామల ముఖ్యపాత్రధారులు.

మోదుకూరి జాన్సన్ మాటలను, చలపతిరావు సంగీతాన్ని, కన్నప్ప కెమెరాను, కూర్పును సంజీవి, కళను సూరన్న నిర్వహించిన ఈ చిత్రం లక్ష్మి ఫిలింస్ విడుదల.

డాక్టరుగా కృష్ణ నర్సుగా జమున

'గుడ్, ఆ చిరునవ్వు నర్సులకు చాలా అవసరం. రోగులకు సగం మందు అదే శారదా !' అన్నాడు డాక్టర్ వేణు.

'మీలాంటి మంచివారిదగ్గర పనిచేసే అవకాశం కలిగినందుకు నాకెంతో ఆనందంగా వుంది' అన్నది నర్స్.

మంచి మనసులమధ్య వుండే బాంధవ్యాన్ని చవి చూపి, మంచివాళ్ల సాన్నిహిత్యంలో ఈ



'జగమేమాయ'లో సునందిని, మురళీమోహన్.

ప్రపంచాన్నే మరచిపోగలమనీ, మంచితనానికి మించిన పెన్నిధి వేరే లేదని, చాటిచెప్పే ఈ చక్కటి సన్నివేశం నవచిత్ర ప్రొడక్షన్సువారి 'పసిహృదయాలు' లోనిది.

యమ్. మల్లికార్జునరావు దర్శకత్వంలో తయారౌతున్న ఈ చిత్రం నవయుగద్వారా విడుదల.


డాక్టరుగా కృష్ణ, నర్సుగా జమున నటించిన ఈ చిత్రంలో రామకృష్ణ, చంద్రకళ, సునందిని కె. వి. చలం, విజయభాను ముఖ్యపాత్రధారులు. సంభాషణలు రాజశ్రీ, సంగీతాన్ని జి. కె. వెంకటేష్ సమకూర్చారు

కనిపించే దేవుడు

మారుతున్న కాలంతోపాటు మనుషులు, మమతలుకూడా మారిపోతున్నాయి. అన్నం తిన్న ఇంటికే కన్నం వెయ్యడానికి సిద్ధపడుతున్న ఈ రోజుల్లో, ఒక్కపూట అన్నంపెట్టి ఆదుకొన్న ఆ యింటికోసం తన సర్వస్వాన్ని త్యాగంచేసిన త్యాగమూర్తి గాధే ఎస్. ఎస్. భట్ శ్రీ ఉమా ప్రొడక్షన్సుక్రింద తాతినేని రామారావు దర్శకత్వంలో తయారవుతున్న సాంఘిక చిత్రం 'కనిపించే దేముడు.'

పదుగురికి వెలుగునిచ్చేందుకు తను ఆత్మార్పణ చేసుకునే దివ్వెలాగా, తన సర్వస్వాన్ని అర్పించి విధివంచితులైన ఒక కుటుంబాన్ని కాపాడటానికి తాపత్రయపడ్డ అపూర్వమైన పాత్రను నటసామ్రాట్ నాగేశ్వరరావు తమ అపురూపమైన నటనలో అద్భుతంగా పోషించారు. దేవదాసు తదుపరి మళ్లీ అంత గొప్పగా నటించి ప్రేక్షకుల హృదయాలను కదలించారని రషస్ చూసినవారు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్— ఆఖరివారంతో చిత్రం దాదాపు పూర్తి అయినట్లే.

'జీవనతరంగాలు' విజేత తాతినేని రామారావుకు ఈ చిత్రం రెండవ విజయం కావడం తథ్యం. ఆచార్య ఆత్రేయ మాటలను, కె. వి. మహదేవన్ సంగీతాన్ని వెంకటరత్నం ఛాయాగ్రహణాన్ని, కృష్ణస్వామి కూర్పును, జి. వి. సుబ్బారావు కళను, నిర్వహించిన ఈ చిత్రం అన్నపూర్ణా ఫిలింస్వ్వారా విడుదలౌతుంది.




దేవీశంకర్‌పిక్చర్స్ మొదటి చిత్రంలో శ్రీధర్, శారద.

ద్వేషంలో దానవత్వంవుంది ప్రేమలో దైవత్వం వుంది

అని, ప్రేమని ప్రేమతో జయించటం గొప్ప కాదు. కాని అనుకోకుండా తను చేసిన ఒక పొరపాటుకు తనమీద ఏర్పడ్డ ద్వేషాన్ని అష్టకష్టాలుపడి—ఎంతో ప్రయత్నంమీద జయించడంలోనే వుంది మానవత్వం, ఎన్ని అవమానాలు, అవాంతరాలు ఎదురైనా తన ధ్యేయాన్ని వదలిపెట్టక—తనను ద్వేషించే వారి హృదయాలలో మంచిద్వారా పరివర్తన తీసుకురావడమే గొప్పతనం అని నిరూపించిన ఒక ఆదర్శవ్యక్తి గాధే శ్రీ, బాలాజీ చిత్రవారు నిర్మిస్తున్న 'పరివర్తన.'

హిందీ డాన్సరు లీనా నృత్యం—

ఈస్టమన్ కలర్‌లో నిర్మింపబడుతున్న ఈ చిత్రంలో హిందీ డ్యాన్సరు 'లీనా' నృత్యం వో ప్రత్యేకత. అనుకోకుండా జరిగిన పొరబాటుకు అడుగడుగునా అవమానాలకు గురి అవుతూ, అనుక్షణం మానసిక క్షోభకు గురి అయిన వో వ్యక్తి పాత్రను శోభన్ బాబు పోషిస్తున్నాను. శోభన్‌బాబుకు జంటగా వాణిశ్రీ నటిస్తున్న ఈ చిత్రంలో



'మమత'లో కృష్ణ, జమున.



నటి మంజుల.
(చిత్రకారుడు: శ్రీ కొండూరు నాగేశ్వరరావు)

జగ్గయ్య, గుమ్మడి, రామకృష్ణ, పద్మనాభం, సత్యన్నారాయణ, చంద్రమోహన్, సాక్షి రంగారావు, జానకి (షావుకారు); రమాప్రభ, సుమ, నిర్మల ముఖ్యతారాగణం. రాజబాబుది వో వెరైటీ భూమిక.

బొల్లిముంత రచన్ను, మహదేవన్ సంగీతాన్ని, సుందరబాబు ఛాయను, తోట కళను, ఆదుర్తి హరనాథ్ కూర్పును సమకూర్చిన ఈ చిత్రానికి నిర్వహణ, దర్శకత్వం టి. కృష్ణ. టి. బాబుల్‌నాథ్ నిర్మాత అయితే జె. లక్ష్మణరావు, తమ్మిన సీతారామాంజనేయులు సహ నిర్మాతలు. లక్ష్మీఫిలింస్ విడుదల.

గాంధీ పుట్టిన దేశం

పసిపిల్లవాడి మొదలు పండు ముసలి వాడివరకు నచ్చి మెచ్చిన చిత్రం 'పండంటి కాపురం' కథకుడు డా. ప్రభాకర్‌రెడ్డి జయప్రద ఆర్ట్సు పిక్చర్సు క్రింద నిర్మిస్తున్న సంచలనాత్మక చిత్రమే. 'గాంధీ పుట్టిన దేశం.'

ఛాయాగ్రాహకులు మినహా 'పండంటి కాపురం' చిత్రానికి పనిచేసిన సాంకేతిక వర్గమే ఈ చిత్రానికి పనిచేయడం విశేషం ఈ చిత్రంలో.

గత నెలారంభంలో విజయవాడ ప్రాంతంలో అవుట్‌డోర్ సన్నివేశాల చిత్రీకరణతో ఈ చిత్రం షూటింగ్ ఆరంభమైంది. ఏప్రిల్ 29 నుండి మే 5 వరకు విక్రమ్ స్టుడియోలో ఇన్‌డోర్ షూటింగ్ జరిపారు. కె. వి. ప్రమీల, లత, జయంతి, త్యాగరాజు, ఆనంద మోహన్, రమణారెడ్డి మొదలగువారు పాల్గొన్న కొన్ని ప్రధాన సన్నివేశాలను సెల్యులాయిడ్‌పై మలిచారు.


వాహినీలో మే 10 నుండి నెలాఖరు వరకు షూటింగ్ జరిగింది. డా. ప్రభాకరరెడ్డి, షావుకారు జానకి, లత, జయంతి, ప్రమీల, కృష్ణంరాజు, నూతననటి లత, రావుగోపాలరావు, త్యాగరాజు, ఆనంద మోహన్, రమాప్రభ, నిర్మల, పద్మనాభం, మున్నగువారు పాల్గొన్న కోర్టు సెట్‌పై చిత్రీకరణ జరిగింది. పెద్ద సంఖ్యలో జూనియర్ ఆర్టిసులు పాల్గొనడం మరో విశేషం.

రికార్డింగ్ అయిన 4 పాటల్లో ఒక పాట చిత్రీకరణ జరగగా, ఇప్పటికి 10 రీళ్ల చిత్రం అయింది. జూన్‌లో జరిగే షెడ్యూలుతో చిత్రం పూర్తి అవుతుంది.

ముగ్గురు హీరోయిన్లతో అనేక మలుపులు తిరిగే, సరికొత్త కథా సంవిధానంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకొని సామాన్యుడి పెక్కు సమస్యలతో పండిత పామరుల్లో సంచలనాన్ని రేకెత్తించిన ఈ చిత్రంలో జయంతి, డా. ప్రభాకరరెడ్డి, లత, కృష్ణంరాజు, ప్రమీల, కె. వి. నాగేశ్వరరావు, త్యాగరాజు ప్రప్రధాన తారాగణం.

మద్దిపట్ల సూరి మాటలను, కోదండపాణి సంగీతాన్ని, ఎ. ఆర్. కె. మూర్తి ఛాయను, అనంతరావ్ కళను, మార్తాండ్ కూర్పును నిర్వహించిన చిత్రానికి పూర్ణా పంపిణీ చేస్తుంది.

—శ్రీనివాస్



'నేరము—శిక్ష'లో భారతి, కృష్ణ

ఒక వారం విపరీతం — ఫాలాక్షుడు

అణుహృదయం

అణుశక్తితో పని చేసే హృదయాన్ని అమెరికా కనుగొన్నదట. ఈ హృదయంతో జంతువులమీద చేసిన ప్రయోగాలు జయప్రదమయ్యాయట. ఈ హృదయం మరికాస్త పరిశీలన మీదట ఈదశాబ్దంలోనే మానవులకు అమర్చడం సుసాధ్యమనీ, వీటివల్ల ఏటికి లక్షమందికి ఆయుర్దాయాలు పొడిగించవచ్చనీ శాస్త్రజ్ఞులు అన్నారట.

పంచాయితీఅధికారి అమానుషచర్య!

కున్నత్తూరుకు చెందిన కురుచ్చి అనే గ్రామంలో 30 ఏళ్ళ రాజా అనే అతనికి, ఆవూరు పంచాయితీ అధికారి సుబ్రమణ్యానికి ఎన్నడూ పడేదికాదట. రాజా తన పొలంలోనే వో చిన్నయిల్లు కట్టుకుని వున్నాడట. ఒకనాటి రాత్రి సుబ్రమణ్యం కొందరి సహాయం తీసుకుని, ట్రాక్టరు మీద ఆరాజా యింటికి వెళ్ళి తలుపుతట్టాడట. రాజా వచ్చితలుపు తీయగానే, సిద్ధంగా పెట్టుకున్న తుపాకీతోఅతన్ని కాల్చి చంపేశాడటా సుబ్రమణ్యం. ఈతుపాకీ శబ్దానికి ఆతని భార్య, తమ్ముడూ పరుగునవస్తే, వారిద్దరినీ కర్రలతో బాది, వారికళ్లెదురుగానేచనిపోయినరాజా శరీరాన్ని కత్తితో తూట్లు తూట్లుగా పొడిచారట. అనక ఆశవాన్ని ట్రాక్టరు మీద వేసుకు పోతుంటే అడ్డొచ్చిన పక్కింటివాళ్ళబ్బాయి, 17 ఏళ్ల ముత్తుస్వామిని కంకర్రాళ్ళతోకొట్టి, చివరికారాజా శవాన్ని ఒక తోటలోపెట్టి తగలేశారట. తెల్లారేలోగా శవం సొంతం కాలనందున, ఆకాలని శరీర భాగాలను మరొకరితోటలోపాతిపెట్టి, పారిపోయారట. ఈసందర్భంగా పోలీసు ఆవూరి పంచాయితీ అధికారితోసహా 15 మంది కోసం వెతుకు తోందట.

వ్యాపారిని మోసంచేసి నగలతో పరారైన పూజారి

బెంగుళూరు సుబ్రమణ్యపురంలోని వో కోవెలకు మల్లేశ్వరంలోని వో వ్యాపారి రోజూ వెళ్ళేవాడట. ఈ వ్యాపారివాటం చూసి, "మీయింట్లోకష్టాల్ని తీరాలంటే యింట్లోవున్న నగలన్నీ పట్రండి. ఒక్కసారి స్వామికి అలంకరించి యిస్తాను.దాంతో అన్నికష్టాలూ పోతాయి' అని ఆదేవాలయంపూజారి అన్నాడట. ఈ మాటలునమ్మి ఆపూజారికి తన యింట్లో నగలన్నీ తెచ్చియిచ్చాడట వ్యాపారి.ఇంకేముంది, వ్యాపారి నగలతో పూజారిపరారయ్యాడుట— నాచురల్!

గోధుమలతో ఇనుపబీడు

పంజాబునుంచి బీహారుకు పంపిన గోధుమలలో ఇనుప బీడుందట. వచ్చిన 13 వేల 5 వందలబస్తాలలోనూ యినుపబీడ ఉందని తేలడం వల్ల వాటిని చౌక దుకాణాలకు పంపడం ఆపి, అయస్కాంతం పద్ధతి వున్న మిల్లుల కుపంపారట.

తమిళనాడులో పోలీసు బలగం

తమిళనాడులో నాలుగుకోట్ల జనాభావున్నదట. 20 వేల గ్రామాలున్నాయట. 25 వేల పోలీసు దళం వుందట. ఈ విషయాలు వో ఎన్నికలప్రచారంలో తెలియ జేస్తూ పార్టీ (డి. యమ్. కే. అనా!) హింసా కృత్యాలకు తలపడితే పోలీసుబలగం ఏం చెయ్యగలదు అవటాని అన్నారట—కొన్నిప్రశ్నలకు జవాబులివ్వలేం సార్.

అగ్నిప్రమాదంలో లక్షన్నర నష్టం

బాపట్లలో 8వ తేదీ మధ్యాహ్నం ఒకట్యుటోరియల్ కాలేజీలో జరిగిన అగ్ని ప్రమాదఫలితంగా చుట్టపక్కల 75 ఇళ్లు దగ్ధమైపోయాయట. సుమారు లక్షా యాభై వేల రూపాయలు ఆస్తి నాశనమయ్యిందట.

బస్సులో య్యపడి అయిదుగురి మరణం

సిమ్లాకు నూరు కిలో మీటర్ల దూరంలో కింగల్ అనే చోట హిమాచల ప్రదేశ్ ప్రభుత్వపు బస్సు వో గోతిలోకి దొర్లిపోయిన సందర్భంగా బస్సులో వున్న 30 మందిలో అయిదుగురు చనిపోయారట. వో ఆరుగురికి తీవ్రమైనగాయాలు తగిలాయట.

చౌకడిపోబియ్యంలో ఇనుపముక్కలు


బొంబాయిలోని చౌక డిపోలలో అమ్మిన బియ్యంలో చిన్నసైజు, బుల్లి సైజుయినుపముక్కలు వున్నాయట. ఈ విషయం బుజువయినందువల్ల అట్టి బియ్యాన్ని అమ్మడం ఆపేయవలసిందని ప్రభుత్వం ఆజ్ఞ జారీ చేసిందట.

ఇంట్లో దూరిన లారీ

కడపలో 7వ తేదీ రాత్రి వో లారీ తన గతితప్పి రోడ్డుమ త్యజించి, యింట్లోకి దూచుకుపోయిందట. తత్ఫలితంగా ఆయింట్లో 70 ఏళ్ళవృద్ధురాలు, 50 ఏళ్ళాయన వో సంవత్సరం వయస్సున్న పసిపిల్లాడూ నలిగి చనిపోయారట.

కారుప్రమాదంలో ముగ్గురిమరణం

పూనా నుంచి హైదరాబాదు విమానంలో వచ్చిన పార్కే, దేశ్‌పాండే, కరగేకరె అనే వో ముగ్గురు వ్యక్తులు హైదరాబాదునుండి విజయవాడకారులో వెళ్తుండగా హైదరాబాదుకు 60కిలో మీటర్ల దూరంలోని సెట్యాల్ వద్ద వోవంతెనను ఢీకొన్నదట. ఆదెబ్బకు వారు ముగ్గురూ మరణించారట— డ్రైవరు, క్లీనరులకు స్వల్ప గాయాలు అయ్యాయట.



దేవునిపై ఆంధ్రోద్యమం ప్రభావం

తిరుపతి వెంకటరమణునికి గత ఏప్రియల్ నెలలో 37,69,706 రూపాయలు ఆదాయమైతే, యీ ఏడు ఏప్రియలుకు 41,71,916 రూపాయలట. ప్రత్యేకాంధ్రోద్యమ ప్రభావం చివరికి దేవునికి కూడా. తగిలిందామధ్య.

ఆటో రిక్షా లారీ ఢీ—ముగ్గురి మరణం

విజయవాడలో బందరు రోడ్డుమీద 3 వ తేదీన ఒక ఆటో రిక్షా, వో లారీ ముఖాముఖి బలాబలాలు చూసుకోవడం వల్ల ముగ్గురు మరణించారట. వారి పేరులు, తదితర వివరాలూ మాత్రం తెలియ లేదు.

విషపూరితమైన నదీజలం

కోరారా గ్రామంలో మంచినీటి ఎద్దడి ఏర్పడినందువల్ల ఆ గ్రామవాసులు తపతినదిలోని నీళ్లు తెచ్చుకు త్రాగారట. ఆ నీరు కలుషితమైనదయ్యుండడం వల్ల ఆ నీరు త్రాగిన వారిలో ఏడుగురు చనిపోయారట. 36 మందిని విషమ పరిస్థితిలో ఆసుపత్రిలో చేర్చారట.

విదేశీవస్తువుల పట్టివేత

ఉత్తర బొంబాయికి చెందిన చెంబూర్‌నక అనేచోట అవినీతి నిరోధకశాఖవారు 14.7 లక్షల విలువచేసే జపాను వస్త్రాలు, తదితర వస్తువులు పట్టి వేశారట. ఆనకేం చేశారు వాటిని చెప్మా.

బావిలో పడి బాలిక మరణం


మద్రాసుకు చెందిన 16 ఏళ్ళ చిన్నకుళందై అనే కుంటి పిల్ల నెండుంకుళం అనే వూరిలో జరుగబోతున్న వో వుత్సవాన్ని చూడడానికి తల్లితో వెళ్ళి, ఆ వుత్సవాన్ని చూడ్డానికి పెంతదారిలోంచి చకచకా నడుస్తూ కాలుజారి, నూతిలో పడి, సహాయం దొరికేలోగానే చనిపోయిందట. ●

అవీ...ఇవీ:

13—5—73 ఆదివారం స్థానిక లయన్సు క్లబ్ (బందరు) జూబిలీ హాల్లో సమితి అధ్వర్యమున సాహిత్య సభ ఏర్పాటు చేయ బడినది. సభకు డాక్టరు యం. ఎ. పద్మనాభరావు అధ్యక్షత వహించిరి. ప్రఖ్యాత నవలా రచయిత శ్రీ హరికిషన్ నేటి నవలా సాహిత్యము తీరుతెన్నులు గురించి ఉపన్యసించిరి. శ్రీ హరికిషన్ ఆధునిక నవలా రచనను మూడు భాగములుగ విభజించి, అందులోని రచనా వైశిష్ట్యాల్ని సోదాహరణంగా పేర్కొన్నారు. తర్వాత 'సాహిత్యరత్న' శ్రీ కాళ్ళేపల్లి యోగేశ్వరరావు సాహిత్యము చిత్రకళ అను అంశముపై చారిత్రక విషయాల్ని ఉదహరిస్తూ సాహిత్యానికి చిత్రకళకూ వున్న అవినాభావ సంబంధాన్ని విశదీకరించిరి. సభా ప్రారంభమున సమితి అధ్యక్షులు శ్రీ జె. యస్. మూర్తి (విహారి) స్వాగతం పలికిరి. కార్యదర్శి శ్రీ పి. తిక్కన సోమయాజి వందన సమర్పణతో సభ ముగిసింది

—పేమూరు రామలింగయ్య

సీరియల్



జరిగిన కథ

నిలయ చెల్లెలు లోక. రోగంతో తీసుకుంటున్న ముసలితండ్రి ఒకడున్నాడు. సంసారం బాధ్యత అంతా నిలయదే. ఆమె ఒక ఆఫీసులో పని చేస్తున్నది. ఆ ఆఫీసులోనే పని చేస్తున్న భాస్కరరావు ఆమెని పెళ్ళాడతానన్నాడు. కాని, కుటుంబ పరిస్థితి దృష్ట్యా నిలయ అంగీకరించలేదు. లోకకి సినిమాలంటే పిచ్చి. ఆమెకి తగిన జోడీ మోహన్. సినిమాల్లో చేర్పిస్తానని లోకని మద్రాసు తీసుకు వచ్చాడు మోహన్. నిలయా మధూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు.

4

'ఏరా ఇన్నాళ్ళూ ఏఏదేశాలు తిరిగావు? ఏమిటి కథ? చేస్తూ చేస్తూ ఉన్న ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఊళ్ళు పట్టి పోవల్సిన అవసరం ఏ వొచ్చిందిరా నీకు? ఇప్పటికి ఇన్నాళ్లకి ఇల్లు జ్ఞాపకం వొచ్చిందా?' తండ్రి గద్దింపుకి బిక్క మొహం వేశాడు మోహన్.

'మీరుండండి. గుమ్మంలోనే వాడినలా బెదరగొట్టేస్తే ఎలా? నెమ్మది మీద అదే తెలుస్తుందిగా!' కాంతమ్మ కొడుకుని వెనకేసు కొచ్చింది. కొడుకింటికి రాగానే ఏం తుఫాను మొదలవుతుందోనని ఆవిడ భయపడుతూనే ఉంది.

'నడవరావడు. ఇప్పటికైనా పిచ్చి పిచ్చి తిరుగుళ్లు మాని బుద్ధిగా ఉండు. హైదరాబాద్‌లో నో మంచి ఉద్యోగం రెడీగా ఉంది. రికమెండేషన్ల మీద అది తప్పకుండా నీ కొచ్చేట్టు చూస్తాను. బుద్ధిగా ఉద్యోగం చేసుకో.'

గంగిరెద్దులా తల ఊపి లోపలికి నడిచాడు. మోహన్. రాజారావుగారి కోపం కాస్త శాంతించింది. 'కొడుకింటి కొచ్చేశాడు. అంతేచాలు. రెట్టించి మరీ మరీ ఎక్కడెక్కడ తిరిగావు ఏమిటి సంగతని అడగకపోడమే మంచిది. అదేపనిగా అడిగితే మళ్ళీ వాడి బుద్ధెలా మారుతుందో ఏమో? ఉన్న దొక్కడే కొడుకయ్యె. త్వరగా ఆ ఉద్యోగమేదో హైదరాబాద్‌లో వేయించేస్తే మంచిది. ఇంతలో మంచి సంబంధం ఏదన్నా చూడవచ్చు.' ఈ ఆలోచనతోనే ఆయన కొడుకుని మరి ప్రశ్నించలేదు.

తను అనుకున్నంత కోపం తండ్రి చూపించకపోవడం ఆశ్చర్యంగానే ఉంది మోహన్‌కి. ఆ తర్వాత మరి కొద్దిరోజుల్లోనే, ఉద్యోగంలో జాయిన్ అయేందుకు హైదరాబాద్ వెళ్ళి పోయాడు.

* * *

'ఎక్కడికి వెళ్ళాలి? ఎవరితో తన బాధ చెప్పుకోవాలి? ఎవరి కోసం తను బ్రతకాలింక?' 'నీ పాపకోసం... నీ పుట్టబోయే బిడ్డ కోసం...' మనసు మెల్లిగా హెచ్చరించింది లోకని.

'ఈ సంఘం తనని బ్రతకనిస్తుందా? తన జీవితం ఎలా గడుస్తుంది? తన బిడ్డ భవిష్యత్తేమిటి?' సమస్యలతో తల పగిలి పోతున్నట్టనిపించింది. ఒక గమ్యం అంటూ లేకుండా నడిచి నడిచి చివరికి కాళ్ళు నెప్పులు పుట్టి ఎదురుగా కనపడ్డ ఇంటి అరుగుమీద చతికిల పడింది. అప్పుడే ఒక ఏభై ఏళ్ళావిడ ఆ ఇంట్లోంచి బయటికి వచ్చింది.

'కొంచెం మంచి నీళ్ళిస్తారా?' నీరసంగా ధ్వనించింది లోక గొంతు. ఆవిడ ఒకటి రెండు నిమిషాలు లోకని పరీక్షగా చూసి ఆ తర్వాత అడిగింది 'తెలుగువాళ్ళా మీరు?'

ఔనన్నట్టుగా తల ఊపింది లోక.

'మేమూ తెలుగు వాళ్ళమే. నిన్ను చూస్తుంటే, అచ్చు, పోయిన నా కూతురే వొచ్చినట్టుంది. ఏ ఊరు మీది?'

చెప్పింది లోక.

ఆవిడ లోపలికివెళ్ళి మంచినీళ్ళు తీసుకొచ్చిఇచ్చి; లోకని గురించిన వివరాలన్నీ అడిగి తెల్సుకుంది.

మొదటినించీ కూడా అన్నీ వివరంగా చెప్పి, చివరికంది లోక. 'దారి తెన్నూ తోచక ఇలా తిరుగుతున్నాను. ఏ మొహం పెట్టుకుని మళ్ళీ నాన్నదగ్గరకి వెళ్తాను!' రెండు చేతుల్లో మొహం దాచుకుని కుమిలి పోయింది.

'అయ్యో! పాపం!' జాలిగా చూసిందావిడ. లోక మొహం చూస్తుంటే ఆ పిల్ల చెప్పేది అసత్యమనిపించలేదావిడకి.

'అమ్మా! మీరేమీ అనుకోకపోతే మీ ఇంట్లో ఏదన్నా పనిప్పించండి. దాసీ పనైనా సరే...' ఆశగా అడిగింది లోక. ఒక్క క్షణం ఆలోచించిందావిడ. 'మా ఇంట్లో నేను తప్ప మరెవరూ లేరు. పని మనిషి నెవరినీ పెట్టుకోలేదు నేను. ఒక్కదాన్నే కదా అని. పైగా మరి కొన్నాళ్ళు పోయాక మా అబ్బాయి దగ్గరకి వెళ్ళి పోతాను. పోన్లే...అంతవరకైనా నీకాశ్రయం ఇచ్చినట్టుంటుంది. ఉండమ్మా... నా దగ్గరే ఉండు.'

కృతజ్ఞతగా చూసిందావిడ వైపు లోక.

'నా పేరు శాంతమ్మ. నీ పేరేమిటి?' అందావిడ.

చెప్పింది లోక.

లోక, పోలికల్లో ఆవిడ కూతురి మాదిరే ఉండడంతో ఏదో తెలియని అనురాగం, ఆప్యాయత ఏర్పడ్డాయి శాంతమ్మకి. లోకని లోపలికి తీసికెళ్ళి ముందు తాగడానికి కాస్త కాఫీ ఇచ్చింది. కడుపులో ఏమీలేక ఆకలితో మండిపోతున్న లోకకి ఆ కాఫీ అమృతమే అయింది. అది తాగి

కొన్ని తేరుకుంది. ఆ రోజు నుంచి ఆవిడ పెట్టింది తిని, ఆవిడిచ్చిన పాత చీరలే కట్టుకుంటూ ఆవిడ కన్ని పనుల్లోనూ సాయం చేస్తూ ఉండి పోయిందా ఇంట్లోనే కానీ ఎదలో ముల్లులా మోహన్‌ని గూర్చిన దిగులు బాధిస్తూనే ఉంది. 'ఎందుకూ బ్రతకడం' అని ఎన్నిసార్లో అనుకుని కూడా పుట్టబోయే బిడ్డకోసం మొండిగా తప్పనిసరిగా బ్రతుకీడుస్తోంది. 'మంచిరోజు లొస్తాయి. అధైర్యపడకం'టూ ఓదారుస్తుంది శాంతమ్మ.

'మంచిరోజులంటూ తనకున్నాయా అసలు? అక్కనీ, నాన్ననీ వొదిలి వచ్చినందుకు తగిన శాస్తి జరిగింది. ఎక్కడికి వెళ్ళిపోయాడు మోహన్. అసలు వాళ్ళ ఊరేదో తనకి తెలియదు! తనమీద ఎంతో ప్రేమ ఉన్నట్టు యెంత ఇదిగా మాట్లాడేవాడు! అంతా నటనే. ఎన్నో ఆశలు నింపుకుని, మనస్ఫూర్తిగా ప్రేమించి వొచ్చిన తనని ఒంటరిగా వొదిలి వెళ్ళిపోడం న్యాయమేనా? భగవాన్! నాన్న, అక్క ఎలా ఉన్నారో! ఏం చేస్తున్నారో! అక్క మంచితనం, దూరంగా వచ్చేశాక ఇప్పు డర్థమవుతోంది. కాని ఏం లాభం? ఇంత జరిగాక, ఒకసారా ఇంట్లోంచి వచ్చేశాక మళ్ళీ ఆ ఇంట్లోగానీ, ఆ ఊళ్ళోగానీ అడుగుపెట్టే ధైర్యం తనకి లేదు. తలెత్తుకోలేని పరిస్థితిలో నాన్నకి, అక్కకి మొహం చూపించడం ఎలా? అజ్ఞాతంగానే గడిపెయ్యడం మంచిది. 'లోక లేదు. చచ్చిపోయిందని ఒకచుక్క కన్నీరు విడిచి ఆ తర్వాత ప్రశాంతంగా గడుపుతాడు నాన్న. 'లోక ఎక్కడికి వెళ్ళిపోయిందో యెలా ఉందోనని మొదట్లో కలవరపడినా కాలక్రమేణా గతాన్ని వెనక్కినెట్టి ముందుకి సాగిపోతుందక్క. అలా కాక తనిప్పుడు వాళ్ళదగ్గరకివెళ్తే వాళ్ళకి జీవితాంతం మనశ్శాంతి లేకుండా చేసినదవుతుంది. 'లోక జీవితం ఇలా వాడిన పువ్వయిపోయిందేమిటని' నిత్యం దిగులుతో కృశించిపోతుందక్క.

'దీని బిడ్డకి తండ్రెవరు? లోకులు దీన్ని కాకులు పొడిచినట్టు పొడవరూ?' అన్న వేదనతో నాన్న జబ్బు మరింత ఎక్కువవుతుంది. అందుకే, తను వాళ్ళ దగ్గరికెళ్ళి వాళ్ళకి జీవితాంతం మన



ప్రశాంతత లేకుండా చేసేకంటే దూరంగా ఉంటేనే మంచిది. 'ఎక్కడో సుఖంగా ఉండే ఉంటుంది.' అనే భావనే వాళ్ళల్లో మిగిలి శాశ్వత ప్రశాంతంగా ఉండగలుగుతారు. పెరిగేకొత్తే కాలం వాళ్ళు తనని మర్చిపోయేలా చేస్తుంది. అదే సుఖం వాళ్ళకి.' ఆలోచన్న బరువుతో చిన్నగా నిట్టూర్చింది లోక.

* * *

'అదిగో రాణీగారు వేంచేశారు. ఇంక మనవాడి మొహంలో చూడాలి నవ్వుల చిందులు.' చిన్నగా పక్కవాళ్ళ చెవుల్లో గొణిగారు రామనాధంగారు. నవ్వకపోతే ఆయన కెక్కడకోపం వస్తుందోనని ఏదో పెద్ద జోక్ విన్నట్టు విరగబడి నవ్వారు పక్కవాళ్ళు. అసహ్యంతోనూ, కోపంతోనూ నిలయ మొహం ఎర్రబడింది. తల వంచుకుని, తనేమీ వినవట్టే వచ్చి తన సీట్లో కూర్చుంది. నిలయ మొహంలోకి చూడటానికే సిగ్గనిపించింది భాస్కర్రావుకి. రామనాధంగారి మాటలకి గుండె మండిపోతోంది. తనకే ఇంత బాధగా ఉంటే నిలయకెలా ఉండఉంటుందింక? ఒకరోజా రెండురోజులా? ఈ ఆఫీసులో పనిచేసినన్నాళ్ళూ ఈ మాటలు వినక తప్పదు. కానీ ఇటువంటి మాటలవల్ల పెళ్ళి కావల్సిన నిలయకెంత ముప్పు. పెళ్ళయిన తనకిమాత్రం? ఎప్పుడైనా ఈ గాలికబుర్లు వరలక్ష్మి చెవిన పడ్డాయంటే ఇంకేమన్నా ఉందా? ఇప్పటికే ఇంట్లో పెద్దవాళ్ళ ప్రవర్తన మూలంగా సగం కరువైంది ఆనందం. ఇంక ఈ దుమారం రేగిందంటే తను సంసారంలో సుఖానికీ, సంతోషానికీ పూర్తిగా ఆమడదూరంలో ఉండాలి.

మధ్యాహ్నం అందరూ కాంటీనువైపు నడిచారు.

ఎవరితోనూ మాట్లాడకుండా కుర్చీ కంటుకుపోయి కూర్చుని ఉంది నిలయ. జాలి ముంచుకొచ్చింది భాస్కర్రావుకి నిలయని చూసి. వెనకగా వెళ్ళి చిన్నగా దగ్గాడు. వెనక్కి తిరిగి ఒక్క క్షణం అతని మొహంలోకిచూసి మళ్ళీ తలదించేసుకుంది నిలయ. 'మీ నాన్నగారి ఒంట్లో ఎలా ఉంది?' అడిగాడు భాస్కర్రావు.

కుర్చీ గట్టిగా వెనక్కితోసి లేచి నిలబడింది నిలయ. రెండు చేతులు జోడించి

విడిన మబ్బులు

సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది. 'నన్ను మీరు బతకనివ్వరా! ఇప్పటికే నేను పడుతున్న మాటలు చాలు. ఇంకా ఎందుకు నా దగ్గిర కొస్తారు! నన్ను వేళకరిస్తా రెందుకు?' చెళ్ళున చెంపమీద కొట్టినట్టయింది భాస్కర్రావుకి.

'నిలయా!' అన్నాడు అప్రయత్నంగా.

ఆ మాటలు లోలోనే ఉండిపోయాయి. కళ్ళలో తిరిగే నీటితో వణికే పెదాలతో నీరసంగా కుర్చీలో వాలిపోయింది నిలయ. తప్పనిసరిగా అక్కడినించి కదిలాడు భాస్కర్రావు నిట్టూర్చి. అతను వెళ్ళిపోయాక తనతప్పు తనకే తెలిసొచ్చింది నిలయకి. ఆవేశంలో అన్న మాటలకి అతనెంత బాధపడి ఉంటాడో! అయినా తనకి మాత్రం ఎంతకని వస్తుంది ఓర్పు. ఇంట్లో మనశ్శాంతిలేదు. తండ్రి ఆరోగ్యం గురించి ఆందోళన, చెల్లెలి గురించి దిగులూ, తన భవిష్యత్తెలా ఉంటుందో నన్న బెంగ. ఇంక శాంతెక్కడ తన మనసుకి. రోజు రోజుకీ రామనాధంగారి పిచ్చి మాటలు తనలో ఆవేశాన్ని రెచ్చగొడుతున్నాయి. ఈ బాధతో, ఈ కోపంతో అనవసరంగా భాస్కర్రావు మనసు గాయపరిచింది తను. ఛీ...తనెంత పని చేసింది!

సాయంత్రం ఒక్కొక్కరే ఆఫీసులోంచి బయటపడుతున్నారు. భాస్కర్రావు వెనకే నడిచింది నిలయ. రోడ్డుమీది కొచ్చాక ఎవరూ తమని గమనించట్లేదని నిశ్చయించుకొన్నాక మెల్లిగా అంది నిలయ 'క్షమించండి.'

వెనక్కి తిరిగి నిలయ మొహంలోకి చూశాడేతప్ప నోరు విప్పలేదు భాస్కర్రావు.

'మనసులో బాధతో, ఆవేశంలోనే మిమ్మల్నేదో అన్నానే తప్ప మీమీద కోపంతో అనలేదు. నన్ను క్షమించండి.'

భాస్కర్రావు మొహంలోకి కాంతి వచ్చింది. అందంగా నవ్వాడు. 'నాకు తెలుసు. మీ మనసు నాకు తెలుసు. మీ పరిస్థితిలో నేనున్నా నేనూ అలాగే మాట్లాడి ఉండేవాడిని. రామనాధంగారి మాటలకి నాకూ బాధగానే ఉంది. కానీ ఉద్యోగం తప్ప మరో ఆధారం లేనివాడిని. ఏదన్నా అంటే, మేనేజరుతో లేనిపోనివన్నీ చెప్పి ఇక్కడ ఉద్యోగం ఊడగొడతాడోనన్న భయంతో తప్పనిసరిగా కోపాన్ని దిగమింగి ఊరుకుంటున్నాను.' జాలిగా అతని కళ్ళల్లోకి చూసింది నిలయ. స్కూళ్ళనించీ, కాలేజీల్నించి ఇళ్ళకి వెళ్తున్న పిల్లలతో, కుర్రకారుతో, ఆఫీసుల్నించి అలసిన మొహాలతో, ఇంటిమొహం పట్టిన పెద్దలతో, ఏమీ పన్లేక షికార్లు మొదలెట్టిన మందతో. బస్సులూ, రిక్షాలూ, సైకిళ్ళూ, కార్లతోనూ బహు రద్దీగా ఉంది రోడ్డు. ఎవరి గొడవ వారిది. ఇంతలో వారిముందు నడుస్తున్న పదేళ్ళ కుర్రాడు రోడ్డు కటువైపు వెళ్ళవల్సొచ్చి దూరంగా వస్తున్న లారీని చూసికూడా అది దగ్గిరకి వచ్చేలోపల దాటి పోలేకపోతానా అన్న ధీమాతో కాబోలు చటుక్కున రోడ్డు కడ్డంగా పరుగెత్తాడు. అంతే కన్నుమూసి తెరిచేంతలో లారీపైన, ఆ కుర్రాడు కింద అయిపోయారు. బ్రేకుల్లేని ఆ లారీ బర్రున ఆ కుర్రాడి మీదినించి ముందుకి కొంచెందూరంవెళ్ళి అక్కడాగింది.

అది చూసిన నిలయకి కళ్ళు తిరిగినట్టయింది. ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ కుర్రాడి తప్పుకి కోపం, చావుకి జాలి కలిగాయి. రోడ్డుమీద జనం పోగయ్యారు. వాళ్ళని దాటుకుని ముందుకి వెళ్తూ భాస్కర్రావుతో అంది నిలయ 'బ్రేకులుండి ఉంటే ఆ కుర్రాడు బ్రతికుండేవాడేమో! బ్రేకుల్లేకపోవడం ఆ డ్రైవరిదీ తప్పే. లారీ వస్తుండడం చూసికూడా రోడ్డు కడ్డంగా పరుగెత్తడం ఆ కుర్రాడిదీ తప్పే. అయినా అంతా జరిగిపోయాక అనుకుని ఏం లాభం? ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు?'

ఇంటికి వెళ్ళాక, ఆ దృశ్యమే మనసంతా నిండిపోడంతో సరిగ్గా పని చెయ్యలేక పోయింది నిలయ. ఎన్నో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కానీ కళ్ళారా చూడటం అదే మొదటి సారయ్యె!

* * *

ఆ రోజు సాయంత్రం మామూలుగా ఆఫీసునించి వచ్చాక తండ్రికి మందూ, కాఫీ ఇచ్చి తను కూడా కాఫీ తాగి వంట పనిలో పడింది నిలయ. కూర తరుగుతుండగా మధ్యలో రెండుసార్లు తండ్రి పిలవడం 'ఏవిటి నాన్న పిల్చావా

...అంటూ ... "తిట్టా! లేదా పిలవలేదు..." అంటూ ఆయన సన్నగా గొణగడం జరిగింది. ఆశ్చర్యమనిపించింది నిలయకి. వంట పూర్తయాక వంటింటి తలుపేసి తండ్రి దగ్గరకి వెడుతుంది. ఆయన పడుకుని ఏదో తనలోతనే గుణించుకుంటు న్నట్టు పెదాలు, చేతులు కదుపుతున్నారు. కళ్ళు ఇంటి పైకప్పుని చూస్తున్నాయి. "నాన్నా!" అంటూ ... వెళ్ళి నిలబడింది నిలయ. ఆయన ... లేదు. ఎందుకో తెలియని భయం వేసింది నిలయకి. మరోసారి ... పిల్చింది.

ఆయన తలతిప్పి చూసి పలికలేదు. ఆ చూపుకూడా అదోలా అనిపించింది.

'ఏమిటి నాన్నా అలా చూస్తున్నారు? ఏమి ఆలోచిస్తున్నారు.' భయాన్నీ, తొంగి చూస్తున్న అనుమానాన్నీ లోలోపలే అణిచి పెడుతూ అంది.

'అమ్మా! నిలయా!' అప్పుడే కూతురక్కడికి వొచ్చినట్టుగా చూసి పిల్చాడాయన.

'ఏమిటి నాన్నా?'

'నీకో తోడు చూపించకుండానే నిన్నొంటరిదాన్ని చేసి...'

నెత్తిన పిడుగుపడినట్టయింది నిలయకి.

'ఇప్పుడటువంటి మాటలెందుకు నాన్నా?'

'కాదమ్మా! నన్ను చెప్పనీ! నేను మంచంపట్టి ఇన్నాళ్ళుగా నీ చేత ఉద్యోగం చేయిస్తూ పూర్తిగా నా భారం నీ మీద మోపి...నిన్నో ఇంటిదాన్ని చెయ్యలేకపోయాను.'

తండ్రలా మాట్లాడుతుంటే నిలయ గుండెల్లో భయం. బాధ చోటు చేసుకున్నాయి. కళ్ళల్లో నీళ్ళు చెంపల్ని తాకేందుకు సిద్ధంగా వున్నాయి.

ఒక్కసారిగా ఆయాసం ముంచుకు వచ్చి మరి మాట్లాడలేకపోతున్న తండ్రి గుండెల మీద కంగారుగా చేత్తో రాసింది.

'ఎలా ఉంది నాన్నా?' నిలయమాట పూర్తి కావడం, శివరామయ్య ప్రాణం గాలిలో కలవటం ఒక్కసారే జరిగాయి.

చైతన్యంలేని ఆ కళ్ళు చూసి తల్లడిల్లి పోయింది.

'నాన్నా...నాన్నా...మాట్లాడు నాన్నా!' ఆపుకోలేని దుఃఖంతో ఆయన గుండెల మీద తల ఆన్చింది.

తలుపులు తోసినట్టయితే తల త్రిప్పి చూసింది చటుక్కున.

ఎదురుగా మధు...త్వరత్వరగా మంచం దగ్గిరికి వచ్చిన మధు పరీక్షగా చూసి పరిస్థితి గ్రహించాడు.

అతని కళ్ళల్లోకి ఒక్క క్షణంచూసి. గొంతులో బాధ సుళ్ళు తిరుగుతుండగా తడబడుతూ అడిగింది నిలయ. 'సమయానికి వొచ్చారు. చూడండి......నాన్నగారి కెలా ఉంది?'

'అయిపోయింది. ఆయనింక మాట్లాడరు.' మధు మాటతో నిలయ దుఃఖం

విడిన మబ్బులు

కట్టతెంపయింది. రెండు చేతుల్లోనూ మొహం కప్పుకుంది.

'నిలయా!' మధు పలికిన ఆ మూడక్షరాల్లోనూ అతని కామెమీదున్న ఆప్యాయత, అనురాగం వెల్లువలై ప్రవహించాయి— మధు గుండెల్లో తలదాచుకుని మనసులో బరువు తగ్గించుకోడానికి విఫలయత్నం చేసింది నిలయ.

'ఊరుకో నిలయా!'

'నే నెవరికోసం బ్రతకాలింక? నాకింకెవరున్నారీ ప్రపంచంలో? నాన్న లేకుండా నేనెలా బ్రతకాలి?'

'నువ్వొంటరిదానివి కాదు నిలయా! నే నున్నాను నీకు తోడు.' నిలయ వీపు మీద మృదువుగా తట్టాడు మధు.

'నే నున్నాను నిలయా! నే నున్నాను. నువ్వొంటరిదానివి కాదు.' కళ్ళల్లో నీరింకిపోయేవరకూ ఏడ్చి ఏడ్చి, చైతన్యం కోల్పోయి బొమ్మలా కూర్చుండిపోయింది నిలయ. జరగవల్సిన తతంగమంతా మధుయే దగ్గిరుండి జరిపించాడు.

కళ్ళెదురుగా చూస్తూ కూడా, తండ్రి మరి లేడంటే నమ్మలేకపోతోంది నిలయ మనసు. ఆలోచనతో సతమతమవుతూ మెదడు వేడెక్కిపోతోంది. (కల్లోనైనా, ఇటువంటిరోజు వొస్తుందని ఊహించడానికే భయపడేది తను. కానీ తను భయపడితే మాత్రం జరగవల్సినది ఆగిపోయిందా? ఒక్కరోజులో ఎంత మార్పు? సాయంత్రం దాకా మాట్లాడిన నాన్న ఇంక లేడు తనకి. అమ్మెన్నాడో కరువైంది. ఉన్న ఒక్క చెల్లెలూ ఊళ్ళోంచే వెళ్ళిపోయింది. ఇప్పుడింక నాన్నకూడా తనని ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోయాడు. అందరూ ఎవరిదోవ వాళ్ళు చూసుకున్నారు. ఏకాకిగా తను మిగిలిపోయింది. తనకింకెవరూ లేరు'

'నిలయా!' చల్లని అభయహస్తం భుజంమీద పడింది.

తలెత్తి చూసింది. అనురాగ పూర్ణ హృదయంతో ఎదురుగా మధు.

'చూడు నిలయా! నువ్వదేపనిగా బాధపడకూడదు దిగులుతో నువ్వు కుమిలిపోతే నేను చూడలేను.' నిలయ, మధు మనసంతా నిండింది.

నిలయ మనసులో మధు స్థిరంగా చోటు చేసుకున్నాడు.

ఎవరికోసమూ ఆగకుండా కాలం ముందుకి సాగిపోతోంది!

పెట్టిన సెలవైపోయింది నిలయకి. మళ్ళీ ఉద్యోగం...వెళ్ళడం రావడం...ఆఫీసు పనిలో బాధ, ఒంటరి తనం మర్చిపోవడానికి ప్రయత్నించినా ఇంటికి వస్తూనే నీరసం, దుఃఖం ముంచుకువచ్చేవి, తనని కూడా తీసుకుపోకుండా ఇంకా ఎందుకుంచాడా భగవంతుడన్న బాధ మనసుని మెలివేసేది.

మధు రెండు రోజులకో సారొచ్చి చూసి వెళ్తున్నాడు. పార్వతమ్మగారుకూడా వీలున్నప్పుడల్లా వొచ్చి కబుర్లుచెపుతూ కూర్చుంటోంది.

ఆ రోజు సుశీల, లెక్కల పుస్తకం, నోట్సు తీసుకుని నిలయదగ్గిరికి వచ్చింది 'అక్కా! నాకీలెక్క తెలియట్లేదు చెప్పవూ!' అంటూ.

చాపవేసి కూచోమని పుస్తకం తీసుకుంది నిలయ. ఆ పిల్లకి అర్థంకావన్నీ బోధించింది.

ఇంతలో గుమ్మందగ్గిర ఎవరిదో అలికిడై చటుక్కున తలెత్తి చూసింది చిరునవ్వుతో మధు. 'రండి' తను లేస్తూ అతన్ని లోపలికి ఆహ్వానించింది.

'నేను వెళ్తున్నా నక్కా!' అంటూ పుస్తకాలు తీసుకుని ఒక్కపరుగుతో బయటికి వెళ్ళిపోయింది సుశీల.

'స్కూటర్ చప్పుడవలేదు. నడిచొచ్చారా?'

'నడిచే వొచ్చాను.' ఏదో ఆలోచిస్తున్నట్టుగా అంది మధు తీరు. కాసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడాక 'నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి నిలయా!' అన్నాడు మధు. ఆ మాట అంటున్నప్పుడు ఎంతో బాధగా ధ్వనించింది అతని గొంతు.

'ఏమిటంటి అది?' కంగారు పడింది నిలయ.

'నేను స్టేట్సుకి వెళ్తున్నాను కొద్ది రోజుల్లో. మళ్ళీ రెండేళ్ళకే రావడం.'

'పై చదువులకోసం వెళ్తూ అంత నీరసంగా మొహం పెడతారెందుకూ? సంతోషంగా ఉండాలిగానీ!' చిలిపిగా నవ్వింది నిలయ. ఒక్కక్షణం సూటిగా నిలయ కళ్ళ

ల్లోకి చూసి తలదించుకున్నాడు మధు. 'మళ్ళీ రెండేళ్ళదాకా నేను కనపడనంటే నీకు సంతోషంగా ఉన్నట్టుంది.' అతని బిక్కమొహం, బుంగమూతి చూసి నవ్వాపుకోలేకపోయింది విలయ. అంతలోనే గుండెల్లో కలుక్కుమంది. ఔను రెండేళ్ల దాకా అతను కనపడడు తను మరింత ఒంటరిదైపోతుంది. కానీ తనకోసం, అతను పైచదువులకి ఛాన్సువొచ్చినా వెళ్ళకుండా ఉండాలని కోరుకోడం ఎంత అవివేకం! పొరపాటునకూడా అటువంటి కోరిక తననోటినించి రాకూడదు. అందుకే చిరునవ్వుతో మనస్ఫూర్తిగా అంది 'రెండేళ్ళు ఎంతలో గడుస్తాయి. మీకు స్వాగతం పలకడానికి రేరాజకోసం ఎదురుచూసే కలువభామలా మీ రాకకోసం ఎదురుచూస్తూ ఉంటాము.'

'ఏమో! రెండేళ్ళంటే రెండు యుగాలు నాకు. నిన్ను చూడకుండా నిద్రపడుతుందా నాకు!'

'నాతో పరిచయం కాకముందు ఎవరిని చూస్తే నిద్రపట్టేది కాదండీ తమకి?'

'అబ్బ! నీతో మాట్లాడలేను. ఇంకొక్క రెండేళ్ళాగు. నీ ముక్కుకి తాడు వేస్తాను.'

'అలాగా!' అంతలోనే విలయమొహంలో కాంతి తరిగింది. వక్కెక్కడ? నాకలోకమెక్కడ? తీరే కోరికేనా ఇది! అందని కుసుమంకోసం ఆశలు పెంచుకోకూడదు. తరువాత నిరాశపడవల్సివొస్తుంది. అతనికిష్టమైతే చాలా? ఇంట్లో పెద్దవాళ్ళు ఒప్పుకుంటారా? చంద్రశేఖరంగారి కోడలయ్యే అర్హత తన కెక్కడుంది? అంత అదృష్టానికి తను నోచుకుందా? భగవాన్! ...ఇదంతా మధు ఆలోచించాడా? ఎలా చెప్పాలతనితో!

'ఏవిటా దీర్ఘాలోచన?'

'అబ్బే! ఏవీలేదు' నెమ్మదిగా అంది కళ్ళు కిందకి వాల్చి.

'సరే మరి నే వెళ్ళిరానా?' అయిష్టంగానే కదిలాడు మధు.

మధు వెనకే వీధి గుమ్మందాకా వచ్చిన విలయ, ఇరుగుపొరుగు వాళ్ళు తన వంక అదోలా చూస్తుంటే భరించలేక గబగబా లోపలికి వచ్చేసి మంచంమీద వాలిపోయింది. మధు వెళ్ళిపోతే మళ్ళీ రెండేళ్ళదాకా కనిపించడని తల్చుకుంటే అప్పుడే తను ఒంటరిదైపోయినట్టు అనిపిస్తోంది. కాలం గడిచేదెలా?

'మధుకి తనంటే ఎందుకంత ఇష్టం?' లోలోనే విలయకి జవాబు వినిపించింది 'నీకెందుకంత ఇష్టం అతనంటే?' సిగ్గుతో కళ్ళు అరమోడ్పులయాయి. 'చెంపల్లో మందారాలు పూశాయి' రెండేళ్ళు రెండు యుగాల్లా గడపాలి. అప్పుడొస్తాడు. వొచ్చి...అప్పుడీ ఇరుగుపొరుగు చూసే అదో రకమైన చూపులు తప్పిపోతాయి. అందరూ తన అదృష్టానికి ఆశ్చర్యపోతారు...వాన్నే ఉండి ఉంటే తన అదృష్టానికి పొంగిపోయేవాడు...కానీ...కానీ తానొకటి తలిస్తే... అన్నట్టు జరిగితే...ఛ...ముందునించే అలా ఎందుకనుకోడం...హు ... అనుకోక చేసేదేముంది? నా అన్నవాళ్ళులేని, ఉద్యోగం మీద ఆధారపడి జీవించే తనబోటి నిస్సహాయురాలి కంత అదృష్టం ఉంటుందా? పనికిరాని మొక్కల్లా, మనిషి మనసులో ఆశలెందుకు పెరిగిపోతాయి? భగవంతుడా! ఎందుకిలా జీవితాలతో చెలగాటమాడతావు?' బాధగా కణతలు నొక్కుకుంది విలయ. ఆలోచనల్తో మనసు అటూ ఇటూ గా ఊగిసలాడుతోంది. అలా ఎంతసేపుండి పోయిందో తనకే తెలియదు.

* * *

ఆ రోజు ఆదివారం. ఆఫీసుకి వెళవే కాక, వంటపని కూడా లేదు.

పార్వతమ్మగారు భోజనానికి పిల్చారు.

'ఎందుకండీ! ఏ కారణం లేకుండానూ?' అంటే 'కారణం ఉంటేనే పిలవాలా ఏమిటి! ఏదో సరదాగా నాతో కల్సి భోజనం చేద్దుగాని. సెలవేకదా ఈ రోజు. నీకూ కాస్త మార్పు కిందుంటుందని పిలుస్తున్నాను. మొహమాట పడకు.' అందావిడ ఇంకేమీ అడ్డు చెప్పకన్నట్టు చూస్తూ.

ఒప్పుకోక తప్పిందికాదు విలయకి.

ముందు పిల్లలకీ, భర్తకీ వడ్డించిందావిడ.


వడ్డనలో ఆవిడకి సాయపడదామనుకుందేగానీ, విశ్వనాధంగారి వాడి చూపులకి తట్టుకోలేక తల వంచుకుని తలుపుపక్కన నిలబడి పోయింది విలయ.

'అంత సిగ్గెందుకు విలయా! అన్నయ్యగారి దగ్గిర' అంటూ నవ్వారు.

ఏం చెప్పాలో తోచలేదు విలయకి.

'చూడు నా వంకెలా, తినేసేటట్టు చూస్తున్నాడో మీ ఆయన' అని చెప్పాలా? 'ఇదివరకెప్పుడూ నన్ను చూడనట్టు అలా ఎందుకు చూస్తున్నాడని అడగాలా?' అందుకే ఏం మాట్లాడకుండా ఉండిపోయింది.

విశ్వనాధంగారి భోజనం పూర్తవుతుండగా వీధి తలుపు చప్పుడైంది.



'బాబూ !' అంటూ వెళ్లిన పార్వతమ్మగారు మరుసటిక్షణంలోనే 'అయ్యో!' అంటూ కంగారుగా లోపలికి వచ్చిపడ్డారు.

'మా చెల్లెలికి నాల్రోజుల్నించి కడుపులో నొప్పిగా ఉంటోంది కదూ! ఇవాళది ఎక్కువై భరించలేనంతగా అవడంతో హాస్పిటల్లో చేర్పించార్ట. తీసికెళ్లేప్పుడే నన్ను త్వరగా రమ్మని వాళ్లాయన కబురంపించారు నౌకరుతో'.

'మధ్యాహ్నం తిన్లేదు. తినేసి వెళ్లరాదూ!' అంతా విన్నాక అన్నారు విశ్వనాథంగారు.

'కానీలెండి. ఇప్పుడు నే నన్నంతింటూ కూర్చోనా ? అయినా ఈ కంగార్లో తిందా వన్నా సహించద్దూ ! ఓసారెళ్లి చూసొస్తేగానీ కాళ్లూ చేతులూ ఆడవు తెలిశాక.'

విడిన పంబ్బాలు

ఆదరాబాదరాగా చీర మార్చుకొచ్చి, నిలయతో అన్నారావిడ 'నిలయా నీ కన్నం పెట్టకుండానే వెళ్లాల్సొస్తోంది. తీరా నిన్న భోజనానికి పిల్చి...'

'మరేం పర్వాలేదులెండి. మీరుమాత్రం ఏం చేస్తారు ? కానీ పాపం మీకు మరీ పొద్దుపోతుందేమో...'

'దానికేం పర్వాలేదులే...హాస్పిటల్ దగ్గిరే ఇక్కడికి. అసలు సంగతి, సందర్భం ఎలా ఉండో ఏవిటో తెల్సుకునొస్తేగానీ ముద్ద నోటికి పోవద్దూ ? నువ్వు మాత్రం మొహమాట పడకుండా అన్నీ వేసుకుని కడుపునిండా భోంచెయ్యాలి. నేను లేనని సరిగ్గా తినకుండా లేవద్దు. మేము పరాయివాళ్లమన్న ఆలోచన రానివ్వకు...'

'కడుపులో ఆకలుంటే మొహమాటం తోకముడిచి పారిపోతుంది లెండి.'

నిలయ మాటలకి విశ్వనాథంగారు కూడా నవ్వారు.

'నిన్ను భోజనానికి పిల్చి నీకే వనప్పగించి వెళ్తున్నాను.'

బాధపడుతూ వెళ్లారు పార్వతమ్మగారు.

పరాయివాళ్లింట్లో, తనే స్వయంగా అన్నీ వొడ్డించుకుని ఒకత్తీ కూర్చుని తినడం మొహమాటమే అనిపించింది నిలయకి.

'మొహమాట పడకుండా తిను.' ఉలిక్కిపడి తలెత్తింది. గుమ్మం పట్టుకుని నిలబడ్డ విశ్వనాథంగారు తదేకంగా చూస్తున్నారు. మరి ముద్ద నోట్లోకి పోలేదు. ఎలాగో అయిందనిపించి, తనకి తోచినట్టుగా అన్నీసర్ది వంటింటి తలుపు గడియవేసింది.

'నిలయా !' నెమ్మదిగా చెవుల్లో పడింది. విశ్వనాథంగారి పిలుపు. ఒళ్లంతా తేళ్లూ జెర్రులూ పాకినట్టయిందా పిలుపుకి. సుశీల పక్కవాళ్లమ్మాయితో చింతగింజ లాడ్డానికి వెళ్లింది. రమ, రమకంటే అయిదేళ్లు పెద్దదయిన విమల హాల్లో మంచాలమీద నిద్రకు పడ్డారప్పుడే. విశ్వనాథంగారు పడగ్గదిలో మంచంమీద మధ్యగా కూర్చునున్నారు. గుమ్మందగ్గరే ఆగిపోయింది నిలయ.

'చాలా తలనెప్పిగా ఉంది. కాస్త ఆ బల్లమీద అమృతాంజనం సీసా ఉంది ఇలా ఇస్తావా ?'

కోపంతో పాటూ ఆశ్చర్యం కూడా కలిగింది నిలయకి.

భారతీయ చిత్రకారులు

రచన, చిత్రాలు: కాలిపు సోమరాజు

వినోద్ షా



(జననం: 1934) శ్రీ వినోద్ షా గారు బరోడా ఫేకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఎం. ఏ. అయ్యారు. అక్కడే కళాధ్యాపకు లయ్యారు.

చిత్రశైలిలో వీరు అనేక ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. ఒకసారి కర్ర, యింకొకసారి యిసుక, మరొకసారి లోహాలను రచనాసామగ్రిగా తీసుకొని చాలా ప్రయోగాలు చేసేరు. వీరికి అలంకరణపై ప్రీతి మెండు.

నలుపు తెలుపు రంగులు వీరికిష్టం. 1960 లో విద్యార్థిదశలోనే వీరి చిత్రాలు మొట్టమొదటిగా ప్రదర్శితమయ్యేయి. దేశదేశాంతరాలలో వీరి చిత్రాలు చాలాసార్లు ప్రదర్శింపబడ్డాయి. బహుమతులు కూడా లభించేయి. 1969 లో నేషనల్ ఎవార్డు లభించింది.

'పిచ్చావేంటి కోపిష్టియని ? ఏమిటీ యనీ ఉద్దేశం ? భార్య ఇంట్లో లేదు కదా అ...' ఇంక ఆలోచించలేక పోయింది, మౌనంగా అమృతాంజనం సీసా మంచం మీద ఆయన కొంచెం దూరంలో పెట్టి వెనక్కి తిరిగింది.

'వెళ్లిపోతున్నావా ?' ఆయన కంఠంలో మార్పుతోచి, గుండె దడదడలాడింది.

వెనక్కి తిరిగి చూడటానికి భయం, అసహ్యం అడ్డుకున్నాయి. 'మా ఆవిడ ఇంట్లో లేదుగా. ఎందుకా భయం నీకు ? ఇదివరకెప్పుడూ పన్నెత్తి పలకరించని మనిషి ఇలా మాట్లాడుతున్నాడేమిటని ఆశ్చర్య పోతున్నావా ? సందర్భం రాలేదింత వరకూ... ఇవాళ ఈ విధంగా కలిసొచ్చింది. ఇలా అడవికాచిన వెన్నెలలా నీ అందం...' అప్పటికే మంచందిగి నిలయ దగ్గరికి వచ్చేశారు విశ్వనాథంగారు. 'ఛీ !' అన్న ఛీత్కారం వెలువడింది నిలయ నోట్లోంచి అప్రయత్నంగా.

'భార్య ఇంట్లో లేదుకదా అని ఇలా మాట్లాడు తున్నాడో !' చటుక్కున అడుగు ముందుకి వేసింది అక్కడుండటం మంచి క్షేమంకాదని. లభించిన అవకాశం చేజారిపోయినందుకు 'అయ్యో !' అను కున్నారు విశ్వనాథంగారు.

గబగబా ఇంట్లో కొచ్చిపడింది నిలయ. 'నిజంగా వింత గండం తప్పింది! ఇంకొక్క నిమిషం అక్కడ నిలబడుంటే ఏం జరిగేదో ? పైకలా మంచిగా కనిపించే విశ్వనాథంగారి మనసులో ఇటువంటి ఆలోచన్లు ! పోనీ ఇప్పటికైనా తెలిసింది అసలు సంగతి, ఇంక సాధ్యమైనంత మటుకు ఆ ఇంటికి దూరంగా ఉంటే మంచిది. లేకపోతే ఆ ఇల్లాలి మనసు కలత పడే పరిస్థితి రావచ్చు. తను మంచిగానే ఉన్నా, ఆయన ప్రవర్తన మూలంగా లేనిపోని అపోహలూ అనుమానాలూ పార్వతమ్మగారిలో చోటు చేసుకుంటాయి. తను సాధ్యమైనంత మటుకు వాళ్లని తప్పుకు తిరిగితే ఏ గొడవా ఉండదు.

(ఇంకా వుంది)

ప్రాచీన వైద్య పద్ధతులు

ముక్కు వెంబడి రక్తం పడుటను కట్టించేవి

1. దానిమ్మ పువ్వుల రసాన్ని లేదా లేత ఆకుల రసాన్ని మూడు లేదా నాల్గు చుక్కల చొప్పున— మూడు లేదా నాల్గు రోజులు ఉదయం, సాయంత్రం ముక్కులో వేస్తే ముక్కులోంచి రక్తంపడడం కడుతుంది.

2. పూటకు మూడు లేక నాలుగు చిన్నముల ఎత్తు కలువ పువ్వుల చూర్ణంలో సమానంగా పంచదార కాని, తేనెకాని కలిపి కొన్ని రోజులపాటు ఉదయం, సాయంత్రం పుచ్చుకుంటే ముక్కు వెంబడి రక్తం పడుట కడు తుంది.

3. పూటకు రెండు ద్రాముల పచ్చి అడ్డసరము సమూల లేక ఆకుల రసంలో— పంచదార కాని, దానిమ్మ పువ్వుల రసంకాని, ఆవునెయ్యికాని, తేనెకాని కలిపి— ఉదయం, సాయంత్రం వారం రోజులు సేవిస్తే ముక్కు వెంబడి రక్తం పడుట కడుతుంది.

4. గుర్రపు లద్దె రసాన్ని మూడు లేదా నాలుగు చుక్కలు చొప్పున రోజుకు రెండుసార్లు ముక్కు రంధ్రాలలో పిండితే ముక్కు వెంబడి రక్తం కారుట హరిస్తుంది.

5. ఏలకుల అరతులం మోతాదు మెత్తని ముక్కలు చొప్పున నాలుగైదు రోజులు ఉదయం, సాయంత్రం పంచదారలో కలిపి తింటే ముక్కు వెంబడి రక్తం కారే రక్త పైత్యం హరిస్తుంది.

6. పూటకు సుమారు ఒకటిన్నర ఔన్సుల గుమ్ముడు చెట్టు చెక్క కషాయాన్ని కొంచెం పంచదార కలిపి— నాలుగైదు రోజులు ఉదయం సాయంత్రం సేవిస్తే రక్త పైత్యం హరించబడుతుంది. గుమ్ముడు చెట్టుకు సంస్కృతంలో గంభారీ, సర్వతో భద్రా, కాశ్మీరీ అని అంటారు.

7. పూటకు మూడు లేదా నాలుగు చిన్నముల ఎత్తు నల్లకలువ గెడ్డ చూర్ణంలో — దానికి సమానంగా పంచదారకాని తేనె కాని కలిపి— రోజూ ఉదయం, సాయంత్రం సేవిస్తే ముక్కు వెంబడి రక్తం పడడం కడుతుంది.

8. యష్టి మధుక చూర్ణాన్ని పూటకు ఒకటి లేదా రెండు చిన్నముల ఎత్తు చొప్పున సుమారు వారం రోజులు ఉదయం, సాయంత్రం పుచ్చుకుంటే ముక్కు వెంబడి రక్తం పడడం కడు తుంది. దీనిని అతిమధుర మని కూడా అంటారు. సంస్కృతంలో యష్టి, మధు, మధుస్రవ, మధుక అని అంటారు.

9. మంచి సున్నాన్ని తెల్లని బట్టకు పరిచి— దానిమీద కోడిగ్రుడ్డులోని తెల్ల సొన పూసి— చుట్టచుట్టి— ముక్కులో వుంచినచో ముక్కు వెంబడి రక్తం స్రవిం చడం కడుతుంది.

10. ఈ రోగం గలవారు పూరపిచ్చుక మాంసంకాని, అడవి పిచ్చుక మాంసం కాని తింటూంటే మేలు చేకూరుతుంది. అరటి పువ్వు, అరటికాయ, అరటి దువ్వ మొదలగు అరటి సంబంధమగు కూరలు, పచ్చళ్లు తింటూంటే ముక్కు వెంబడి రక్తంపడుట తగ్గుతుంది. ఈ వ్యాధి గలవారు అరటి పళ్ళు, ద్రాక్ష పళ్లు సేపపళ్ళు తినడంవల్ల, మేలు చేకూరుతుంది.

(పిల్లలకు, పెద్దల కిచ్చే మోతాదులో వయస్సున కనుగుణంగా తగ్గించి యివ్వాలి.)

మూత్రద్వారము వెంబడి రక్తం పడుటను హరించేవి

1. పల్లేరు, సిల్లిపీచర పిటని చేర్చి కాచబడిన పాలనుగాని—కోలపొన్న, ముయ్యాకు పొన్న, పిల్లి పెసర, కారు మినుములు వీటితో కాచబడిన పాలనుగాని కొన్నాళ్ల పానంచేస్తే మూత్రద్వారం వెంబటి రక్తం స్రవించే వ్యాధి చాల శీఘ్రంగా వశ మవుతుంది.

2. నల్లతుమ్మ ప్రానుయొక్క చెక్క కషాయాన్ని పూటకు ఒకటి లేదా రెండు ఔన్సుల చొప్పున రెండు పూటలా సేవిస్తే మూత్రద్వారం వెంబడి రక్తం పడడం కడు తుంది.

3. నీరుల్లిపాయల రసాన్ని పూటకు ఒక ఔన్సు చొప్పున రోజూ రెండుపూటలా పుచ్చుకుంటే రక్తమూత్రం కడుతుంది.

4. మేడిచెట్టు యొక్క చెక్క కషాయాన్ని పూటకు ఒకటి లేదా రెండు ఔన్సుల చొప్పున రోజూ రెండు పూటలా పానం చేస్తే రక్తమూత్రం కడు తుంది.

(వయస్సుకు తగ్గట్లు పిల్లల కిచ్చే మోతాదు తగ్గించాలి.)

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

కుమారి ఆలేటి
నాగమణి



బయట జోరుగా వర్షం కురుస్తోంది.

నిర్మానుష్యంగా వున్న రోడ్లో వరదగా పారుతున్న నీటివైపు తదేకంగా చూస్తూ, కిటికీ ప్రక్కనే కూర్చున్నాడు ప్రకాశం. చూస్తూ వుండగానే కాలం గడిచిపోవటం ప్రకాశం గమనించలేదనడానికి నిదర్శనంగా, ప్రక్కింటి గడియారం నాలుగు గంటలు కొట్టడంతో ఉలిక్కిపడ్డాడు. చేతివాచీ వంక చూసాడు. సరిగ్గా నాలుగు. అంటే— తాను వెళ్లడానికి మరోగంట టైము వుందన్నమాట.

అంతేకాదు. తన ఆలోచనలకు, మరో గంటలో ముగింపు యిచ్చెయ్యాలి. ఏదో ఒక నిర్ణయానికి వచ్చేయాలి. కాత్యాయని విషయం తేల్చాలి. ప్రసాద్ రాసిన ఉత్తరం లోని ప్రశ్నకు సమాధానంగా, తాను వెళ్లాలో, వెళ్లకపోవడమో ఏదో ఒకటి చేయాలి.

ప్రసాద్ దగ్గరినుంచి వుత్తరంవచ్చి అప్పటికే నలభై ఎనిమిది గంటలు దాటి పోయాయి. ఈ నలభై ఎనిమిది గంటల్లో ప్రతినిమిషం తాను ఆలోచిస్తూనే వున్నాడు. అయినా ఓ నిర్ణయానికి రాలేకపోయాడు. ఈనలభై ఎనిమిది గంటలు గడచిపోయాయి విలువలేకుండా. తానే నిర్ణయానికి రాలేక పోయాడు. సమస్య సమస్యగానే విలిచి పోయింది. ప్రశ్నకు తావు మరిన్ని ప్రశ్నలు పెరిగాయితప్ప సమాధానాలు తెలీడం లేదు. మిగిలింది ఒకే ఒకగంట. విలువ గలది.

కాని...ఈ ఒక్కగంటలో తానేం ఆలోచించగలడు. ఉత్తరం వచ్చిన మరుక్షణం నుండి, తనను అమితంగా వేధించేది ఒకే ఒక ప్రశ్న—అది—కాత్యాయని తనతో పెళ్లి

కంగీకరించిందా ?

కాత్యాయని పెళ్లి తనతో అంగీకరించిందంటె ఆశ్చర్యం, విస్మయం, కలిగి నమ్మలేకపోతున్నాడు.

కారణం — ఒకనాడు కాత్యాయని కళ్లకు తాను కన్పించలేదు. 'మీరు స్త్రీ రచయితలు' అంటూ నవ్వేది. అంతేకాదు. రాయడం తప్ప మరేం చేతకాదు. స్త్రీ రాతల రాయుళ్లు' అది కాత్యాయని తనగురించి, రచయితల గురించి చేసే వ్యాఖ్య.

ఆనాడు కాత్యాయని మాటలకు బాధ పడ్డా, పైకి కనిపించనీయలేదు. కారణం తను రచయిత కావడమో, లేక తన మనసు మరీ సున్నితం కావడమోకాని, ఈ నాటికీ, కాత్యాయనిని నిందించడం లేదు తను.

కాని, ఈనాడు ప్రసాద్ రాసిన వుత్తరం చదివాకా, ఆనాటి కాత్యాయని మాటలు సవాలు చేస్తున్నాయ్.

భద్రంగా జేబులోదాచిన ప్రసాద్ రాసిన వుత్తరం తీసి తన్మయితంగా ఆకర్షించి సవాలుగా నిలిచిన అక్షరాలవైపు చూసాడు.

'కాత్యాయని, పెళ్ళి కంగీకరించింది. ఎవరితో తెలుసా ! నీతోనే. దీనికి నీ అంగీకారం వుంటుందనే అనుకుంటున్నాను. కాత్యాయని విషయం నీకు పూర్తిగా తెలుసు. తెలుసని కాత్యాయనే చెప్పింది అంతె కాదు, 'రచయితగారు ఒప్పుకుంటారని నువ్వు చెప్పడం నాకెందుకో నమ్మశక్యంగా లేదు' అంది నవ్వుతూ.'

'అంటే—తాను రాయడంతప్ప ఏమీ చేయలేని రాతలరాయుడనేనా అర్థం. ఈనాటికి కాత్యాయనికి తనమీద ఆ అభిప్రాయమే వుందా ?' అని అనుకుంటూ ఉత్తరం చివరిపేరా చూసాడు ప్రకాశం.

'నువ్వు శుక్రవారం వరకు వస్తే నీ అభిప్రాయం అడక్కముందే, నాతో చెప్పకముందే నీ అంగీకారాన్ని అర్థం చేసుకుంటాను. నీకు ఇష్టంలేకపోతే మాత్రం నాకు ఆఫీసుకు ఉత్తరం రాయి—'ప్రసాద్.'

'అంటె తనకు కాత్యాయన్ని పెళ్లి చేసుకోవడం ఇష్టం అయి, అంగీకరిస్తేనే శుక్రవారంవరకు వెళ్లాలి. లేకపోతే తిరిగ్గా ఆఫీసుకు ఉత్తరం రాయాలి!

ప్రక్కింటి గడియారం ఓ గంట కొట్టడంతో ప్రకాశం ఉలిక్కిపడుతూ వాచీ వంక చూసాడు. నాలుగున్నర, అప్పుడే అరగంట గడిచిపోయింది.

ప్రకాశం, విసుగ్గా తలవిదిలించి రోడ్డు వంక చూసాడు ప్రకాశం. బయట వర్షం తుంపరగా మారింది. రోడ్డుమీద నీళ్లు మెల్లిగా పారుతూ వున్నయ్. అంతవరకు నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద సైకిళ్లు, రిక్షాలు వెడుతున్నయ్. ఒకటి, అరా చొప్పున.

హఠాత్తుగా లేచి నిలబడ్డాడు ప్రకాశం. గబగబా బట్టలు మార్చుకొని, సూట్‌కేసులోని డబ్బుతీసి, పర్సులో పెట్టుకొని, రెండుజతల బట్టలను, బ్యాగులో సర్దుకొని. ఓ లీవ్‌లెటర్ రాసి, కవర్లో పెట్టి, అంటించి, స్టాంపులు అంటించి, జేబులో పెట్టుకొని, గదికి తాళంవేసి, బ్యాగు భుజాన వ్రేలాడేసుకొని బయలుదేరాడు.

రిక్షాలో వెళ్లినా స్టేషన్ కెళ్లేసరికి కొద్దిగా తడిసాడు ప్రకాశం. రైలు కదలడానికి మరో పదినిముషాలుండడంతో టికెట్టు తీసుకొని, ప్రక్కనేవున్న క్యాంటిన్‌లో వేడివేడి కాఫీ తాగి బయలుదేరాడు.

సరిగ్గా రైలు కదిలె సమయానికి కంపార్టుమెంటులో దూరాడు ప్రకాశం. జనం క్రిక్కిరిసి లేకున్నా, దాదాపు సీటన్నీ ప్రయాణికులచేత ఆక్రమించబడ్డాయి. వీలైతేనేం—ఓ పెద్దమనిషి దయతలచి కాస్త చోటిచ్చాడు ప్రకాశానికి. కూర్చోవడానికి ఇబ్బందిగా వున్నా కూర్చోక తప్పలేదు.

తెల్లవారజామువరకు అలాగె కూర్చోవాలేమొ అనుకున్న ప్రకాశం వోరెండుగంటలు ఇబ్బందిపడ్డాకా కిటికి ప్రక్కనే కూర్చున్న మనిషి, బెర్తుమీదికి వెళ్ళిపోవడంతో లేచి అతన్నడిగి, కిటికి ప్రక్కనే వెళ్ళి కూర్చున్నాడు.

అలా కూర్చోవడంవల్ల మిగతావారికి ఇబ్బంది కలగలేదు. ప్రకాశానికి ఎంతో హాయిగా అన్పించింది. కారణం — కిటికి ప్రక్కనే కూర్చున్నా, థర్డ్‌క్లాసు కంపార్టుమెంటైనా, కంపార్టుమెంటులోని వారు అందరూ మెల్కొనివున్నా, మాట్లాడుతూ, అల్లరిగా, నిశ్శబ్దాన్ని తరిమేస్తున్నా, ప్రకాశం మాత్రం, ఒంటరిగా ఫీల్‌కాగల శక్తి, ఒంటరితనాన్ని అనుభవించే శక్తి అతనికున్నాయ్. అంతేదు — అతను ఆలోచన్లోపడితే తాను రైల్లో ప్రయాణం చేస్తున్నానన్న విషయంకూడా మరిచిపోయి, మరో లోకానికి వెళ్లిపోగలడు.

పరుగెత్తుతున్న రైల్లోనుంచి, బయట దట్టంగా అలుముకుంటున్న చీకటికి తోడుగా, వర్షం, చల్లటి ఈదురుగాలి మొహానికి కొడుతుంటె అలా నిశ్చలంగా కూర్చొని, తదేకంగా ఆలోచిస్తూ పరిసరాలను మరిచిపోయిన ప్రకాశం కళ్లముందు 'ఊహూ...' అంటూ అందంగా నవ్వే కాత్యాయని నిలబడింది.

'కాత్యాయని తనను పెళ్లిచేసుకోవడానికి అంగీకరించింది.'

కాత్యాయని ఈనాడు అంగీకరించింది. కాని...ఒకనాడు ఈ మాట తను కాత్యాయనిని అడగాలనుకున్నాడు.

కాత్యాయనితో తన పరిచయం ప్రసాద్ యింటికెళ్లినపుడు జరిగింది. ఆరోజు తనకు బాగా గుర్తుందికూడా—

'కాత్యాయని ! వీడే ప్రకాశం ! మొన్న పత్రికలో కథ పడిందని చెప్పలేదూ ? వీడిదె' అంటూ, 'ఈవిడ మా పిన్ని కూతురు. బి. ఏ. ఫైనలియర్ చదువుతోంది' అంటూ పరిచయం చేసాడు.

కాత్యాయని తల్లి, తండ్రులు ఏదో పల్లెటూర్లో వుంటారని, కాత్యాయని తన దగ్గిరవుండి చదువుకుంటోందని తెలిసింది ప్రసాద్ చెప్పడం తాను చాలా సార్లు విన్నాడు.

అందుకేనేమొ ప్రసాద్ అంతకంటె ఎక్కువ పరిచయం చేయలేదు. 'నమస్తే !' అన్న కాత్యాయనికి తాను నమస్కరించాడు.

కాఫీలు త్రాగాకా, కాత్యాయని కూడా సంకోచం లేకుండా ఎదురుగా కుర్చీ లాక్కొని కూర్చొని చక్కగా మాట్లాడింది.

'మీరు కథలు వ్రాయడం ఎన్నాళ్లనించి ?' అంది.

'ఈమధ్యేనండి ! నాలుగు సంవత్సరాలు కావొచ్చు' అన్నాడు.

'మీ జవాబుకు, మీ రచనలకు పొత్తు కుదరడంలేదు.' అంది.

'అదేమిటి ?' అన్నారు.

'మారినకాలం, మారుతున్న కాలంలో మారుతున్న విలువల గురించి ఎంతో చక్కగా రాసె మీరు, నాలుగు సంవత్సరాలను, విన్నగాక మొన్న అన్నట్టుగా మాట్లాడుతూవుంటే' అంది నవ్వుతూ.

'నిజమే-కాని...నాలుగు సంవత్సరాల నుండి రాస్తోన్న నా రచనలసంఖ్య చాలా

తక్కువ.' అన్నాడు తను.

'అవును. తరమారాసె ఓ రచయిత సంవత్సరంలో రాసే రచనలె మీ నాలుగు సంవత్సరాల రచనలు' అంటూ, ఆగి,—

'అయినా మీరు ఒక్క నవల కూడా యింతవరకు రాసినట్టు లేదూ ?' అంది—

'కథలు రాయటమే అరుదు. పైగా నవలలూనా ?' అన్నాడు ప్రసాద్.

'అవునండి ! ఆఫీసునుండి వచ్చేసరికి అలసిపోతుంటాను. నవల రాయాలంటె...'

'భలేవారె ! అలా అయితె ఈనాడు నవలలు రాసేవారంతా ఆఫీసుల్లో ఉద్యోగాలు చేయడం లేదంటారా ?'

'నిజమే — కాని...నాకంత ఓపిక, ఓర్పు లేవండి !' అన్నాడు నవ్వుతూ.

'ఓపిక వుందనుకుంటె వుంటుంది. లేదనుకుంటె వుండదు. మీ రచనలు నేను చదివాను. మీరు నవల రాస్తారేమోనని చూసాను. ఇప్పుడు రాయండి ప్లీజ్' అంది నవ్వుతూ. కాత్యాయని అంత అందంగా నవ్వుతూ తనను రిక్వెస్టు చేసేసరికి తబ్బిబ్బై తత్తరపడి బిత్తరపోయాడు.

మరోసారి వెళ్లినపుడు ప్రసాద్ బజారు కెళ్లడంతో కాత్యాయని తనను కూర్చో పెట్టి యెదురుగా కూర్చుంది.

'నవల యింతవరకు వచ్చింది ?' అంది.

'నవల ! ఓహ్ ! యింకా ఏది మొదలు పెట్టలేదు. ఎక్కడా టైమ్ దొరకడం లేదండి' అన్నాడు.

'మానవ ప్రయత్నం అంటూ వుంటె చేయలేంది లేదంటూ కథల్లో రాసే మీరు, మామూలు నవల రాయడానికి యిలా మాట్లాడ్డం, తప్పించుకోవడం ఏం బావు లేదు సార్ ! రాసింది ఆచరించటంలో కష్టమేమిటి ? కష్టమని అనుకున్నప్పుడు రాయడం దేనికి ? ఆలోచించండి ! రాయా లంటె మీకు టైము దొరకదూ ?' అంది.

'చస్తాం ?' అనుకుంటూ తలూపాడు తను.

ఆతర్వాత మరో కథ తనది పత్రికలో పడింది. ఆ కథ చదివి కాత్యాయని చిత్రంగా నవ్వింది.

'రచయితగారూ ! వాస్తవానికి దూరంగా అసహజంగావున్నా, చాలా బావుందండి మీ కథ' అంది.

'వాస్తవానికి దూరంగా వుందా ?'

రచయిత

విస్తుపోయాడు.

'కాదూ మరి ! ఒక ఆడది ఒక మగవాడిని ప్రేమించి, అతను పెళ్లి చేసుకోనంటె మరొకరిని పెళ్లి చేసుకో వడం, నిజంగా నాకు చాలా నచ్చింది. అలా పెళ్లి అనేసరికి, ప్రేమూ గీమా అన్నీ మరిచి వెనుకంజవేసె పిరికివాళ్లకోసం, పెళ్లిచేసుకోనంటూ, పిరికితనంతో నిర్జీవమై విలువకోల్పోయిన ఆ ప్రేమ కోసం, త్యాగం అంటూ, ఒంటరిగా మిగిలిపోయే ఆడవాళ్లంటె నా కసహ్యం. అలా కాకుండా జీవితానికి విలువతెలిసి బ్రతుకును సుఖమయం చేసుకోవాలనే మీ సందేశం నాకు చాలా నచ్చింది. పోతే— ఆ అమ్మాయి తనకు కాబోయేభర్తకు తన గతించిన ప్రేమగాధ చెప్పడం, అంతా విని, అతడు, ఎంతో సంస్కారంతో, 'అయినాసరె నీ సంస్కారానికి నిజాయతికీ నా జోహార్లు' అంటూ పెళ్లి చేసుకోవటం మాత్రం అసహజం. జరగదు. ఒకవ్యక్తిని మోసం చేయకూడదనే మంచితనంలో నిజం చెబితె అర్థం చేసుకునే విత్తుకు యింకా మగవాళ్ళు ఎదగలేదేమో అన్పిస్తోంది నాకు' అంది.

'ఎందుకలా అనుకుంటున్నారూ ?'

'ఎందుకంటే—మగవాడు ఒక ఆడదాన్ని ప్రేమించి, మరో ఆడదాన్ని పెళ్లిచేసుకోవ డానికి అంగీకరిస్తాడు కాని, తెలిసి, తెలిసి, తనకు కాబోయేభార్య, ఒక మగవాడ్ని ప్రేమించి, తనను పెళ్లాడుతోందంటె అసలు అంగీకరించడు. ఆమె నిజాయతీని అర్థం చేసుకోడు.'

'తనను ప్రేమించదనే భయం వుంటుం దనా, మీ అభిప్రాయం ?'

'భయం అయితె పోగొట్టొచ్చు ! కాని అది భయంకాదు. మనిషిని హీనస్థితికి దిగజార్చి, ఘోరంగా ఆలోచించేలా చేసె అనుమానం. మారిన భార్య మనసును, ఆమెలోని నిజాయతిని, అర్థం చేసుకోని...' యింకేం అంటుందోనని కాత్యాయని మాట ను మధ్యలోనే అడ్డుకున్నాడు తను.

'ఆడవాళ్ళకు మాత్రం ఆ అనుమానం వుండదంటారా ?' అన్నాడు.

'వుండడానికి అస్కారంవుంటేగా ?' అంది.

'అంటె.'

''నేను ఆడదాన్ని ప్రేమించి, పెళ్లి అనేసరికి, పిరికివాడిలా పారిపోయి వచ్చాననో, మోసం చేసాననో, పరిస్థితులకు లొంగి పోయాననో ఎవ్వరూ కాబోయే పెళ్లానికి చెప్పరు. చెప్పినా, ఈ సంఘం అతని తరఫున వకాల్తా పుచ్చుకుంటుంది. మగ వాడు ఏం చేసినా తప్పు అని అనకూడదు అని అంటుంది.'

'అయితే ఆడవాళ్లు మాత్రం చెబు తారా ?' అన్నాడు అప్పటివరకు గుమ్మంలో నిలబడే వింటున్న ప్రసాద్.

'చెప్పరు. కాని...సంఘం చేయూత నివ్వని, 'ఆడది' అంటూ 'ఆరిటాకు' అంటూ విలువ యివ్వని ఆడదాని, ప్రేమ విషయం, పెళ్లికాకముందే తెలిసిపోవడానికి అవకాశం వుంది. పెళ్లి ఆగిపోతుంది. ఫలితం అంతే చివరికి.'

'ఒకవేళ పెళ్లి జరిగాకా తెలిసినా ఆ సంసారం – సుఖసారం అనే పాట పాడు కోవడానికి, కనీసం, ఆ మాట ఆ యింట్లో వినడానికి అవకాశం, అర్థంతా కోల్పోయి, నరకంలా తయారవుతుంది.'

'ఒక్క విషయం రచయితగారూ ? ఆడ దానికి పరిష్కారం వుంటుందని రాసి నందుకు, గ్రహించినందుకు థ్యాంక్స్ !' అంది.

'సంఘం ఎంత వకాల్తా పుచ్చుకున్నా, భార్యకు పెళ్ళయిన తరువాతైనా తెలుస్తుంది కదా !' అన్నాడు తను సంభాషణను పొడిగిస్తూ.

'కాని ఏం లాభం? భార్యను వొదిలేస్తె, మగాడిని సమర్థిస్తుంది సంఘం. భర్త నొదిలేసిన భార్యను విమర్శిస్తుంది. హమ్మయ్యో! ఎంత ఘోరం అని ముక్కు మీద వేలువేసుకొని చేతనైనంత వరకు కష్టపడి, ఆవిడను చేటల్లో చెరిగేస్తుంది కదండి!' అంది.

'మా ఊళ్ళో మునసబుగారి రెండో అబ్బాయి వున్నాడు లెండి. ఆయనకు పెళ్ళి కాక ముందే పట్నంలో ఒకావిడ, ఊళ్ళో ఒకావిడ, అవసరానికి ఉపయోగించుకునే ఆట బొమ్మల్లాంటి ఆడవాళ్ళున్నారు.

'ఇద్దరితో ఎలా వేగుతావురా అబ్బాయ్! మరోదానిని కూడా చేర్చుకో! ముగ్గురితో

మువ్వటిగా వుంటుందన్నట్టు మునసబు గారు అతనికి పెళ్ళి చేసారు. ఆవిడ అందరి ఆడవాళ్ళకు మల్లె కాకుండా, భర్త జరిపె వ్యవహారం తెలిసి, వాళ్ళిద్దరు కావాలో తను కావాలో తేల్చుకో మంది. కాస్త గడుసుతనం వుందేమో మరి. మరీ మొండిగా నిలేసి అడగడంతో ఆయన వాళ్ళను, వాళ్ళతో పాటు, ఈవిడ్ని కూడా వొదులుకోలేనన్నాడు. ఆవిడకు కోపం వచ్చి పుట్టింటికి వెళ్ళిపోయింది.

అతని విషయం ఊళ్ళో అందరికి తెలుసు. కాని అందరూ ఆవిడలా వెళ్ళి పోయినందుకు హర్షించలేదు వాళ్ళను వొదులుకోమని చెప్పలేదు కనీసం సలహా ఇవ్వలేదు. పైగా ఆవిడ్ని నిందించారు. 'మగవాడు—ఎన్ని పనులైనా చేస్తాడు. అలా అని ఆడది యిలా సంసారం, భర్తను వొదిలి పోతుందా? పతివ్రతేనా? ఆడదాని లక్షణమేనా?' అంటూ నోహ్...ఎన్నో అను కున్నారు. పాపం! ఆవిడ ఎంతో అభిమా నంతో వెళ్ళిపోయింది. కాని వాళ్ళ ఊళ్ళో కూడా అందరు ఆమెనే అనడంతో తిరిగి వచ్చింది. 'పతియె దైవము' అంటూ. చెప్పొద్దూ! నాకు బోల్డంత చిరాకు వేసింది' అంది కాత్యాయని నవ్వుతూ.

కాత్యాయని మాటలకు తను ప్రసాద్ నవ్వారు.

'మీరు చెప్పండి రచయితగారూ! మీరు రచయితలు సంస్కారం, హృదయం అంటూ రాస్తుంటారు కదా, నిజంగా మీ కథలో లాగె ఒకమ్మాయి తారసపడితె మీరు అంతా తెలిసి కూడా అలాంటమ్మాయిని పెళ్ళాడ తారా?' అంది సూటిగా చూస్తూ.

వెంటనే ఏం సమాధానం చెప్పాలో తోచ లేదు తనకు.

కాత్యాయని ఫక్కున నవ్వేసింది— 'రచ యితలైనా మీరు మగవారె. రాతలు చేతల వరకు వచ్చేసరికి మాసిపోతాయండి' అంది.

అంతేకాదూ 'మీరు ఉత్త రచయితలు. రాయడం తప్ప మరేం చేయలేనివారు' అంటూ కేవలం రాతల రాయుడిగా మార్చి వచ్చేసింది.

కాత్యాయనిని చేసుకునేవాడు అదృష్ట వంతుడు అనుకున్నాడు తను; కాత్యాయనిని చేసుకోవడం వల్ల వచ్చే అదృష్టం ఏమిటో తను నిజంగా అనుకున్నప్పుడు ఆలోచించ లేదు కాని...కాత్యాయని తనను ఆకర్షిం చింది.

అంతలోనే ఉద్యోగం తనకు ట్రాన్స్ ఫర్ ఆర్డర్ చేతిలో పెట్టి దూరంగా విసిరేసింది. ప్రసాద్ తో తన మనసులోని మాట చెప్పాలనుకున్న క్షణంలోనే—


'నేను నిజంగా ఉత్త ఫూల్ ప్రకాశం! చిన్నప్పటి నుండి కాత్యాయనిని వాడి కివ్వాలని అందరం అనుకున్నాం. నేనుకు కూడా కాత్యాయని అంటె చాలా ఇష్టం. మేనరికం వుందనే కాత్యాయనికి పెళ్ళి సంబంధాలు చూడక బి. ఏ వరకు చదివించారు పిన్ని, బాబాయ్! ఈ మధ్య వాడి మనసు తిరగ బెట్టింది. కాత్యాయనిని పెళ్ళి చేసుకోనంటూ చెప్పాడు. ఈ వేసవిలో కాత్యాయని పెళ్ళి ఎలాగు చేయాలనుకుంటున్నారు, పిన్ని, బాబాయ్, నువ్వు తప్పకుండా

రచయిత

వస్తావు కదూ!' అన్నాడు. ప్రకాశం తను ఊరు విడిచి వచ్చేరోజు.

తలూపాడు తను. చెప్పాలనుకున్న మాట రైలు కూతలో కలిసి పోయింది. తను రచయిత. కులం మతం లేదంటూ రాయగలడు. ఆచరించి చూపించగలడేమో! కాని... కాత్యాయని, తల్లి, తండ్రి—? ప్చ్... ఏ మూలో వున్న చిన్న కోరిక పెరికి పారేసాడు.

కాని...ఆ వేసవిలో కూడా కాత్యాయని పెళ్ళి జరగలేదు. ఎందుకో తనకు తెలియదు. కాత్యాయని ఎమ్. ఏ లో చేరిందని ప్రసాద్ ఉత్తరంలో రాసాకా, కాత్యాయని గురించి తనకేం తెలీదు. తిరిగి రెండేళ్ళకు



ప్రసాద్ ఉత్తరం రానాడు!—అదే— కాత్యాయని తనతో పెళ్ళికంగీకరించింది! తనకెంతో ఆ...శ్చ...ర్య...ం వేసింది. వేస్తోంది కూడా.

ప్రయాణపు బడలిక తీరేలా నిద్రపోయి సాయంత్రం నాలుగ్గంటలకు నిద్ర లేచాడు ప్రకాశం.

'ఒరేయ్! రేపు బాబాయ్ దగ్గరికి వెళ్ళి మాట్లాడదాం! పోతే—సాయంత్రం కాత్యాయని వస్తుంది. నీ యిష్టం ఏమిటో! ఏదైనా మాట్లాడాలని వుంటే మాట్లాడెయ్!' అంటూ ఉదయం రైలు దిగి యింటికి రావటంతోనే సరోజకు తన నప్పగించి, మరేం అడగకుండానే ఆఫీసుకు వెళ్ళిపోయిన ప్రసాద్ మాటలు గుర్తుకొచ్చాయి.

ప్రకాశం మొహం కడుక్కుని వచ్చేసరికి సరోజ కాఫీ అందించింది.

'వాడెప్పుడు వస్తాడూ ?' అన్నాడు ప్రకాశం.

'ఆరు దాటుతుందన్నయ్యా !' అంది సరోజ. అప్పుడే వరస కూడా కలిపేసి ఎంతో కలుపుగోలుగా మాట్లాడే సరోజను చూస్తుంటే ముచ్చట వేసింది ప్రకాశానికి.

కాఫీ త్రాగి బట్టలు వేసుకుంటుండగా కాత్యాయని వచ్చింది. ఎందుకో ఆశ్చర్య పోతూ పలకరించింది. కాసేపు ఏదేదో మాట్లాడాక, పార్కుకేసి బయలుదేరా రిద్దరు.

దారి వెంట ఎంతో మౌనంగా వుంది కాత్యాయని. దీర్ఘంగా ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వెంట వస్తున్న కాత్యాయని అర్థం కాలేదు ప్రకాశానికి.

'కాత్యాయనికి తనంటే ఇష్టమేనా ?' అన్న ప్రశ్న మనసును పీకుతుంటే సంకోచించకుండా అడిగాడు ప్రకాశం.

'నా అభిప్రాయం కనుక్కొన్నే అన్నయ్య వుత్తరం రాసాడు. మీరు వస్తారని నేను అనుకోలేదు. వచ్చారు. ముందు మీ యిష్టం చెప్పండి' అంది.

'ఇష్టం లేకపోతే వచ్చేవాణ్ణి కాదు కాత్యాయని. నా కభ్యంతరం వుంటుందని మీరెందు కనుకుంటున్నారూ ?' అన్నాడు ప్రకాశం. కాత్యాయని చిన్నగా నవ్వింది.

'రచయితగారూ! ఒకనాడు రాసిన కథలోని పాత్రే ఎదురుపడి జీవితంలో ఆడు

సంఘటనగా, సవాలుగా ఎదురు నిలవటం అదృష్టమంటారా? లేక దురదృష్టమంటారా?' అంది.

'రెండు కావు. పరీక్ష అంటాను.' అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

'రచయితగారూ! నిజంగా నేను సీరియస్‌గా అడుగుతున్నాను.' అంది కాత్యాయని సూటిగా చూస్తూ.

'జవాబు నవ్వుతూ చెప్పినంత మాత్రానా సరైన జవాబు, కాకపోతుందా కాత్యాయనీ?' ప్రకాశం ఎదురు ప్రశ్నించడంతో మౌనం వహించింది కాత్యాయని.

'నేను బి. ఏ. సెకండియర్‌లో వుండగా భాస్కరంతో పరిచయం అయింది' అంది కళ్లెత్తి ప్రకాశం వంక చూస్తూ.

'ఊఁ...తరువాత!' అన్నాడు ప్రకాశం మమూలుగా.

'నేను భాస్కరాన్ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాను.'

'కాని పెళ్ళి జరగలేదు.'

'అవును. బావతో నా పెళ్ళి చిన్నప్పుడే స్థిరమైందంటూ నాన్న అమ్మ ఎంతగానో చెప్పారు. కాని నేను వినలేదు. కాని...వాళ్ళనెదిరించి నన్ను పెళ్ళి చేసుకోవడానికి ధైర్యం లేకపోయింది భాస్కరానికి. పాతికేళ్లొచ్చినా, పసిపాపయిలా అమ్మ ఒడిలో పడుకొని గారాలు పోయే భాస్కరం ఆ అమ్మగారే వద్దన్నారని చెప్పాడు. నేను బాధపడలేదు.'

'చివరికి బావను చేసుకుంటాననే అమ్మతో చెప్పాను. కాని ... భాస్కరంతో వున్న నా పరిచయం బావకు తెలిసింది. నేను కూడా అంతా చెప్పాను. కాని... బావకు నా మీద నమ్మకం లేకపోయింది. పెళ్ళి కంగీకరించలేను.' అంటూ నవ్వింది. బిత్తరపోయాడు ప్రకాశం.

సరిగ్గా ఆ సమయంలోనే మీ కథ పడింది. మీ కథ చదివాకా నా కెందుకో నవ్వు వచ్చింది. అందుకే వాస్తవంగా లేదన్నాను. నిజం చెప్పినా బావ నన్ను నమ్మలేదు. కాని మీ కథలో స్త్రీకి వున్న సంస్కారం, నిజాయితీని మెచ్చుకొని పెళ్లి చేసుకునే మగవాడిని చూసాకా, మగవాళ్ళు కథల్లో తప్ప నిజ జీవితంలో ఎదగలేదన్నాను' అంది.

రెండునిమిషాలవరకు మౌనంగా కూర్చున్న కాత్యాయని వరిక కుతూహలంగా చూస్తూ 'ఊఁ...' అన్నాడు ప్రకాశం.

'నేను కథ చెప్పటంలేదు' అంది కాత్యాయని. చిరాకు పడుతున్నట్లుగా.

'అవును. నిజం చెప్పావు కాత్యాయనీ' అన్నట్టు ఇందాకా పరీక్ష అన్నాను కదూ! రిజల్టు ఏమిటో చెప్పనా?' అన్నాడు చిలిపిగా చూస్తూ. కాత్యాయని ఆశ్చర్యంగా చూసింది.

'నేను గెలిచాను కాత్యాయనీ.' అన్నాడు ప్రకాశం ఉత్సాహంగా.

'ప్రకాశంగారూ! ఇది పెళ్లి, రెండు ముడిపడే జీవితాల సమస్య. మొహమాటం అంటూ ... సీరియస్‌గా అనబోయింది కాత్యాయని.

'నో...జీవిత సమస్య అనే, మామూలు మనిషికన్నా, రచయితగా నేను ఎక్కువ ఆలోచిస్తానే కాని మొహమాటానికి చోటు లేదు కాత్యాయనీ. మీ మీద నాకు నమ్మకం వుంది' అన్నాడు ప్రకాశం నిశ్చలంగా.

'ఉహుఁ' అంటూ కాత్యాయని అందంగా నవ్వింది. ఆమె నవ్వు ఏదో ఊహ రేపగా ఏదో ఊహించుకుంటూ, ఊహల్లో తేలిపోతూ, కొత్త కథకోసం ప్లాటు వెతుక్కుంటూ పరధ్యానంలో పడిపోయాడు రచయిత ప్రకాశం. ●

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

ఎస్. కె. కె, కందుకూరు

మాంసం, మగువ మదిరాస క్త్తై త్రాగుతూ హరే రామ హరే కృష్ణ అంటూ గంతులేస్తూ నేటి యువతరం హిప్పీతరం ఎందుకిలా తయారైంది?

కొంపల్లో ఆదరాభిమానాలు, సంఘంలో రక్షణా లేక. పాత కొత్తల మేలు కలయిక వల్ల ఏర్పడ బోయే కొత్తతరానికి, సంప్రదాయాలకీ, సంకుచితత్వాలకీ, కట్టుబడిపోయి స్వేచ్ఛగా వూపిరికూడా తీసుకోనివ్వని పెద్ద తరానికీ మధ్య తెగించి తలెత్తిన యీ కల్లోలం మీద అక్రమాన్ని అంగీకరించి నిష్పక్షపాతంగా తెలియ చెప్తున్న సంధి తరమే—హిప్పీ తరం.

డి. ఎ. కె, సిరిపూర్

ఈ రోజుల్లో చెప్పు వేస్కొనే అమ్మాయిలపై మీ ఉద్దేశ్యం ఏమిటి?

ఇదికానయం ఆనంద కుమారా! రెండు పూటా భోజనంచేసే అమ్మాయిల మీద నా ఉద్దేశ్యం అడిగావు కాదు. (చదువు కున్న అమ్మాయిల్లాగే వీళ్ళా చెడ పోతారా? అని అడగాలని కబోలు—తాత్పర్యం. అవునా?)

పి. వి. ఎస్. వి, ఏలూరు

ఈ మధ్య ఇక్కడ శ్రీమతి లతను పిలిచి మీటింగు పెట్టారు. ఆమె తాను విశ్వనాథ వారి శిష్యురాలనని చెప్పుకుంటూ ఆయనకి రెండింతలు అహంభావాన్ని ప్రదర్శించింది. అసలు ఒక రచయిత్రికి ఎంత గొప్పదైనా ఇంత అహంకారం వుండవచ్చా?

ఎంత అహంకారం వుండొచ్చునో—సోనీ మీరే చెప్పండి సోదరా, లత, పులిపిల్ల. అలా మాట్లాడితేనే భరించకలం. లేకుంటే యిదేమిటి లతకేమైంది? అని మీరే బాధ పడేవారు.

కె. ఎమ్. వి, పాత గుంతకల్లు

ఎదుటివారు బాగుపడేది చూసి ఏడుపెందుకు అక్కగారూ.

అచ్చం తెలుగువాడిలా చెడగొట్టడానికి పోపుల్లి వేయకుండా వుంటే చాలు బ్రదర్.

కె. ఎస్. పి, భీమవరం

జీవితం చేదుగా ఎప్పుడుంటుంది? అప్పుడు ఏం చేస్తే బాగుంటుంది?

ఎదుటివాడి జీవితం పచ్చగా తోచినప్పుడల్లా మన జీవితం చేదుగానే తోస్తుంది! ఆ చేదు దిగమింగడం అలవాటు చేసుకోవాలి.

ఎం. జె, కల్యాణి ఖని

నవ్వే ఆడదాన్ని ఏడ్చే మగవాడిని నమ్మవద్దంటారు నిజమేనా?

నిజమే. నవ్వుతూ— ఆడది గొంతుకోయకలదు, ఏడుస్తూ— మగవాడూ గొంతుకోయకలడు!

డి బి. ఆర్, మామిడిపల్లి

కలం గొప్పదా? బలం గొప్పదా?

సూటిగా చంపడానికి బలం, చాటుగా చంపడానికి కలం — గొప్పవిగా తోస్తాయి తమ్ముడూ.

ఎ. డి, పెనుగొండ

మా అమ్మాయికి మీపేరు పెట్టాము. మీరుపంపే బహుమానం త్వరగా పంపిస్తారు కదూ?

నా పేరు కాపీరైటు కాదు దేవసేనా, అందేత ఎవరేనా పెట్టుకోవచ్చు!

జె. వి. ఆర్, హైద్రాబాదు

విదేశాలలోగాని మనదేశంలో అబార్షన్ చట్ట సమ్మతం చేయడం— సంప్రదాయ విరుద్ధం. నాతో మీరు ఏకీభవిస్తారు కదూ?

ఏకీభవించాలనే వుంది రావుగారూ, కాని లెక్కలు ఒప్పుకోనివ్వడంలేదు. గత సంవత్సరంలో —వివాహిత అవివాహిత స్త్రీలలో ఎబార్షన్ లెక్కలు ఢిల్లీలో అత్యధికసంఖ్యలో వున్నాయట. 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ ఆక్టు' కింద యివన్నీ జరిగాయట. ఇక, ఢిల్లీలో 96 గురు పశ్చిమబెంగాల్‌లో 77, ఆంధ్రాలో 50 —మంది— యీ చట్టాన్ని చేపట్టారు! అందేత సంప్రదాయం ముసుగుకింద చాటుగా చేసే పనికంటే వైద్యసలహా మేరకు యిలా పబ్లికుగా జరగడమే మంచిదనిపిస్తుంది. దొంగతనంగా కడుపులు తీయించుకుని — చచ్చిపోయిన వాళ్ళు ఎందరోవున్నారు. ఇప్పుడా భయం తొలగింది.

వై. ఎస్. ఆర్, అనంతపురం

నేనిప్పుడు పదవ తరగతి పాసయ్యాను. మావాళ్ళు పెళ్ళిచేస్తా మంటున్నారు...

ఇంతకీ నువ్వెన్నేళ్ళ వచ్చాక— పాసయ్యావు యీ పదవతరగతి? తమ్ముడూ,

కె ఆర్., కె. జె., కె. ఎస్. కె. ఎమ్, కాజూరు

కొంతా కనకాలు చాలా ప్రమాదం అని అంటారు?

నిజమే కావచ్చు. కాని ఆశలేని జీవితం కూడా నిస్సారం అంటారు కదా!

మీకు భగవత్సాక్షాత్కారం వచ్చిందని ఎవరో చెప్పగా విన్నాం నిజమేనా?

ఏం? రాకూడదా?!

రచనలనుబట్టి రచయిత వుద్దేశాలను, ఆశయాలను మనం తెలుసుకోవచ్చునా?

కొంతవరకు.

మానవులలో సమానత అనేది ఎప్పుడు వస్తుంది?

చచ్చిపోయాకనే — సమానత్వం — అంతా అయేది ఒకటే మట్టి కనుక.

మీరు నిజంగా సహనశీలులు.

ఈమాట పెద్దక్షరాలతో రాసి పంపించండి దీదీస్, ఫ్రేము కట్టించి మావారికి ప్రెజెంట్ చేస్తాను. అప్పుడేనా నేను చాలా శాంతమూర్తిని అంటే నమ్ముతారేమో చూద్దాం.

పి. వి. ఆర్, హైద్రాబాదు

నేను ఒకదేవతను ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాను. కాని యింటికి వచ్చాక ఆమె తండ్రి పోయాన్న పవిత్రమైన మంగళసూత్రాన్ని తెంపి పంపించి వేశాడు. నేను యింకొక స్త్రీని వివాహం చేసుకున్నాను. నేటి సమాజంలో ఎంతటి దారుణాలకు వెనకాడరు మూర్ఖ పెద్దలు...

పాపం. పెద్దలనెందుకు తమ్ముడూ తిడతావు? నువ్వాదేవత కోసం పోట్లాడావా? వైరాగ్యం చేపట్టావా? హాయిగా మళ్లి యింకో స్త్రీని పెళ్ళి చేసుకున్నావు. మీ కుర్రకారుతో వచ్చిన చిక్కే యిది. ప్రేమంటే ఏమిటి అనుకుంటున్నావ్: దొంగతనంగా పెళ్ళిచేసుకోవడం అనుకుంటున్నావా? ఒద్దన్నంత మాత్రాన పెద్దలను తిట్టడం అనుకుంటున్నావా? —ప్రేమంటే రెండూకాదు తమ్ముడూ— ప్రేమించి పెళ్లి చేసుకోవడం అంటే— బాధ్యత తెలిసి పెళ్ళి చేసుకోవడం. 'మేం ఒంటరివాళ్ళం అయిపోయినా — ధైర్యంగా బ్రతగ్గలం' అన్న నమ్మకంతో కలిసి జీవితం ప్రారంభించడం. అంతేగాని దొంగతనంగా కట్టిన పుస్తె కాదు ప్రేమ.

ఎమ్. ఎల్. ఆర్, విజయవాడ

హాస్య రచనలంటే ఎందుకు అంతా యిష్టపడతారు?

హాస్యం బలవంతపు కౌగిలి లాంటిది బ్రదర్ కితకితలుపెట్టి యిష్టం వున్నా, లేకున్నా నవ్వుబయట పడేస్తుంది!

ఎమ్. హెచ్, కరీంనగరు

సంఘ వ్యతిరేక శక్తుల్ని యువతరం ప్రతిఘటించి సమాజమునుంచి వెలివెయ్యవలసిన రోజులు ఎప్పుడు రాగలవు. కె. రా?

రావు హనుమంతూ, ప్రతిఘటించ వలసిన యౌవనభరం కూడా ఆ సమాజానికి చెందినదేకదా.

అక్కయ్యగారూ!

పవనతనయ



రాక రాక చాలా కాలానికి తమ యింటికొచ్చిన సుభద్రమ్మతో యేవేవో కబుర్లు చెప్పుకొంటూ కూచుంది సావిత్రి.

'చాలా రోజుల్నించి మా యింటికి రావడం మానేశావ్ సావిత్రీ! ఓసారి రా! ఇంట్లో కూచుంటే, విసుగు పుట్టదూ! వారానికో సారయినా కాళ్ళు కదుపుతూ వుండాలి...' అంది సుభద్రమ్మ.

సుభద్రమ్మ, హైస్కూలు హెడ్ మాష్టారిగారి సతీమణి. సావిత్రికి దూరపు బంధువు కూడాను. చాలా కలుపుగోలుగా వుంటుంది. ఆమెను చూస్తుంటే, లక్ష్మీ దేవిని సమక్షంలో చూస్తున్నట్టే వుంటుంది. అందుకే, సావిత్రికి సుభద్రమ్మంటే, యెనలేని గౌరవం, అభిమానమూను. ఆమెతో మనసు విప్పి మాట్లాడేస్తూ వుంటుంది.

'ఏమిటో పిన్నిగరూ, యెప్పుడూ తీరిక చిక్కదు. పిల్లల బట్టలు కుట్టుకుంటూ కూచోవడమో, పప్పు రుబ్బడమో, మా వారి షర్టులకి, పేంట్లకి విరిగి పోయిన గుండీలు తీసి, కొత్త గుండీలు వేయడమో, లేకపోతే యేదో పుస్తకం చదువుకోవడమో... ఇలాగే కాలం గడిచిపోతూ వుంటుంది. అదీగాక, యెక్కడికయినా బైలుదేరాలంటే, ఇంటికి తాళం వేసుకు వెళ్ళాల్సిందే! అంటే, ఆరట్లో యే వస్తువూ లేకుండా, అన్నీ యింట్లోకి చేర్చి బైలుదేరితే తప్పించి, మరో మార్గం లేదు. ఆ వోపిక లేక, యెక్కడికీ బైలుదేరడమే మానుకున్నాను.' అంది మెల్లగా మందహాసం చేస్తూ.

'అలాగనుకొని ఇంట్లో కూచుంటే, స్నేహాలు, బంధుత్వాలు, యెట్లా సన్నిహిత మౌతాయమ్మా? ఏదో వీలు చూసుకొని వస్తూ వుండాలి గాని...'

'అలాగే పిన్నిగారూ! వో రోజు వీలు చూసుకొని వస్తాన్లెండి...'

'పిల్లల్ని తీసుకుని రా...'

'అలాగే!'

వీళ్ళిలా మాట్లాడుకుంటూన్న తరుణంలో నాటకంలోని పాత్ర రంగస్థలం మీదికొచ్చినట్టుగ 'అక్కయ్యగారూ, యేం చేస్తున్నారు?' ద్వారం దగ్గర్నించే సరాగంతో అనుకుంటూ వచ్చింది కాంతం.

'రండి కాంతంగారూ! సుభద్రమ్మ పిన్ని

అక్కయ్యగారూ!

గరాస్తేనూ మాట్లాడుతూ కూచున్నాను. మీరూ కూచోండి...' అంది సావిత్రి.

సుభద్రమ్మ కాంతం కేసి విప్పారిపాటు చూసి, అంతలోనే విస్తుపోయి, కనుబొమలు ముడుచుకుంటూ ఆలోచనలో పడింది.

'కూచుందుకు నాకు తీరిక యెక్కడుంది అక్కయ్యగారూ! ఇంటి చాకిరితోనే రోజంతా గడిచిపోతోంది. పంచదారుంటే, వో గ్లాసుడు బదులిద్దురూ! సాయంత్రం తెప్పించి యిచ్చేస్తాను. కరువుకి తోడు, పంచదార ఖర్చు యెక్కువైపోతుంది ... ఏమిటో!' గడగడా మంచినీళ్ళు తాగినట్టు చెప్పుకుపోయింది కాంతం.

సావిత్రి, కాదనలేక పోయింది. కాంతంకి యేదో ఒకటి అప్పుగా తీసుకుపోతూండటం. పరిపాటయ్యిందని సావిత్రి మనస్సులో అనుకున్నా, లేదనే మనస్తత్వం కాదు గాబట్టి లేచింది.

'కూచోండి పిన్నిగారూ, యిప్పుడే వచ్చేస్తాను...' అంటూ వంటగది కేసి దారి తీసింది సావిత్రి. కాంతం, ఆమెను అనుసరించింది.

కాంతం వెళ్ళాక తిరిగొచ్చింది, సావిత్రి.

'ఈవిడ హెల్తు ఇన్స్పెక్టరుగారి భార్య కదూ సావిత్రీ!' ప్రశ్నించింది, సుభద్రమ్మ.

'ఔను పిన్నిగారూ! పేరు కాంతం...'

'వాళ్ళకేం తక్కువని అప్పుకి బైలుదేరింది?'

సావిత్రి మెల్లగా మందహాసం చేసింది.

'తక్కువని కాదు పిన్నిగారూ! డబ్బు కూడబెట్టాలన్న యావ ఒక పక్క పీకుతుంటే, డబ్బు ఖర్చు బెట్టడానికి భయమేస్తుంది వీళ్ళకి. అందుకే, యిలా అప్పుకని బైలుదేరడం ఒక అలవాటుగా చేసుకున్నారు. మరి కాస్సేపటికి, యే ధనియాలో కాఫీపొడో, అడగడానికొస్తుంది...' అంది.

సుభద్రమ్మ ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది.

'ఇది మరీ విడ్డూరంగా వుంది. ఏదో అవసరానికి ఎప్పుడో అప్పుకని బైలుదేరతాం గాని, ఆ అవసరం అనుక్షణం అంటే యెట్లా? అలా అడగడానికి అభిమానం అడ్డురాదో యేమిటోమరి! అటువంటప్పుడు యెవ్వరైనా నిర్మొహమాటంగా వున్నా లేదని చెప్పేస్తే అకాస్త రోగం కుదురుతుంది.'

'అలా చెప్పడానికి యెందుకో మనస్కరించదు పిన్నిగారూ! అబద్ధం చెప్పడమంటే, యేదో తప్పు చేసినట్టుంటుంది!'

సుభద్రమ్మ ఓ నిట్టూర్పు విడిచింది.

'నీ సంజాయిషీ మరీ బావుందమ్మాయ్... అదిగో, అటువంటి నీ బలహీనత కనిపెట్టే, ఆవిడ నీ యింటిమీద పడుతోంది! ఔనూ, నాకు తెలీక అడుగుతాను—నిన్ను ఆవిడ 'అక్కయ్యగారూ' అని సంబోధిస్తుందేమిటి? నీ వయస్సెంత? ఆవిడ వయస్సెక్కడ? రేపోనాడో, అత్తగారు కాబోతోందేమో! అటువంటి వ్యక్తి నిన్ను 'అక్కయ్యగారూ!' అని సంబోధిస్తుంటే, నువ్వెట్లా సహిస్తున్నావూ అంట!' అంది సుభద్రమ్మ.

సావిత్రి, సౌమ్యంగా నవ్వేసింది. ఈ ప్రశ్న ఆమధ్య భర్త కూడా వేశారు. కాని యేం చేస్తుంది తను?

'పోనీలెండి పిన్నిగారూ! అందరూ ఒక్కలా వుండరు. కొందరి మనస్తత్వాలు, చాలా చిత్రంగా వుంటాయి. అటువంటి వారిలో కాంతం ఒకరనుకుందాం. నిజానికి, ఆమె తాను వయస్సులో చిన్నదిగా చెలామణి అవ్వాలని అభిలషిస్తూ వుందేమో! నన్నేకాదు లెండి...చాలామందిని అట్లాగే సంబోధిస్తుంది. ఈ సంబోధనతో ఆమె సంబరపడుతూ వుంటే, తృప్తి చెందుతూ వుంటే, ఆమె సంతోషాన్ని మనమెందుకు చెదరగొట్టాలి చెప్పండి? ఆ సంబోధన వల్ల మనకొచ్చిన నష్టమేం లేదుగా!' అంది సావిత్రి మందహాసంతో.

సుభద్రమ్మ, సావిత్రి సహనాన్ని, ఆమె ఔదార్యాన్ని, మనసులో అభినందించుకుంది.

'అయితే, నేనూ నిన్ను 'అక్కయ్యగారూ.' అని సంబోధిస్తాననుకో. అప్పుడూ 'నాకేం' అని వూరుకుంటావా?' నవ్వుతూ అందామె.

సావిత్రి యీసారి నిండుగా నవ్వేసింది.

'అలా పిలవడంలో మీకు తృప్తివుంటే, నాకేం అభ్యంతరం చెప్పండి? అయినా, మీరు ఆత్మవంచన చేసుకోలేరుగా!'

'అదీ నిజమేలే! ఆత్మవంచన చేసుకోవడం, అందరికీ చాతకాదు. సరే, ఇక

విషయంలో నీకేం నష్టం కలిగేటట్లు? నాకే కష్టమనిపిస్తోంది...'
అంతవరకూ బాగానేవుంది. కానీ, చీటికి మాటికీ యేదో ఒహ వస్తువు అప్పుగా తీసుకెడుతూ వుంటే, అలా యిస్తూ వుండటంలో నీకు నష్టం లేదంటావా ?' సూటిగ సావిత్రి మొహంలోకి చూస్తూ అందామె.

చప్పున జవాబు చెప్పలేక పోయింది సావిత్రి. ఔనుమరి ! ఏం జవాబు చెబుతుంది ? కాంతం అప్పు తీసుకెళ్తున్న విషయంలో తాను నష్టపోవడం లేదని, యెట్లా ఖచ్చితంగా చెప్పగలదు ? పచ్చిమిరపకాయలని, కరివేపాకని, తాళింపు గింజలని...యీరకం వస్తువుల్ని అప్పుగా తీసుకెళ్తే, వాటిని యెవరూ తిరిగి యివ్వరు. ఇచ్చినా, పుచ్చుకోవడం సబబుగా వుండదు. వెలపొడుగునా అలా తీసుకునే పద్ధతి అయితే, అదీ ఒక నష్టమేగా యిచ్చేవాళ్లకి !

'అంతగా నష్టపోయేదేమీ వుండదు లెండి పిన్నిగారూ. కరివేపాకు, పచ్చిమిరప, యిటువంటివేవో తీసుకెళ్తే, మనం తిరిగి అడగలేం కూడాను...అదో పెద్దనష్టం జాబితాకి రాదు కదండీ !'

సుభద్రమ్మ నవ్వింది. సావిత్రి అమాయకత్వం, యిప్పుడు పూర్తిగ ఆమెకి అవగాహన అయ్యింది.

'నీ అమాయకత్వం చూస్తుంటే; నాకెంతో జాలేస్తోంది సావిత్రీ: ఇట్లా నీ దగ్గర్నించి యేదో ఒహటి అప్పుగా తీసికెళ్తుండటం మూలాన వాళ్లు యే కొద్దిపాటి లాభమైనా పొందాలనేగా. యిదో అలవాటుగా పెట్టుకుందా కాంతం ? ఈ విజాన్ని నువ్వెందుకు గ్రహించవు? పోనీ, నువ్వడిగినప్పుడమైనా, ఆవిడ యిస్తోందా?'

'నేను అడగడమంటూ సాధారణంగా వుండదు పిన్నిగారూ !'

'అయితే, యీ వన్‌వే ట్రాఫిక్ ఆరోగ్యకరం కాదు సావిత్రీ: నీకు అనుభవం లేకపోయినా, పెద్దదాన్ని చెప్తున్నాను ఆలోచించు. 'అక్కయ్యగారూ !' అంటూ ఆమె మురిపెంగా సంబోధించేసరికి, నువ్వు మురిసి పోతున్నట్టున్నావు. అసలు, అటువంటి పొగడ్తలకి దూరంగా వుంటేనే మంచిది. అదీగాక, నువ్వు ఆవిడచేత 'అక్కయ్యగారూ !' అని పిలిపించుకోవడం, నాకే కష్టమనిపిస్తోంది...'

'అదికాదు పిన్నిగారూ !'

'నువ్వు పిలిపించుకోవడం లేదు...ఆవిడే పిలుస్తుందంటావు, అని నాకూ తెలుసు, అయితే, నువ్వా సంబోధన్ని వారించేంతవరకూ, నీ సుముఖత కూడా వుందని అనుకోవడంలో తప్పులేదు. ఏమైనా నువ్వు జాగ్రత్తపడాలి. ఓసారి గట్టిగా అడిగేసెయ్. అక్కడితో, అట్లా సంబోధించడం మానేయడమేకాదు... ఈ అప్పిచ్చే బాధ కూడా తగ్గొచ్చు' సలహా యిచ్చింది, సుభద్రమ్మ.

చాలా యిరుకున పడ్డట్టుగా మొహం పెట్టింది. సావిత్రి.

'అంత నిష్కర్షగా చెప్పలేను పిన్నిగారూ' అంది, మెల్లగా.

సుభద్రమ్మ తేలిగ్గా ఓ నిట్టూర్పు విడిచింది.

'నా తెలివిగాని నీకు అంత ధైర్యం యెట్లా వస్తుంది? సరేలే... ఇదేదో నేను చూసుకుంటాలే ... సమయం రాకుండా పోతుందా ? మరి, నే వెళ్తొస్తా...' లేచింది, సుభద్రమ్మ.

'మంచిది పిన్నిగారూ!'

'నువ్వోసారి రా...'

'అలాగే!'

సుభద్రమ్మను గుమ్మందాకా సాగనంపి తిరిగొచ్చింది సావిత్రి. ఆమెకి అర్థం కాలేదు, సుభద్రమ్మ యేం చేయబోతోందో!


* * *

శ్రావణ శుక్రవారంనాడు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకుంటున్న సందర్భంలో ముత్తయిదువుల్ని ఆహ్వానించింది సావిత్రి. అలా వచ్చినవారిలో, సుభద్రమ్మ, కాంతం కూడా వున్నారు.

పూజానంతరం, యెవరైనా మంగళ హారతి పాడండంది సావిత్రి. అదే అనువైన అదనుగా తోచింది సుభద్రమ్మకి.

'కాంతం అక్కయ్యగారూ, మీరు పాడండి ... మీ పాట వినాలని యెన్నాళ్ళనించో కుతూహలంగా వుంది' అంది సుభద్రమ్మ.

అక్కడున్న ముత్తయిదువుల్లో సుభద్రమ్మే వయస్సులో పెద్ద. అటువంటి సుభద్రమ్మ కాంతంని 'అక్కయ్యగారూ!' అని సంబోధించడం, అందరికీ ఆశ్చర్యం కలిగించింది. కొందరు, కాంతం రోగం కుదురుతుందన్న సంతృప్తిని, పిండు



కున్నారు మనసులో. సావిత్రికి అప్పుడర్థమయ్యింది, ఆ రోజు సుభద్రమ్మ అన్న మాటలకి అంతరార్థం.

ఇహ పోతే, కాంతం పరిస్థితి వర్ణనాతీతం. ఏటువంటి సూచనలూ లేకుండా పెనుతుఫాను వచ్చినట్లయ్యిందామెకి. ఆమె మొహం పాలిపోయింది. ఒక పక్క కోపం పెల్లుబుకుతోంది. అయితేనేం— అంతమంది సమక్షంలో; అదీ పూజా సమయంలో కోపం తెచ్చుకుని నాలుగు మాట్లాడ్డం సమంజసంగా, సబబుగా వుండదని వోసారి మనసులో అనుకుని, తమాయించుకుంది.

'ఏమిటండీ పిన్నిగారూ, నన్ను మీరు 'అక్కయ్యగారూ!' అని సంబోధిస్తున్నారు?' అంది, కోపాన్ని అణచుకుంటూ. అయినా, ఆమె మొహంలో కొత్తగా చోటు చేసుకున్న యెరుపురంగు తేటగా అగుపిస్తూనే వుంది.

'తప్పేముందండీ?' అదేం అసమంజసంగా లేదన్నట్లు, సబబుగానే వుందన్నట్లుగ, మామూలు ధోరణిలో యెదురు ప్రశ్న వేసింది, సుభద్రమ్మ.

అక్కయ్యగారూ!

కాంతంకి వొళ్ళు మండింది. 'మీరు పెద్దవాళ్ళయ్యుండి అట్లా అనడం బాగు లేదు పిన్నిగారూ: మీ వయస్సెంత? నా వయస్సెంత చెప్పండి! మీ కంటె నేను యెన్నో యేళ్లు చిన్నదాన్ని. మీరు నన్ను 'అక్కగారూ' అని సంబోధించడం, భావ్యంగా లేదు...' అంది విసురుగా, కాంతం.

సుభద్రమ్మ కోపం తెచ్చుకోలేదు. నవ్వుగా మందహాసం చేసింది.

'మరవుతే, సావిత్రి మీ కంటె వయస్సులో చిన్నది కాదా? ఆమెని మీరు 'అక్కయ్యగారూ:' అని యెట్లా సంబోధిస్తున్నారు? మీ విషయంలో పేర్కొన్న యీ తర్కం ఆమె విషయంలో మీరు విస్మరించారా? మీరిప్పుడు బాధపడినట్లు, కోపగించుకున్నట్లు, సావిత్రి బాధపడదనీ, కోపం తెచ్చుకోదని మీరెట్లా అనుకున్నారు! నియమం అన్నది, అందరికీ ఒకటే కదా!' అంది సుభద్రమ్మ.

కాంతం నిర్విణ్ణపోయింది. ఆమె నోట మాట రాలేదు. కాంతం ఇరుగుపొరుగు వాళ్ళు; సుభద్రమ్మ చొరవకి యెంతగానో మురిసిపోయారు. ఇటువంటి రోజు యెప్పుడొస్తుందా అని వాళ్లు యెదురు చూస్తున్నారాయె. ఆరోజు వచ్చేసరికి ఆనందం కాదూ మరి!

'బాగా అడిగారు పిన్నిగారూ! ఆమె కంటె వయస్సులో మేం చిన్నవాళ్ళమే అయినా, మేం ఆమెకి అక్కయ్యలం...' నవ్వుతూ అంది, కాంతం పొరుగావిడ సరోజ.

సావిత్రికి కంగారు పట్టుకుంది.

'పోనీలెండి పిన్నిగారూ! ఇప్పుడవన్నీ యెందుకు లెద్దురూ! కాంతంగారూ, ఓ మంగళహారతి పాడండీ!' అంది, అక్కడితో ఆ ప్రసక్తావనకి స్వస్తి చెబుతూ.

కాంతం మూతి విర్చుకుంది. ఆమె కళ్లు చింతనిప్పుల్లా మెరుస్తున్నయ్.

'పాడించావు కదమ్మా. మంగళహారతి! ఇంక నేనెందుకు పాడ్డం...? ఆమెనే పాడమను...' వుడుకుమోత్తనంగా అంది. సావిత్రే దీనికంతటికీ కారణమని ఆమె వూహ.

సావిత్రి బాధపడింది.

'కంగారుపడకు సావిత్రీ! నేనే పాడతానే!' అంటూ సుభద్రమ్మ యెంతో శ్రావ్యంగా మంగళహారతి పాడింది. ఆమె మధురగానాన్ని, అక్కడున్న వాళ్లందరూ (కాంతం మినహా) ప్రశంసించారు.


ఆరోజు జరిగిన అవమానం, కాంతం జీవితంలో యెప్పుడూ మర్చిపోలేదు. ఆమెకి లోలోన అక్కడున్న వాళ్లందరిపై, ముఖ్యంగా సావిత్రి, సుభద్రమ్మలపై కసి యేర్పడింది. కాని, యేం చెయ్యగలదు? ఫలదానం తీసుకొని, యెవ్వరికీ చెప్పకుండానే జారుకుంది విసురుగా.

అందరూ నవ్వుకున్నారు, యేకకంఠంతో.

'మరెప్పుడూ నన్ను 'అక్కయ్యగారూ!' అని సంబోధించకులే సావిత్రీ:' వెళ్లిపోతూ అంది, సుభద్రమ్మ.

నిజమే! ఆ రోజునించీ అటువంటి సంబోధన కాంతం నోట రాలేదు. అంతే కాదు—సావిత్రి యింటికి అప్పుక రావడమూ తగ్గిపోయింది.

'బతికాం...' అనుకుంది తృప్తిగా, సావిత్రి. మనస్సులో సుభద్రమ్మకి కృతజ్ఞత తెలుపుకుంది. ●



'మోహినీ భస్మాసుర' లేక అంతుచిక్కని అందాల రాశి గాథ

—ఫోలాక్షపదని

18 వ తేదీ బొంబాయినుంచి బెంగళూరు వో మంత్రిగారిని చూడవచ్చినవో అమ్మాయిని ఆ మంత్రిగారొక బుల్లిపోలీసు వుద్యోగి సహాయంతో బలవంతంగా బెంగళూరులోవున్న "ఆశానికేతన్" అని వో ఆశ్రమానికి తరలించుట — ఆ తరువాత ఆమె అంతర్ధానమగుట — మర్మమేమి అవటాని 22 వ తేదీన బెంగళూరులోని వో కన్నడ పత్రికలో వచ్చినవార్త మైసూరు రాష్ట్ర ప్రభుత్వ ఉభయసభలనూ వూపేసింది.

అట్టి మంత్రిగారి వద్దనుంచి వెంటనే రాజీనామాను పొంది గవర్నరుకు ముట్టజెప్పడం ముఖ్యమంత్రి విద్యుక్త ధర్మమని కొందరు హితవుచెప్పారు. మాయమైన ఆ మగువ వివరాలను, విషయాలను వెంటనే పరిశోధించి సభకు ముఖ్యమంత్రిగారు విన్నవించితీరాలని కొందరు తీర్మానించారు. అసలు ఈ చర్యవల్ల మంత్రులంతా ... ముఖ్యమంత్రితోసహా తమ తమ పదవులకు రాజీనామాలిచ్చి తీరాలని కొందరభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని పెరగనివ్వరాదని ముఖ్యమంత్రి అణచ ప్రయత్నించడంలో విషయం మరింత పెద్దదయ్యింది. వ్యభిచారిణితో సంబంధం పెట్టుకుని, పదవినే పోగొట్టుకున్న బ్రిటిష్ మంత్రి లార్డ్ ప్రొఫ్యూమోతో ఈ మంత్రిగారిని పోల్చిచూడాలని కొంతమంది వుత్సాహపడ్డారు. ఆ రోజూ, ఆ మర్నాడూ కూడా ఈ విషయం శతవిధాల పెరిగక, 24 వ తేదీకి ఆ విషయం నిజమేనని ఆయన పేరు ఆర్. డి. కిట్టూర్ అనీ, ఆయన హోమ్ ఎఫెయిర్స్ మంత్రిగారనీ బయటకొచ్చింది. ఆరోజంతా విధానసభ బుల్లి సైజు రణరంగంగా ప్రారంభమయి, కురుక్షేత్రంలా ముగిసేవరికి ఆ మర్నాడు మంత్రి కిట్టూరుగారు రాజీనామా యిచ్చారు.

'అమ్మాయినా, తనకా అమ్మాయి ఎవరో బొత్తిగా తెలీదనీ, తాను నిరపరాధిననీ విధివంచితుడననీ అన్నారు మంత్రిగారు. తనకోసం ఎవరు వచ్చినా దర్శనమీయడం తన కర్తవ్యంగా భావించడం వల్ల అదే విధంగా ఆమెకుకూడా 18 వ తేదీ వుదయం తొమ్మిది గంటలకు దర్శనమిచ్చినట్టు, అంతక్రితమే తాను ఢిల్లీ నుంచి వచ్చి కాలకృత్యాలు ముగించి, పూజ చేసుకుని బయటికొచ్చినట్టు ఆయనన్నారు. ఆమె మాట్లాడే విధానం తనను కలవరపెట్టిందనీ, బహుశా ఆమెకు మతిస్థిమితం లేదేమోనని తన కనుపించిందనీ, అందువల్లనే తాను పోలీసు సహాయం కోరాననీ కూడా ఆయన నివేదించారు. ఆ 'ఆశానికేతన్' లో తన స్నేహితురాలు పద్మ అనే ఆమె వున్నదని ఆమె చెప్పినందువల్ల ఆమెను అక్కడికి పంపి బాధ్యతగల మంత్రిగా తాను ప్రవర్తించానని ఆయనన్నారు.

తీగలాగితే అనుకున్నకన్నా చిక్కువగానే డొంక కదిలింది.

ఆయన కామెతో పరిచయం లేదనడం శుద్ధ అబద్ధమని పోయిన్నెల బెంగళూరు లాల్‌భాగ్‌లో జరిగిన బుల్లి కాంగ్రెసు సభలకామె మంత్రి కిట్టూర్ కారులో వచ్చిందనీ, ఆయనతో ఆమె అసలెంత కాలంగా వుంటుందో ఆ పరమాత్మునికే తెలియాలని వ్యతిరేకపార్టీ నాయకుడు శ్రీ హెడ్జే ఎసెంబ్లీలో ప్రకటించారు.

ఆమె పేరు సుమిత్రా దేశాయ్ అనీ; బొంబాయిలో ఆమె పట్టం పుచ్చుకున్నదనీ తెలిసింది.

అసలు సుమిత్ర పరారీ అవలేదనీ, మాయం అంతకన్నా అవలేదనీ, కేవలం పోలీసు అధికారులు ఆమెను దాచారనీ, తాము అనుకున్న విధంగా ఆమె వద్దనుంచి సమాధానం రాబట్టి, ఆనకవారు ఆమెను వదులదలచుకున్నారనీకూడా ఆయనన్నారు. సుమిత్రేగాక, ఆమె అన్నగారుకూడా అంతర్ధానమై పోయారనీ, యీ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోకపోతే ఏ విషయమూ తేలదని తన అభిప్రాయమనీకూడా ఆయనన్నారు. 20 వ తేదీన ఆమె ఫోటో కాపీలు కొన్ని పోలీసు డిపార్టుమెంటులో కొందరు అధికారులకివ్వబడ్డాయనీ, కానీ వీరందుకొన్న వెంటనే అవి యిచ్చినవారే తీసేసుకున్నారనీ, దీనికి కారణం బోధపడటం లేదనీ, చివరికి ప్రచురణ నిమిత్తం ఆ ఫోటో పత్రికల వారికివ్వడానికి యివ్వ నిరాకరించబడిందనీకూడా ఆయన సభకు తెలియజేశారు.

సుమిత్రా దేశాయి గుజరాత్ బుల్సార్ జిల్లాలోని ఢిగారా గ్రామానికి చెందినదట. ఆమె తండ్రి రఘునాథదేశాయ్. ఆమె అన్నగారు సుమన్‌దేశాయ్ ట్రాంబేలోని బాబా ఆటమిక్ రిసర్చి సెంటరులో సైంటిఫిక్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు, తనవల్లనే తన అన్నగారి వివాహం యింతకాలం ఆగిపోయిందన్న అపవాదు భరించలేక, ఆమె యిల్లు వదలి వెళ్ళిపోయిందట. ఆయనకిటీవల వివాహమయ్యింది.

ఆమెకు కిట్టూర్‌తో పరిచయం యిదివరకే వుందనీ, వోసారాయన ఢిల్లీనుంచి బెంగుళూరు వెళ్తూ బొంబాయిలో ఆగారనీ అప్పుడే వారిరువురకూ పరిచయం ఏర్పడిందని వో గుజరాత్ పత్రిక రాసిందట.

(ముగింపు పైవారం)

పుస్తకాలు

భక్త కబీరు

పద్యకావ్యము. గ్రంథకర్త: శ్రీ బి. జయరామ రెడ్డి, డెమ్మీ10—137 పేజీలు. గట్టిబైండు. వెల : 4రూ. ప్రతులకు: శ్రీ బి. రామక్రిష్ణారెడ్డి, పెద్దవడుగూరు పోష్టు, గుత్తి తాలూకా, అనంతపురం జిల్లా.

పారమార్థిక చింత కలవారూ, భక్తులూ, శ్రీరామ కృష్ణానందస్వామి శిష్యులూ అయిన జయరామరెడ్డిగారు ఇదివరలో,అద్వైత సారసంగ్రహము, ఉపదేశమంజరి' అనే రెండు గ్రంథాలనురచించారు. ఆధ్యాత్మిక విషయాలనుగురించి తెలిసికొనుటకు అవి మిక్కిలి ఉపయోగకరములై ఉండవచ్చు. వాటితో పాటు ఒక భక్తవరుని చరిత్రను కూడా పద్య కావ్యంగా వ్రాయాలనే సంకల్పంతో కబీరుచరిత్రను కథావస్తువుగా గ్రహించి దీన్ని రచించారు.

తెలుగులో ప్రసిద్ధంగా ఉన్న మహాభక్తవిజయం దీనికి ఆధారం. అందులోని కబీరు చరిత్రలో కొన్ని అభూతకల్పనలు, మానవాతీతాలైన సన్నివేశాలు ఉన్నవి. రచయిత వాటిని తొలగించి, మధురసన్నివేశాలతో ఆయన ఉదాత్తవ్యక్తిత్వాన్ని లోకానికి తెలుపుటయే ఉద్దేశంగా సులభమైన పద్యకావ్యంగా దీన్ని రచించారు.

కబీరు బమ్మెరపోతరాజుగారి సమకాలీనుడనీ, కంచెర్ల గోపన్న (రామదాసు) సమకాలికుడనీ విభిన్నాభిప్రాయా లున్నవి. కాని దేనికీతగినచరిత్రాధారాలు లేవు. జయరామరెడ్డిగారు ఇతడుగోపన్న సమకాలికుడనే ఇందులో వ్రాశారు. శ్రీరాముడు కబీరు మున్నగువారిని పరీక్షించడం, నారదమహాముని రావడం మొదలయిన విషయాలు కొన్ని అతిశయంగా వర్ణించ బడినట్లు తోస్తున్నది. కబీరు రామభక్తుడయినా, అతని అత్తవారు స్వమతాభిమానం గల మహమ్మదీయులు. అందువల్ల కబీరు భార్యపేరు 'సుందరి' అయి ఉండదేమో అని తోస్తున్నది. తనకు భక్తి ప్రవత్తులమీద ఆసక్తియే గాని తగిన భాషా లక్షణజ్ఞానం లేదని సగుణారాధన నిర్గుణారాధనకు మార్గదర్శకం కాగలదనే విశ్వాసంతో తన ఆశయాన్ని వెల్లడించడానికి దీని రచన సాగినదని రచయిత తెలుపుతున్నారు. దీనికి తొలిపలుకు వ్రాసిన మహాకవి గడియారం వేంకటశేషశాస్త్రిగారున్నూ 'ఈయన ఛందో వ్యాకరణాది శాస్త్రము లంతగా జదివినట్లు కనబడదు అని తెలుపుతున్నారు.

ఇందులో ఛందోవ్యాకరణాధిదోషాలు ఎన్నో కనిపిస్తున్నాయి. దుయ్యబట్టితనుచు దోషుడనకు (పుట 16) ఎంచకన్ దెలుపుడా—(కళ)ద్రుతాంతంగా వాడబడింది.పు. 18) తను యెంచి (తా నెంచి—అనుటకు పు.21) ఆకలెటు దీరునో? (పు.22) వ్రడంగమపిట్టమాడ్కి వాని బొడిచితిన్)పు.23) దరిద్రపారునకు (పు.29) చర్మము జీలగ రక్తధారలున్, వలువను నెరజేయుతరి (పు.35) అరవిందోదర! నీదులీలను మహాత్మ్యంబులన్ బ్రహ్మయే (ఈ మత్తేభపాదంలో ఛందస్సు పోయింది. పు.36) బంధించి త్రాట దన్నెడువానిన్ (పు.81) బుద్ధిం దోపగాలేదా?ని (ఛందోభంగం పు. 86. ప.11) ఇట్టివి ఇంకా చాల ఉన్నవి. అర్ధానుస్వారాలు, సరళాదేశాలు ఇచ్చవచ్చినట్లు నడిచాయి. 'ముడ్డిరుగంగొట్టి' వంటి జుగుప్సాకర ప్రయోగాలు (పు.127),అచ్చుతప్పులతో పాటు గ్రంథాపకర్షాధాయకాలు కానవస్తున్నవి. కవికి పద్యరచన ' ప్రారంభావస్థలో ఉన్నట్లున్నది.

గ్రంథం ఇలా ఉన్నా పీఠికాకర్తలు శ్రీగడియారం—రామకృష్ణ శర్మగారు' ఈ కావ్యరచనలో వీరు ప్రకటించిన ప్రతిభ రచనాసౌందర్యములు ఆధునికకవులకు పథనిర్దేశకములై యున్నవి'అని వ్రాస్తున్నారు. గ్రంథాన్ని ఆమూలాగ్రంగా చూచి నట్లయితే ఆయన ఇలా వ్రాసి ఉండరు. లేదా మొగమాటానికయినా ఇలా వ్రాసి ఉండాలి.

జయరామరెడ్డిగారి వచనరచన బాగుగా ఉంటుంది. ఆయన దీన్ని వచనంలో వ్రాసిఉంటే బాగుండేది. —గౌతమి.

1 అరవింద దర్శనము — వేదముల మహాత్మ్యము :


రచయిత— శ్రీ కాకుమాను తారానాథ్. ప్రకాశకులు : ఆంధ్ర గీర్వాణవిద్యాపీఠము, కొవ్వూరు, పశ్చిమగోదావరిజిల్లా, 7/8 క్రౌను 116 పుటలు. వెల: రు. 2లు.

2. అరవింద దర్శనము : మన జాతీయవాదము : రచయిత:శ్రీ కాకుమాను తారానాథ్. ప్రతులకు శ్రీ కాకుమానుతారానాథ్, సబ్ ర్డినేట్ జడ్జి,— కొవ్వూరు, పశ్చిమగోదావరిజిల్లా, 1 8 క్రౌను, 120 పుటలు. వెల: రు. 2లు.

శ్రీ అరవిందులది ఒక మహనీయ దర్శనము. అందు మనకు గోచరమగునది కేవల బుద్ధివైభవము కాదు. బుద్ధ్యతీతమైన ఒకానొక పూర్ణానుభూతిని పురస్కరించుకొని తదనుగుణంగా బుద్ధివైభవమును పంచకళ్యాణివలె పరుగులెత్తించిన అద్భుత ప్రజ్ఞావిశేషం ఆయన రచనలలో మనకు కన్పిస్తుంది. అయ్యది సమన్వయ ప్రధానమగు సమగ్ర దర్శనము.

ప్రాచీన విజ్ఞానాన్ని అర్వాచీన విజ్ఞానాన్నీ — రెంటినీ ఆపోశనం పట్టారాయన. రెంటికీ మూలమైన సత్యజ్యోతిని కనుగొని,దాని వెలుగును భూతము నుండి వర్తమానము ద్వారా భవిష్యత్తుకు ప్రసరింపజేశారు. జగత్కథనుసరిగా అవగాహన చేసుకొని భవిష్యత్తులో లోకకళ్యాణమునకు బాటలు నిర్మించుకొనవలెనంటే అందుకు అరవింద దర్శనమును నెడుగడగా చేసుకొనడం అత్యావశ్యకం.

ప్రపంచ వాఙ్మయంలోకెల్ల అత్యంత ప్రాచీనమైనవిగా పరిగణించబడే వేదబుక్కులను, శ్రీ అరవిందులు అపూర్వమైన ఒక్క్రొత్త అర్థము నివ్వగలుగుట నిజంగా ఆశ్చర్యకరం. దాని ప్రకారం, కేవలం కర్మపరంగా సాంప్రదాయిక పండితలోకంచే అన్వయించచూసిన కర్మకాండ విభాగం కూడా జ్ఞానపరమైన అంతరార్థ స్ఫోరకమై, జ్ఞానకాండగా చెలామణియగు ఉపనిషత్తులకు కుదురువంటిదగుచు మనకు సాక్షాత్కరిస్తూ వున్నది.



వేదఋక్కులకు శ్రీ అరవిందులు చెప్పిన అర్థం స్థూల, స్థూలదృష్టికి వాటి అన్వయమున పొడగట్టే అసందర్భము లెన్నియో సుసమన్వితములై వేదార్థ గాంభీర్యము నపారంగా విస్తరింప జేస్తున్నవి. కాని విచిత్రమేమంటే, మన సాంప్రదాయిక పండితలోకానికి కర్మపరంగా అన్వయించిన సాయణ భాష్యం మాత్రమే ప్రమాణం.

పాశ్చాత్య వేద పండితులు వేద ఋక్కులను నేటి వైజ్ఞానికపు దృక్పథపు క్రమవికాస సిద్ధాంత రీత్యా ప్రాక్తన మానవుని ప్రకృత్యారాధనా ప్రవృత్తి ద్యోతకములుగ పరిగణించగా, భారతీయ సాంప్రదాయిక వేద పండితులు కర్మపరమైన అర్థమునకే వాటిని సంకోచింప చేసినారు. శ్రీ అరవిందులకు వారిలో జ్ఞానపరమైన అర్థం స్ఫురించడం వేద ఋషుల ఋషిత్వ సహాయనలో ఆవిష్కారం చెందడం వలననే.

అప్పను, ఋషికి గల సమ్యగ్దర్శనంలోనే ఆయన, వేదఋక్కులనే కాక, ఇంకా ఎన్నో విషయాలను పరీక్షించి లోకకళ్యాణమునకు క్రొత్త వెలుగు లందించారు. జాతీయతను గురించి ఆయన యిచ్చిన సందేశాలు ఇటువంటి కాంతి ప్రసారణలే. ఆయన దృష్టిలో జాతీయతకు మానవ ప్రగతిసాధనలో ప్రముఖస్థానమున్నది. ఆయన జాతీయతలో, జాతీయ దురహంకారమునకు తావులేదు. విశ్వమానవైక్యం ఇంద్రధనస్సువలె శబలరోచిస్సులతో ప్రకాశించుటకు జాతీయత ఎంతగానో ఉపయోగపడుతుంది.

ముఖ్యంగా భారతజాతీయత జగత్కల్యాణార్థమున ఈశ్వరోద్దిష్టమయింది. వేదాలు ఆవిష్కారం చెందినప్పుడే ప్రపంచానికి ఆధ్యాత్మిక సందేశమందించే పాత్ర భారతదేశానికి విహితమయింది. గత చరిత్రలో వివిధ కాలములయందు వివిధ రీతులలో భారతదేశపు పాత్రను నిర్వహించివున్నది. ఈ ఆధునిక యుగంలో దీనిని మరొక ఫక్కిలో నిర్వహించుటకై భారతదేశమిప్పుడు మేల్కొనవలసియున్నది భారతజాతీయత శ్రద్ధాభక్తులతో ఉపాసించబడవలసిన అవసరం ఇందుకొరకే ఏర్పడుతున్నది.

భారత జాతీయతకు రాజకీయ పరంగా సంకుచితార్థం చెప్పి, ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారు భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించిన 1947లోనో, భారతజాతీయ కాంగ్రెస్ ఏర్పడిన 1885 లోనో భారతజాతి అనేది రూపొందినట్లు వ్యాఖ్యానించబూనటం ఈ దేశానికి గల మహోన్నతమైన సాంస్కృతిక చరిత్రను మలకు చేసి త్రోసివుచ్చడమే అవుతుంది. ఈ సాంస్కృతిక మూలాలు లేని రాజకీయ జాతీయత ఏ మహాకార్యములను సాధించగలుగుతుంది?

తన సాంస్కృతిక మూలమును నిర్లక్ష్యం చేసి, సంకుచిత స్వార్థ ప్రవృత్తుల విశృంఖల విహారమునకు మాత్రమే క్రీడారంగమై కన్పట్టుతూవున్న నేటి రాజకీయ జాతీయతను దేశోద్ధారకంగా మలచుకొట్టనెడి సమస్య దేశహితైషుల్నెల్లరను బాధిస్తూవున్నది. కాని, ఎన్ని విధాల ఆలోచించినా, నిర్లక్ష్య మొనర్పబడిన ఆ సాంస్కృతిక మూలమున పునః ప్రతిష్ఠితం కావడం తప్ప ఇందుకు వేరొక తరణోపాయం లేదు.

ఈ సాంస్కృతిక మూలం మతప్రసక్తి కలిగియున్న, దానివల్ల సంకోచం కొంతమంది ఆధునికులకు పొడసూపడం సహజం. కాని యిది మానవులను విడదీసే సంకుచిత మతంగాదు, —ఏక మొనర్చే విశ్వవిశాల మతం, సనాతన ధర్మం. జాతీయతను గురించి శ్రీ అరవిందుల ప్రబోధములను మనం పరిశీలించినప్పుడే యదార్థం మనకు స్పష్టంగా పొడగట్టకమానదు. భారత జనతాశక్తి స్వరూపిణియగు మాతృమూర్తిగా భారతదేశమును ప్రేమింప నేర్పుట ద్వారా మన ఈ జాతీయతనుపాసించిన యే శ్రీ అరవిందులు విశ్వమానవైక్య ప్రవక్తగా గూడ పరిఢవిల్లినారనే సంగతి మనం మరువరాదు.

శ్రీ అరవిందుల రచనలను విశేష శ్రద్ధతో అధ్యయన మొనర్చిన శ్రీ కాకువాను తారానాథ్ వేద విజ్ఞానమును గురించియు, జాతీయతను గురించియు శ్రీ అరవిందాభిప్రాయమును ఈ రెండు గ్రంథముల లోనూ కూడా విశదంగా వివరించినారు. ప్రౌఢమైన భాషతో ఆంగ్లమున ఆయన వెల్లడించిన భావలను తాను సరిగ అనువదించలేకపోతున్నానేమోయన్న సంశయంతో ఆంగ్ల భాషాభిజ్ఞులగు పాఠకుల కొరకై ఆంగ్లమూలములను సైతం ఎడనెడ విపులంగా ఉల్లేఖించినారు. భారతీయ సాంస్కృతిక వారసత్వమును గురించి ఆంగ్లమున ఇటీవల ప్రచురితమైన కొన్ని ఇతర మహాగ్రంథముల అవలోకనం సైతం రచయితకు రచనా వ్యాసంగమున సెంతగానో తోడ్పడినది.

—కమలాకర వెంకటరావు

* * *

సురేఖ: (నవల) వేగూరి దశరథ రామిరెడ్డి; రెండురూపాయలు. రాజశేఖర పబ్లికేషన్సు బాలాజీ నగర్ నెల్లూరు—2.

వరకట్నాల సమస్య కథావస్తువుగా సురేఖ ఆసమస్యను వివిధ కోణాలనుంచి చర్చిస్తూంది.

తెలుగుదేశంలో వరకట్నాలు చాల పీడాకరమైన సమస్య అయికూర్చున్నాయి. ప్రస్తుత విద్యావిధానం ఖర్చులు పెరిగి పోవడం, ఉద్యోగాలూ జీవికా అంతకంతకు దుర్భరం అవుతుండడం, స్త్రీ తు స్వామిక సంబంధాల పట్లు కుటుంబంలో బలంగా వుండడం—ఇవీ, ఇట్లాంటివీ అనేకంతో సమస్య ఇంత భయంకరం కావడానికి కారణం. అందరివిష యంలో ఇది ఒకే విధంగా వుండదు. ఒక్కొక్క కుటుంబంలో ఈ సమస్య ఒక్కొక్క రూపంలో ప్రత్యక్షమవుతటుంది.

సామాజిక వ్యవస్థలో సమూలమైన మార్పు రావాలి. స్త్రీ పురుషులందరికీ విద్యాం వుద్యోగ హామీ ఏర్పడాలి, యువతరానికి కుటుంబసంబంధాలలో స్వాతంత్ర్యం ఏర్పడాలి. ప్రేమ వివాహానికి మూలం కావాలి ఇటువంటికే కొద్ది గొప్ప పరస్పర సంబంధం వుంది. సమస్యని ఈ దృక్కో



కళావాహిని అధ్వర్యంలో కూచిపూడి ఆర్ట్స్ ఎకాడెమీ వారిచే శ్రీ కొంపటి చిన సత్యం దర్శకత్వంలో మదరాసులోని మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌లో ప్రదర్శింపబడిన 'శ్రీ కృష్ణ పారిజాతం' నృత్య నాటికలో పద్మ (రుక్మిణి), మంజులా భార్గవి (కృష్ణుడు).

పుస్తకాలు

...లోరచి విడుదల్కాకపోతే, ఈ అవగాహనలేకపోతే ప్రవం చెప్పే విరుగుడులూ, పరిష్కార మార్గాలూ అసహజంగా అపహాస్య జనకంగా వుంటాయి. సురేఖ నవలలో జరిగిందదే.

పైగా తెలుగు సినీమాల కృత్రిమ వాతావరణంతో నవలనడిచింది. సామాజిక సంబంధాలూ వ్యక్తుల మధ్య సంబంధాలూ చాల అసహజంగా వున్నాయి. చివరకు హత్యా ప్రయత్నాలు, ముసుగు మనుష్యులు, మోటార్లలో తరుముడు, కాల్పులు, పశ్చాత్తాపాలు వగైరా వెండి తెరసాధన సామగ్రి పుష్కలంగా అందచేసేరు.

పూలబంతులు : (కథల సంపుటి) జి. వెంకట్రావు. మూడు రూపాయలు. రవి—చంద్రా ప్రచురణలు, రాజాం, శ్రీకాకుళంజిల్లా (ఆం. ప్ర.)

దీనిలో నాలుగు కథలున్నాయి. అందివచ్చిన అదృష్టం— భారతపాకిస్తాన్ యుద్ధంగురించిన కథ. వాస్తవికతకు ఏమాత్రం సంబంధంలేకుండా వీరదేశభక్తిని ఎల్లా చూపించ వచ్చునో ఈ కథను మచ్చుగా చూపవచ్చు.

సమాజ వికాస కార్యక్రమాలు, అధికదిగుబడి పంటలకు ప్రభుత్వం బహుమానాలివ్వడం రెండో కథ కృషి ఫలితం.

బొంబాయినుంచి ఆనందరావు ఆంధ్రదేశం వచ్చి ఒక నగరంలోని జట్కావాళ్ళు, టాక్సీ డ్రైవర్లతో ఆంధ్రనగరాల రోడ్ల గురించి ముచ్చటించడం మూడోకథ "ఇల్లా వున్నాయి కొన్ని మహాపట్నాలు"లోని వస్తువు.

ఆఖరు కథ, పెద్దకథా సర్కస్. ప్రాచ్య— పాశ్చాత్య సంస్కృతుల సమ్మేళనం కథావస్తువు దీనిలో. మన అల్ప బుభద్దులూ మూర్ఖత్వాలూ శ్రీనివాసపదచింతనలకూ ఆపాటం లేకుండా పాశ్చాత్య నాగరికత కూడా సర్కస్ వంటి పవిత్రాత్మలను సృష్టించ గలదనే ఉదాత్తతను తెలుపుతూంది కథ.

ఈ కథలలోని దృశ్యాలూ, ఘట్టాలూ ఇతరులు కొట్టివేయగలరనే భయం రచయితకు చాల అధికంగా వున్నట్లుంది. అందుచేత అట్టమీదనే హెచ్చరికనిస్తూ గమనికను ముద్రించడం చాలా దూరదృష్టితో చేసిన పని. —**అవంతి.**

సవరలు

రచన: జి. వి. రామమూర్తి, దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్సు, శరత్ బిల్డింగ్సు, విజయవాడ—2, 1972, వెల: ఐదు రూపాయలు, పుటలు: 146.

సవరలు మన దేశపు ప్రాచీన ఆదిమవాసులలో ఒకరు. సీతాదేవిని వెతుక్కుంటూ శ్రీరాముడు అరణ్యములలో తిరుగుతున్నప్పుడు, శ్రీరామునికి భక్తి వినేయతలతో ఫలహారములను పెట్టి నమస్కరించిన స్త్రీ సవరస్త్రీ. ఆమె శబరి. అంటే శ్రీరాముని కాలమునాటికే సవరలు మన దేశములో ఉండినట్లు తెలుస్తున్నది. పూరీలోని జగన్నాథ స్వామిని సవరలు ఒకప్పుడు అడవులలో పూజిస్తూ వుండేవారు. ఆ కాలంలో పూరీ రాజుకు సవరలకు మధ్య ఏర్పడిన ఒప్పందములోని కొన్ని షరతులు ఈ నాటికి కూడ ఆచారములుగా నిలిచి ఉన్నవి. జగన్నాథస్వామి రథమును జాత్రలో లాగుటకు సవరలు పేనిన మోకునే ఉపయోగించవలయును. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహిస్తున్న నదులలో గోదావరి ఒకటి. 'గోదావరి' అన్న పేరు సవరలకు సంబంధించినది.

గంగానది దిగువ ప్రాంతమునుండి దక్షిణమున గోదావరి వరకు ఒకప్పుడు నివసిస్తూ ఉండిన సవరలు, ఇప్పుడు ఒరిస్సా రాష్ట్రంలో గుణపురం, మందాసా, పర్లాకిమిడి తాలూకాలలోని కొండల మీదను, ఆంధ్రప్రదేశ్‌లోని పాత పట్నము, టెక్కలి, పాలకొండ తాలూకాలలోని కొండల మీదను, ఉత్తర ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌వద్దను, సింగ్‌భూమ్, సంబల్‌పూర్ కొండలపైనను నివసిస్తున్నారు.

సవర భాష ప్రాచీన ఆదిమ నివాస కుటుంబమునకు చెందినది. సంస్కృతము, మున్నగు ఆర్య భాషా కుటుంబమునకు గాని, తెలుగు, తమిళము మున్నగు ద్రావిడ భాషా కుటుంబమునకు గాని చెందినది కాదు.

అలంకరణ, ఆభరణాల పట్ల మానవ వర్గాలలో అభిప్రాయ భేదాలుంటాయి. చెవి తమ్మలను కుట్టించుకొని చెవి రంధ్రములను సాగదీసి, ఆ రంధ్రములు ఎంత పెద్దవియై, ఎంత క్రిందకు సాగితే అంత అందమని సవరల భావము.

సవరలలో జాతులు వృత్తిని బట్టి వచ్చాయి. బుట్టలు అల్లుకుని జీవించే సవరలకు కిండల్ సవరలని పేరు. సవర భాషలో 'కిండల్' అంటే బుట్ట అని అర్థము.

రచయిత సవరల పెళ్ళిళ్ళు, గ్రామ పరిపాలన, చావు, వ్యాధి చికిత్స మొదలైన అంశాలనుగురించి విపులంగా రాశారు. ఆదిమనివాసులు సాంఘికంగా వెనుకబడిన వారైనా, వాళ్ల నమ్మకాలు, జీవిత విధానం, అమాయకత్వం పరిశీలిస్తే చాల ఆశ్చర్యం కలిగిస్తుంది. సవరలను గురించి లోతుగా పరిశీలించి, అనేక విషయాలను సేకరించిన గిడుగు రామమూర్తిగారు, గిడుగు సీతాపతిగార్ల కృషి అభినందించవలసిన విషయం. ఎల్ విన్ వెరియర్ నాగ ఆదిమ నివాసులను గురించి చేసిన పరిశీలన లాగ, గిడుగువారు సవరలను గురించి చేశారు. రచయిత తన తండ్రి, తాతగారు సేకరించిన విషయాలను పొందుపరచి సవరలను గురించి మరో పెద్ద పుస్తకం రాస్తే బాగుంటుంది.

మానవ శాస్త్రము (ఆంత్రోపాలజి) పుస్తకాలు తెలుగులో ఉన్నవి చాల తక్కువ. విజ్ఞానాత్మకమైన, ఇలాంటి పుస్తకాలు చాల అవసరం. ఈ పుస్తకం రాసిన రచయిత కృషి అభినందనీయము.

—**నీలం శంకరనారాయణ.**

మొక్కల పెంపకం

రచన: యలమంచిలి వెంకటప్పయ్య. ప్రచురణ: విశాలాంధ్ర. వెల: రు. 2—50. 124 పేజీలు.

'మొక్కల పెంపకం' ఒక చక్కని ప్రయోజనకరమైన పుస్తకం. దానిలో విషయాలు చదువుతూంటే, మొక్కల మీద శ్రద్ధలేని వారికి శ్రద్ధ కలగడం అటుంచి, వూరికే ఉన్న ఖాళీ స్థలాలలో ఏవో మొక్కలు వేసి పెంచుదామనే శ్రద్ధ తప్పక కల్గుతుంది ఎవరికైనా.

పుస్తకంలో ముఖ్యంగా గులాబీలకు ప్రాధాన్యత ఇవ్వడమయింది. అనేక ఇతర పూలమొక్కల విషయం క్లుప్తంగా అవసరమైనంతవరకు చర్చించారు. ఆ తరువాత క్రోటన్స్, పళ్ళ చెట్లు, లాన్స్ లోబాటు, డ్రాయింగ్ రూమ్స్‌లో మొక్కల అలంకరణ కూడా చిత్రాలతో సహా వివరించారు. వీటన్నిటి సందర్భంగా అంట్లు కట్టడం, ఎరువులు వేయడం, మొక్కలను రోగాలనించి కాపాడడం వంటి విషయాలు చక్కగా వివరించారు.

కవర్‌పేజీ మీద మొక్కల పెంపకము అని లోపల పూలమొక్కల పెంపకం అవడం జరిగింది. అదేవిధంగా లాన్స్ సందర్భంగా కేవలం 5 పేజీలు ఉండగా, చివరివరకు ఉండే మిగతా 50 పేజీలు లాన్స్‌కిందనే విషయ సూచికలో చూపించారు. విషయసూచిక విపులంగా, సదుపాయంగా ఉంది. ఇంగ్లీషు వాడిన సందర్భాలలోనూ, తదితరంగా చిన్న చిన్న పొరపాట్లు కనబడ్డాయి. 'Garden to live on అనడానికి 'Garden to live in' (4 పే) అని scales కి sclales (15 పే) అని thrips కి గొంగళి పురుగులు అని (18 పే) కనకాంబరం కి cross andra అని (27 పే) తిమ్మన్నా (Thima) అని (36 పే) cater pillers కి బదులు cate Pillers అని (80 పే) ఉన్నాయి.

మొత్తం మీద సంకలన కర్త శ్రీ యలమంచిలి వెంకటప్పయ్యగారిని అభినందించాలి. గెటప్, బొమ్మలు బాగున్నాయి. కాని ఇటువంటి ప్రయోగాత్మక గ్రంథాలలో బొమ్మలు మరింత పెద్దవిగా ఉండడం అవసరం.

—**జమ్మి కోనేటిరావు.**

సుగుణ

శ్రీ జి. ఎస్. రామశాస్త్రి సంపాదకత్వంలో శ్రీ శ్రీనివాస బల విద్యాలయం (గాంధినగరం విజయవాడ—3)వారు ప్రచురించిన సుగుణ' ఆదర్శోపాధ్యాయుని అభినందన సంచిక మా కార్యాలయం చేరింది. 42 పేజీలు. అమూల్యం. ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna.



“శ్రీవారు–మావారు” చిత్రంలో వాణిశ్రీ.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

